# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు



మాస్టర్ పార్వతీకుమార్



ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2015 ప్రతులు : 1,000

ద్వితీయ ముద్రణ : 2020 ప్రతులు : 1,000

వెల : రూ॥ 100-00

© ధనిష్ఠ - 2015

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-50-0

ముద్రణ :

**త్రివేణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్**

మచిలీపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

ఆది కావ్యమగు "శ్రీమద్రామాయణము" అన్ని లోకముల యందును కీర్తింపబడుచున్నది. రామకథా మాధుర్యము ఎంత పొగడినను తనివి తీరదు. కోకొల్లలుగ రామకథను వివరించిన వేదవేత్తలు, ధర్మవేత్తలు, జ్ఞానులు, యోగులు, భక్తులు కలరు. రాముని మహిమ ఎన్ని విధములుగ కొనియాడినను అసంపూర్ణమే! పదహారు గుణములతో ప్రకాశించు శ్రీరామునికన్న ఉత్తమ మగు మానవుడు భూత భవిష్యత్ వర్తమాన కాలములలో గోచరింపడు.

రామునికి రాముడే సాటి. సౌకుమార్యమునందు గాని, సౌందర్యమునందు గాని, ధైర్య స్థైర్యములందు గాని, మానవత్వము నందు గాని, పరాక్రమమునందు గాని, సత్యమునందు గాని, ధర్మమునందు గాని, సమభావమునందు గాని, మిత్రత్వమునందు గాని, కరుణ దయాది గుణములయందు గాని, వినయమునందు గాని, విద్యయందు గాని రామునికి రాముడే సాటి. ఏ మానవుడైనను తనను తాను ఉద్ధరించుకొనవలె నన్నచో రాముని ఆదర్శముగ భావించి ఆరాధించవలెను.

రామకథకు చిన్నతనముననే ఆకర్షింపబడుట రామాను గ్రహము. రామగానము చేయుట కూడ రామానుగ్రహమే. శ్రీరాముడు ఇలవేల్పుగ నున్న గృహమున జన్మించుటకన్న మించిన అదృష్ట ముండదు. భక్తి వాతావరణమున తిరుగుట కూడ అదృష్టమే. పామరుడుగనే రామకథను గానము చేయుట, ఆరు సంవత్సర ముల పాటు రామాయణము వివరించుట జరిగినది. రామరసము వ్యసనమై, రామచింతన వీడుట అసాధ్యమై, రాముని గూర్చిన రచన ఏదియో ఒకటి సాగుచు నుండవలెనని, అట్టి యజ్ఞమున రామచింతన నిరంతర స్వస్థత కూర్చునను సౌఖ్యచింతనతో రామాయణము నందలి ఘట్టములను భక్తితో పరిశీలించుచు, అందలి సున్నితమగు ధర్మములను వివరించుట ప్రారంభమైనది. బాలకాండ, అయోధ్యకాండల యందలి ఘట్టములను 88 శీర్షికలుగ ఈ పుస్తకమందు అందించుట జరిగినది.

ఈ ద్వితీయ ముద్రణమునకు సహకరించిన శ్రీ పట్నాల ఉమామహేశ్వరరావు కుటుంబమునకు (శ్రీకాకుళం) శ్రీరామరక్ష కలుగవలెనని ఆశంసనము.

**- పార్వతీకుమార్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కరుణ | 11 |
| 2. | సత్సంతానము | 14 |
| 3. | తాటక వధ | 17 |
| 4. | సిద్ధాశ్రమము | 20 |
| 5. | పితృవాక్యము-గురువాక్యము | 22 |
| 6. | క్షమ | 24 |
| 7. | సునశ్శేపుని కథ | 30 |
| 8. | కోపము - తపస్సు | 32 |
| 9. | శివ ధనుస్సు | 34 |
| 10. | దానము | 37 |
| 11. | భయము | 39 |
| 12. | అనిర్వచనీయము | 41 |
| 13. | దైవికము | 43 |
| 14. | వాసనా బలము | 46 |
| 15. | పూజలు - హోమాలు | 48 |
| 16. | సదాచారం | 50 |
| 17. | లక్ష్మణుని దీక్ష | 52 |
| 18. | ఆర్య సంప్రదాయము | 54 |
| 19. | రాముడు - ఆచారము | 57 |
| 20. | దశరథుని వివేకము | 59 |
| 21. | స్వప్నము - శకునము | 60 |
| 22. | పని - ఫలము | 63 |
| 23. | తల్లి దీవెన | 65 |
| 24. | ఋషి గుణములు | 66 |
| 25. | సాటిలేని ప్రవర్తనము | 68 |
| 26. | శ్రీరాముని దైవ సూక్తము | 69 |
| 27. | లక్ష్మణ భక్తి | 72 |
| 28. | మంగళాశాసనము | 74 |
| 29. | రాముని ధీరత | 76 |
| 30. | భాషణా రహస్యము | 78 |
| 31. | రాముని హితోపదేశం | 82 |
| 32. | ప్రత్యక్ష దైవములు | 84 |
| 33. | లక్ష్మణుని శరణాగతి | 88 |
| 34. | రాముని అవతార లక్షణము | 91 |
| 35. | లక్ష్మణుని తత్త్వచింతన | 94 |
| 36. | త్రిజటోపాఖ్యానము | 96 |
| 37. | అతియశము | 99 |
| 38. | రాముని రూప సౌందర్యము | 101 |
| 39. | లక్ష్మణుని వినయము | 103 |
| 40. | లోకరీతి | 105 |
| 41. | లక్ష్మణ భక్తి | 106 |
| 42. | వరము - అపాయము | 108 |

43. దశరథుని భంగపాటు 110
44. సత్యపరాక్రమము 114
45. కల్యాణ గుణములు 116
46. సత్యము-ప్రణవము-ధర్మము-వేదము 119
47. ప్రత్యక్ష దైవము 122
48. రాముని లోదృష్టి 124
49. ధర్మార్థ కామములు 127
50. పితృసేవ - సూక్తము 129
51. కారణము - దైవము 130
52. దైవము 131
53. మాతృ ఆశీర్వచనము 132
54. స్త్రీ స్వేచ్ఛ 134
55. శరీరము-ఆత్మ-పరమాత్మ 136
56. లక్ష్మణుని కోరిక 138
57. లక్ష్మణుని ప్రార్థన 140
58. రాముని అప్రమత్తత 145
59. త్రిజటుడు-పురుష ప్రయత్నము 147
60. రాముడు-స్థితప్రజ్ఞ-ఆదర్శము 149
61. దైవము-గురువు-జీవుడు 151
62. సుమిత్ర రామదర్శనము 153
63. వశిష్ఠుని హెచ్చరిక 155
64. భరద్వాజుని సృష్టి 156
65. ఋషి వాక్కు 158
66. రాముని అవగాహనము 161
67. రాముని హితబోధ 163
68. భరతుని వాదము 167
69. రాముని హితబోధ 169
70. భరతుని దీక్ష 173
71. అనసూయ హితబోధ 178
72. అరణ్యము - వనము 180
73. రామాయణమునందు చార్వాక సిద్ధాంతము 183
74. రాముని హిత వాక్యములు 186
75. రాజారాముడు 188
76. శ్రీరాముని వన ప్రవేశము 190
77. జీవ స్వాతంత్ర్యము 193
78. విరాధుడు 195
79. తారకము 197
80. శాపము - అనుగ్రహము 199
81. మృత దేహ సంస్కరణ 201
82. రాముని దివ్యదృష్టి 203
83. శరభంగుని అపరిగ్రహము 206
84. రాముని అపరిగ్రహము 209
85. శరభంగ మహర్షి 211
86. పాలనా ధర్మ సూత్రములు 214
87. శ్రీరాముని దీక్ష - మహిమ 216
88. సుతీక్ష్ణుడు 218

# శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

## 1. కరుణ

శ్రీమద్రామాయణములో బాలకాండ యందు రెండు పిట్టలను గూర్చిన కరుణారసగాథ యున్నది. ఈ గాథయే వాల్మీకి మహర్షి హృదయము నుండి కరుణరసము పెల్లుబుకజేసింది. తత్కారణంగా ఛందోబద్ధమైన శ్లోకము వాల్మీకి మహర్షి నోటి నుండి వెలువడింది. చతుర్ముఖబ్రహ్మ వాల్మీకి మహర్షి నాశీర్వదించి, రామకథను అదే విధమగు ఛందస్సుతో చెప్పవలెనని- రామకథ నిరుపమానమని, వాల్మీకి మహర్షిచే రచింపబడి, రామకథ మహా కావ్య మవుతుందని, పుణ్యకావ్య మవుతుందని, ఆదికావ్యమై భూలోకమున శాశ్వత మగుతుందని ఆదేశిస్తాడు.

శ్రీ రామాయణ మహాకావ్యము కరుణరస భరితము. అట్టి కావ్యమును రచించే కవికి కారుణ్యము సహజముగ నుండవలెను. అట్టి కారుణ్యము కలిగించిన కథ- జంట పిట్టల కథ. ఆ కథ ఈ విధంగా యున్నది.

వాల్మీకి మహర్షి తన శిష్యుడగు భరద్వాజుని వెంటబెట్టుకొని నదీ స్నానానికి బయలుదేరుతాడు. రమణీయమగు వనమందు సాగుచుండగ అనురాగముతో తిరుగుచున్న క్రౌంచ పక్షుల జంట

ఒకటి కనిపిస్తుంది. ఆ రెండు పిట్టలు ఆడుతూ పాడుతూ రతిపారవశ్యము నందుండగ, బోయవాడొకడు పోతుపిట్టను గురి చూచి బాణముతో కొట్టివేస్తాడు. నేలమీద పడి నెత్తురులో పొర్లాడు చున్న పోతుపిట్టను చూచి పెంటిపిట్ట జాలిపుట్టేటట్లు ఏడుస్తుంది. పోతుపిట్ట దురవస్థ, పెంటిపిట్ట ఏడుపు వాల్మీకి మహర్షి హృదయము నందు కరుణారసమును ఉద్భవింపజేస్తాయి. అది నిమిత్త కారణముగ మహర్షి ఛందోబద్ధమగు 24 అక్షరములు గల శ్లోకాన్ని అప్రయత్నంగా పలుకుతాడు.

పై కథలో వాల్మీకి మహర్షికి జరిగిన మహత్తర ఉపదేశం మనకు గోచరిస్తుంది. సర్వసాధనలు, భగవత్పరములగు అధ్యయన ములు, తపస్సు యిత్యాది వన్నీ గావించినను, హృదయమున భగవంతుని ఆహ్వానించినను, భగవంతుడు ఎల్లరికిని ప్రతిస్పం దించడు. కరుణ యున్నచోట ప్రతిస్పందించును. కరుణ లేనివారెన్ని మహత్కార్యములు చేసినను, అవి భగవంతుని మెప్పింప లేవు. సాటిజీవి దుఃఖము నందుండగ అది పట్టని జీవి ఎంతటి మహత్తర కార్యములు చేసినను నిరుపయోగమే. పిట్టలను వేటాడుట బోయవాండ్లు చేయు సర్వ సామాన్యమగు పనియే. కొట్టబడిన పిట్టను చూచి హృదయము ద్రవించుట ఎందరికి జరుగును!

చేపలు పట్టువారు ప్రతినిత్యము చేపలను పట్టుదురు. అట్లే జంతువులను వేటాడి సంహరించు వారును కలరు. మానవులు యితర జీవులను తమ స్వార్థమునకై హింసించు చుందురు. ఆహారము కొరకై ఒక ప్రాణిని మరొక ప్రాణి తినుట ధర్మము. కేవలమొక

వ్యసనముగ వేటాడుట, అందున రతిపారవశ్యమున నున్న జంట జీవులలో నొకదానిని వేటాడుట కఠినత్వము, క్రూరత్వము. మానవుడు యితర జీవులనే గాక, తోటి మానవులను కూడ హింసించుట ఈ ఆధునిక కాలమున, హృదయము ద్రవించుట అను పదమునకు అర్థముకూడ తెలియ దనిపించును.

కరుణ కలవాడే, కరుణను పొందును కూడ. కరుణతో నిండిన హృదయముగల వాల్మీకి మహర్షిని వాణీ బ్రహ్మ లనుగ్రహించినారు. **సత్పురుషులకు కరుణ ప్రధానమగు గుణమని** ఈ గాథ మనకు తెలుపుతుంది.

# 2. సత్సంతానము

సత్సంతానం కలగాలంటే బ్రాహ్మణోత్తముని ఆహ్వానించి, ఆరాధన గావించి, శుశ్రూషలు చేసి అతని మన్ననలను పొందాలి. అతని చిరకాల వాంఛ ఏదైనా నొకదానిని పరిపూర్తి కావించాలి. కోరికలు లేని బ్రాహ్మణుడైనచో అతడు నిర్దేశించిన యజ్ఞము (యజ్ఞ మనగ పరహిత కార్యము) నొకదానిని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి. ఇట్లు కావించినవారికి సంతానం తప్పక కలుగుతుందని రామాయణము బోధిస్తుంది. రామాయణమే దీనికి ప్రమాణము.

దశరథ మహారాజుకు సంతానము కలుగుటకు మహర్షులు, మంత్రులు పై విధమైన ఉపాయమునే తెలుపుతారు. సనత్కుమార మహర్షి భాషణముగ క్లుప్తంగా ఆ కథ ఈ విధంగా ఉంది.

"కాశ్యప మహర్షికి విభండకుడు అనే పుత్రుడు పుడతాడు. ఆ విభండకుడికి ఋష్యశృంగుడు అనేవాడు పుడతాడు. వాడు అడవి లోనే పుట్టి తండ్రి దగ్గర పెరుగుతాడు. అందువల్ల వయస్సు వచ్చి నప్పటికిన్నీ ఈ ప్రపంచములో అడవి తప్ప వాడు ఏ ఇతరమున్నూ ఎరుగకుండా ఉంటాడు. వాడు రెండు రకాల బ్రహ్మచర్యాన్ని అనుష్ఠిస్తాడు. అందుకు అతనిని ఈ లోకములో బ్రాహ్మణులందరు మెచ్చుకుంటారు.

ఆ ఋష్యశృంగుడు తండ్రికి సేవచేస్తూ, ఎప్పుడూ అగ్ని హోత్రాన్ని సేవిస్తూ బ్రహ్మచారిగా కాలము గడుపుతూ ఉండే రోజులలో అంగదేశమును రోమపాద మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు.

రోమపాదుడు అమిత బలవంతుడుగాను, మహా పరాక్రమ వంతుడుగాను రాజ్యపాలనము చేస్తూ ధర్మాన్ని వ్యతిక్రమిస్తాడు. అప్పుడు అంగదేశము అంతటా బహుకాలము వానలు కురవకుండా పోతవి. అప్పుడు రోమపాద మహారాజు చింతాక్రాంతుడు అయిపోయి వేదశాస్త్ర పారంగతులు అయిన బ్రాహ్మణోత్తము లందరినీ ఆహ్వానించి, "బ్రాహ్మణ శ్రేష్ఠులారా! తాము సమస్త ధర్మాలూ, లోకాచారాలూ తెలిసినవారు. ఈ అనావృష్టి దోషము తొలగిపోవడానికి ఏ విధమైన పాప పరిహారము నేను చేయవలెనో తాము సెలవీయవలెను" అని అడుగుతాడు.

"ఓ రాజా! ఏ విధముగానైనా, ఏ ఉపాయముతోనైనా విభండక మహర్షి పుత్రుడైన ఋష్యశృంగుణ్ణి తాము ఇక్కడికి రావించి, చక్కగా సత్కరించి, తమ కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి వివాహము చేసినట్లయితే అనావృష్టి దోషము అంతరించిపోతుంది. ఈ దేశమంతా సుభిక్షమవుతుంది" అని బ్రాహ్మణ వృద్ధులు చెబుతారు.

ఋష్యశృంగుణ్ణి అంగరాజ్యము రప్పించటము ఎట్లాగా అని అప్పుడు రోమపాదుడు ఆలోచిస్తాడు. ఆయనకు ఏ ఉపాయమూ తోచదు. అంతట మంత్రులను, పురోహితులను రావించి వారిని చక్కగా సత్కరించి, "మీరే ఋష్యశృంగుణ్ణి తీసుకొని రావలెను" అని రోమపాద మహారాజు ఆజ్ఞాపిస్తాడు. అందుకు మంత్రిపుంగవులూ, పురోహితులు ఖిన్నులైపోయి ముఖాలు వేళ్ళాడ వేసుకొని, "మహారాజా! విభండక మహర్షి అంటే మాకు అమిత భయము. అందువల్ల మేము అక్కడికి పోలేము. కాని, ఋష్యశృంగుణ్ణి ఇక్కడికి రప్పించే ఉపాయము అయితే మేము చెప్పగలము. మేము చెప్పే ఉపాయమువల్ల ఏ ఇబ్బందీ రాదు" అని చెపుతారు.

అంతట రోమపాదుడు ఆ మంత్రిపుంగవులు మొదలైనవారు చెప్పిన ఉపాయము చొప్పున ఋష్యశృంగుడి దగ్గరకు వేశ్యాంగనలను పంపిస్తాడు. వారు ఆయనను అంగదేశము తీసుకొని వస్తారు. అప్పుడు అంగదేశములో వానలు కురుస్తాయి. రోమపాదుడు తన కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి పెండ్లి చేస్తాడు.

ఆ ఋష్యశృంగుడు దశరథ మహారాజు చేత ఒక యజ్ఞము చేయిస్తాడు. అప్పుడు ఆయనకు పుత్రులు పుడతారు అంటూ సనత్కుమార మహర్షి చెప్పినాడు.

ఋష్యశృంగ మహర్షి రెండు రకాల బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించే మహర్షిగ వర్ణింపబడి ఉంది. ఒకటి – బ్రహ్మ ధ్యానమున నిమగ్నమై యుండుట, రెండు – స్త్రీ సాంగత్యము లేకయుండుట. అట్టివారు ఎచ్చట పాదము మోపినను అచటనావృష్టి యుండదు. సుభిక్షమే అవుతుంది. ఋష్యశృంగుడు తన బ్రహ్మచర్యంతో పాటు తండ్రిని, అగ్నిహోత్రాన్ని నిత్యమూ ఆరాధిస్తుంటాడు. ఈ నాలుగు గుణములు గల సాధుపురుషుని ఆహ్వానించి సేవలు, శుశ్రూషలు గావించువారికి సంతానమేగాక, సత్సంతానము దైవశీస్సుగ లభించును.

**సాధుజనులను ఆహ్వానించి, ఆదరణతో సమస్త సేవలు గావించు గృహస్థు యిహపర సంపదలను పొందగలడని** రామాయణ మందలి ఈ గాథ బోధిస్తుంది. సదాచారములలో సాధుజన సేవ ఒక ముఖ్య అంశము. ఇటీవలి కాలము వరకు కూడ యతులకు, సాధు పురుషులకు తమ గృహమున ఆశ్రయమిచ్చి, భోజనాది సౌకర్యము కలిగించి, వారి పాదసేవ నొనర్చుకొని తరించిన గృహస్థు లెందరో కలరు. ఈ సంప్రదాయము కొనసాగు గృహములు హెచ్చు కావలెను.

# 3. తాటక వధ

రామాయణంలో తాటక వధ కథ సుపరిచితమే. తాటక దుష్ట ప్రవర్తన కలిగినది యైనను స్త్రీయగుటచే వధించుటకు రాముడు శంకించటం, స్త్రీ అయిననూ సరే రాక్షస ప్రవృత్తి కలిగినపుడు సంహరించడానికి వెనుదీయరాదని విశ్వామిత్రుడు తెలపడం కూడ సుపరిచితమే. రాముని చరిత్రలో ప్రప్రథమంగా స్త్రీ వధ జరగటాన్ని ఆక్షేపించువారెందరో కలరు. ఈ ఆక్షేపణను ధర్మమెలా సమర్థిస్తుందో రామాయణమే బోధించింది.

తాటక జన్మచే యక్షిణి. యక్షులు సూక్ష్మ స్వరూపులు, బలవంతులు కూడ. తండ్రి తపస్సు ఫలితంగా వెయ్యి ఏనుగుల బలంతో తాటక పుట్టింది. జన్మతః ఆమె మంచి అందము కలది. అందానికి పేరుపడ్డది కూడ. ఈమె కుమారుడే మారీచుడు. అతడు కూడ ఎదిరించలేనంత పరాక్రమవంతుడు. తాటక భర్తయగు సుందుడు అతిక్రమించి దుండగాలు చేస్తుంటే అగస్త్యుడి శాప మహిమతో అతడు మరణించాడు. భర్తను సంహరించాడన్న కోపంతో తాటక మహాక్రోధంతో అగస్త్యుని మీదకు పోయి ఆయనను మ్రింగి వేయ ప్రయత్నించింది. అగస్త్యమహర్షి తాటకను కూడ శపించాడు. ఆమె అందమంతా అదృశ్యమై వికృతమగు ముఖము, ఆకారము ఏర్పడినది. మహర్షులనే మ్రింగు ఆమె స్వభావమును గ్రహించిన అగస్త్యుడు ఆమెను మహారాక్షసిగా తిరుగాడమన్నాడు. రూపసి, యక్షిణి

అయిన తాటక వికృతాకారిణి, రాక్షసిగా మారిపోయినది. అగస్త్యుని ఏమీ చేయలేక, కసితీరక, క్రోధము శమింపక మదముతో తాను నివసిస్తున్న మలద, కరూశ దేశాలను నాశనం గావించింది. ప్రత్యేకించి గోవులను, బ్రాహ్మణులను తినుటయందు ఆసక్తి కలిగి దేశమందలి గోబ్రాహ్మణులను పొట్టన పెట్టుకుంది. ఆ రెండు దేశములు తమ వైభవమును కోల్పోయి ఘోరారణ్యములైనవి.

ఒక స్త్రీ రూప రాక్షసి హద్దులేని అధర్మము నాచరించి దేశములనే పొట్టనబెట్టుకొనుచున్నపుడు సంహరింపవలెనా, వద్దా? కేవలము స్త్రీ యగుటచే క్షమార్హురాలా? ఆమె స్త్రీ రూపమున నున్న దుష్ప్రవర్తిని. మహాభయంకరురాలు. దేశములనే పొట్టనబెట్టుకొను పిశాచి. అట్టివారి యెడల సహనము అధర్మ మవుతుంది. ధర్మాత్ములు చతుర్వర్ణులకు కూడ మేలు చేయు కర్తవ్యము కలవారు. అందున శ్రీరాముడు క్షత్రియుడగుటచే ప్రజారక్షణమే ధర్మముగా కలవాడు. ప్రజారక్షణమునకు అవరోధము కలిగించునది ఏదియైనను దానిని నిర్జించవలెను. అది సనాతన రాజధర్మము.

పూర్వము దేవేంద్రుడు, శ్రీ మహావిష్ణువుకూడ స్త్రీ వధ చేసిన వారే. రాక్షసరాజగు విరోచనుడి కుమార్తె మంథర అనే ఆమె మొత్తము భూమినే నాశనము చేయ సంకల్పించింది. అపుడు స్త్రీ అని సందేహ పడక, ఇంద్రుడామెను సంహరించాడు. మరియొక స్త్రీ (శుక్రుని తల్లి) ఇంద్రునే సంహరించడానికి ధృడవ్రత మాచరించింది. అపుడు శ్రీ మహావిష్ణువే ఆమెను సంహరించినాడు.

వధను ధర్మం ఎప్పుడూ ప్రోత్సహించదు. కాని లోక కంటకులైన వారిని వధించుటయే ధర్మమని తెలియవలెను. అట్టి ప్రవృత్తి

గలవారు స్త్రీలైనను, పురుషులైనను ధర్మం దృష్టిలో ఒక్కరే. సామాన్య ముగ స్త్రీలు అబలలు, సుకుమారులు, పరాధీనలు అయి ఉంటారు కాబట్టి సంహరించకూడదనుట సామాన్య ధర్మము. **స్త్రీ గుణములు లేని లోక కంటకులగు స్త్రీలను వధించుట ధర్మమేనని** రామాయణము తెలుపుచున్నది.

# 4. సిద్ధాశ్రమము

శ్రీ విశ్వామిత్ర మహర్షి సిద్ధాశ్రమము నందు తన నివాస మేర్పరచుకొన్నాడు. సిద్ధాశ్రమము బ్రహ్మర్షియైన విశ్వామిత్రుడు ఎన్నుకొనిన నివాసస్థానము. అది ఒక సుందర ఉద్యానవనమువలె గోచరిస్తుంది. సమీప ప్రాంతంలో మహారణ్యమున్నప్పటికి, సిద్ధాశ్రమము ఒక ఉద్యానవనంలా దర్శనీయమై ఆహ్లాదకరంగా ఉంటుంది. అది మానవులచే ఏర్పరచబడినది కాదు. స్వతహాగ అచ్చటి నేల, సెలయేళ్ళు, మహావృక్షములు ఉద్యానవన ప్రభావం కలిగి ఉంటాయి. అచ్చటన్నియు సాధు జంతువులే తిరుగాడుతుంటాయి. జింకలు అటు, ఇటు పరుగిడుతుంటాయి. రంగురంగుల పిట్టలు మహాశ్రావ్యంగా పాటలు పాడుతూ ఉంటాయి. గాలి ప్రశాంతంగా వీస్తూ ఉంటుంది. సూర్యరశ్మి అతి చల్లగాను, అతి వేడిగాను గాక, జీవుల ప్రాణానికి ఉల్లాసం కలిగిస్తూ ఉంటుంది.

విశ్వామిత్ర మహర్షి ఆ ప్రాంతమును తన ఆశ్రమవాసంగా ఏర్పరచుకోవడానికి తగిన కారణమున్నది. అది శ్రీ మహావిష్ణువు తపస్సు చేసినటువంటి ప్రదేశము. దేవేంద్రుణ్ణి, దేవగణాలను, మరుద్గణాలను బలి చక్రవర్తి జయించివేసి ముల్లోకాలు రాజ్య పాలనము చేసిన సమయములో శ్రీ మహావిష్ణువు భూమికి దిగివచ్చి, ఈ ప్రదేశంలో కొన్ని వేల సంవత్సరములు తపస్సు చేశాడు. అదే సమయంలో కశ్యప ప్రజాపతి కూడ శ్రీ మహావిష్ణువును గూర్చి తపస్సు చేసి అతని దర్శన, స్పర్శన, సంభాషణాది అనుగ్రహములు పొంది

నాడు. కశ్యపుని తపస్సు ఆ ప్రదేశంలో సిద్ధించడం వలన, కశ్యపుడు ఆ ప్రాంతానికి సిద్ధాశ్రమమనే పేరు అనుగ్రహించమని శ్రీ మహా విష్ణువును వేడుకున్నాడు. మహావిష్ణువు కశ్యపుని ప్రార్థనను అంగీకరించి "సిద్ధాశ్రమము" అను నామము ఆ ప్రాంతానికి ఖాయం చేశాడు. అటుపైన మహా విష్ణువు కశ్యపునికి, అదితికి వామన రూపంలో అవతరించి బలి చక్రవర్తి ననుగ్రహించి ఈ ప్రాంతానికే ఏతెంచి నివసించాడు.

ఇట్లు మహావిష్ణువు తపస్సుగావించిన చోటు, కశ్యపుడు సిద్ధి పొందిన చోటు, వామనుడు నివసించినచోటు- శ్రీ విశ్వామిత్ర మహర్షి తన ఆశ్రమ జీవనానికి ఎన్నుకొన్నాడు. స్థల శుద్ధి, స్థల మహిమ, ఆ స్థలమందు జరిగిన పుణ్యకార్యములు, వాని మహిమ, ప్రభావము ఆ ప్రదేశములో అదృశ్యంగా ఉంటాయి. మహర్షులు సహితము దీనిని మన్నించి పుణ్యచరితము గల ప్రదేశమునందే వారు తపస్సులు కొనసాగించుటకు నిర్ణయించుకొందురు. ఇది రామాయణ మందించు ఒక దివ్య సందేశము. దైవ సానుకూల్యము, దైవానుగ్రహము పొందగోరువారు ఈ విధముగనే స్థల శుద్ధి నెరిగి నివాసముల నేర్పరచుకొనవలెను గాని, యితర భావములపై నాధారపడి కాదు. ప్రస్తుతకాలమున చెరువులు, ఎండిపోయిన వాగులు, గతకాలంలో పశువధ జరిగిన ప్రదేశములు, స్మశానములు కూడ నివాస ప్రదేశము లుగా మారుచున్నవి. ఇది కలి ప్రభావమే. **స్థల శుద్ధి, దేహ శుద్ధి, భావ శుద్ధి భగవదారాధనకు అత్యంత ప్రధానమగు విషయములని** రామాయణము తెలుపుచున్నది. బుద్ధిమంతులు దీనిని గమనింతురు గాక!

# 5. పితృవాక్యము - గురువాక్యము

శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడుగా పేరుగాంచాడు. అతడు గురువాక్య పరిపాలకుడు కూడ. గురువాక్య పరిపాలనమే అతనిని శస్త్రాస్త్ర బలసంపన్నునిగా చేసినవి. సత్కుల వంశమున జన్మించిన వారెందరో యుందురు. కాని సద్గురువు లభించినవారు కొందరే యుందురు. శ్రీరాముడు ఇక్ష్వాకు వంశములో పుట్టినవాడు. ఇక్ష్వాకు వంశము శ్రీమంతము, ధైర్యవంతము అయిన వంశము. ధర్మము మూర్తీభవించిన వంశము. ఇట్టి వంశమున జన్మించిన వారందరిలోను శ్రీరాముడు మేటియైనవాడు. అట్టి వానికి పితృవాక్య పరిపాలనము, గురువాక్య పరిపాలనము రెండు అభేద్యమగు కవచ ములుగా ఏర్పడినాయి.

విశ్వామిత్ర మహర్షి తన యాగ రక్షణకై రాముని వేడినపుడు దశరథుడు తటపటాయించి, వశిష్ఠుని హితబోధతో సంతుష్టుడై శ్రీరాముని బుద్ధిపూర్వకముగ, సంతోషముగ విశ్వామిత్ర మహర్షి వెంట పంపించడానికి అంగీకరించాడు. అప్పుడు రాముని వయస్సు 11 సం॥లు. అట్టివాడు భయంకరులగు రాక్షసులను నిర్జించగలడా?

దేహధారులయందు వసించు జీవప్రజ్ఞను, దానిని ఆవరించి యుండు దైవప్రజ్ఞను చూడగలిగిన వారే ఋషులు. వశిష్ఠ విశ్వామిత్రు లట్టివారు. రాముడు మహా శూరుడని గమనించియే విశ్వామిత్రు డతనిని కోరటం జరుగుతుంది. రాముని అవతారము దుష్ట రాక్షస సంహారమునకే గనుక, అవతార సాఫల్యమునకు మార్గము నందించిన

వాడు విశ్వామిత్రుడు. అటుపైన యితర ఋషులందరు (అగస్త్యుని వరకు) ఆ కార్యమే నిర్వర్తించారు.

సద్గురువు తనకై తాను శిష్యుని వద్దకు వచ్చుట ఆచారము. విశ్వామిత్ర మహర్షి అట్లే దశరథుని కొలువునకు వచ్చాడు. సద్గురువు ననుసరించు శిష్యునకు జన్మసాఫల్యము తథ్యము. రామకథయందు రాముని మానవుడను దృక్కోణమున చూచినచో ఇది గ్రహింపబడదు. **జన్మ సాఫల్యతకు అర్హతగల జీవునకు సద్గురువు సాన్నిధ్యమిచ్చి, అతని ప్రజ్ఞకు విశేషమగు శక్తిని లభింపచేస్తాడు. జీవుని పవిత్రత, సంసిద్ధత, సద్గురువు చూచు రెండు ముఖ్య లక్షణములు. సమర్థత గురు వేర్పరచ గలడు.**

11 సం॥లు వయస్సుగల రామునికి శస్త్రాస్త్రబలము విశ్వామిత్ర మహర్షే కలిగించాడు. విశ్వామిత్ర మహర్షి సమస్త దివ్యాస్త్రాలను వశపరచుకున్న వాడు. అతడు శివదేవుడంత మహిమ గలవాడు. ఉన్న అస్త్రములే కాక క్రొత్త శస్త్రాస్త్రములను కూడ ఆయన సృజించ గలడు. రామకార్యం సిద్ధించుటకే ఈ యత్నమంతా. అట్లే సద్గురువు కూడ శిష్యుని జన్మసాఫల్యానికి వలసిన శక్తి సామర్థ్యాలందిస్తాడు.

శ్రీరాముడు విశ్వామిత్రునియందు, వశిష్ఠుని యందు, అగస్త్యుని యందు, తాను సందర్శించిన సమస్త ఋషులయందు సద్గురువునే సందర్శించి, వారి ఆజ్ఞలను, సందేశాలను త్రికరణశుద్ధిగా పాటించాడు. రామాయణమందు గురువాక్య పరిపాలనము స్వయముగ శ్రీరాముడే నిర్వర్తించి చూపినాడు. పితృవాక్య పరిపాలనమే సామాన్యముగ రాముని నడత యందు ప్రశంసింతురు. కాని అతడి గురువాక్య పరిపాలనము అత్యద్భుతము.

# 6. క్షమ

రామాయణంలో పితృవాక్య పరిపాలనము విశేషించి తెలుపబడింది. తనయులే కాక, తనయలు కూడ పితృవాక్య పరిపాలనము ద్వారా కీర్తి, వృద్ధి పొందుదురను మరియొక కథ యున్నది. అది ఈ క్రింది విధంగా ఉంది.

బ్రహ్మమానస పుత్రుడు కుశుడు అనే తాపసి పూర్వము బ్రహ్మలోకము నుంచి ఈ భూలోకము లోనికి వచ్చినాడు. అతడు దృఢవ్రతుడు, ధర్మజ్ఞుడు, శౌర్య సంపన్నుడు. మహాకులీన అయిన విదర్భరాజపుత్రిని పెండ్లి ఆడినాడు. ఈడూ జోడూ అయిన ఆ దంపతులకు కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తజనుడు, వసువు అనే నలుగురు పుత్రులు పుట్టినారు. ఆ నలుగురు తండ్రితో సరి సమానము అయిన సద్గుణ సంపన్నులు. అమిత తేజోవంతులు. మహోత్సాహులు. పరమ ధార్మికులు. సత్యసంధులు.

వారు నలుగురూ క్షత్రియ ధర్మాన్ని అవలంబించవలెను అని కుశుడు నిశ్చయించినాడు. ఈ భూమిని నాలుగు భాగములు చేసి వారికి ఇచ్చి, "ఓ పుత్రులారా! మీ మీ భూభాగాలను మీరు రాజ్యము ఏలవలెను. మీకు అందువల్ల పుణ్యం వస్తుంది" అని చెప్పినాడు. తండ్రి నిర్ణయించినందువల్ల నలుగురూ రాజ్యపాలనాసక్తులు అయినారు. లోక సమ్మతముగా రాజ్యపాలనము చేయడానికి ముందుగా రాజధానీ నగరాలను కట్టించడము మొదలు పెట్టినారు. మహాతేజోవంతుడు అయిన కుశాంబుడు కౌశాంబీ నగరాన్ని

కట్టించినాడు. ధర్మాత్ముడు కుశనాభుడు 'మహోదయము' అనే పట్టణాన్ని కట్టించినాడు. అధూర్తజనుడు 'ధర్మారణ్యము' అనే పట్టణాన్నీ, వసువు 'గిరివ్రజము' అనే పట్టణాన్ని కట్టించినారు.

ఈ ప్రదేశము వసురాజు రాజ్యములోనిది. ఈ దేశము చుట్టూ ఐదు కొండలు ఉన్నవి. అందువల్లనే రాజధానీ నగరమునకు 'గిరివ్రజము' అని పేరు పెట్టినారు. మంగళకరము అయిన ఈ శోణనదమే 'సుమాగధి' అని ప్రసిద్ధి కెక్కింది. ఈ నది నుంచే ఈ దేశాన్ని 'మగధ దేశము' అని కూడ అన్నారు. ఈ మాగధీనది ఐదు కొండల మధ్యనూ పూలమాల వలె శోభాయమానముగా తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తూ ఉంది. వసురాజు మాహాత్మ్యము వల్ల ఈ నదీ జలాలు పారినంత మేరనూ భూమి సుక్షేత్రము అయింది. సస్యశాలిని అయింది. సుభిక్షము అయిన దేశమున్నూ అయింది.

కుశుడి రెండవ కుమారుడు కుశనాభుడు రాజర్షి, ధర్మాత్ముడు. 'ఘృతాచి' అనే అప్సరాంగనను పెండ్లి ఆడినాడు. ఆ దంపతులకు నూరుగురు ఆడపిల్లలు పుట్టినారు. వారు అసమాన రూపవతులు. ఆ రూప యౌవన సంపన్నులు ఒకనాడు సొమ్ములు అన్నీ పెట్టుకొని, ఇంకా గంధ పుష్పాదులతో చక్కగా అలంకరించుకొని తొలకరి మెఱపువలె మెరసిపోతూ ఉద్యానవనానికి పోయినారు. అక్కడ గుబురుగా ఉన్న చెట్ల మధ్యను వారు సంతోషాతిశయముతో వీణలు వాయిస్తూ, సంగీతాలు పాడుతూ, నృత్యము చేస్తూ సర్వాంగాలూ శోభిస్తూ ఉంటే, కారుమబ్బులలో తళుక్కుమనే చుక్కలవలె కనిపించారు.

వాయుదేవుడు వారిని చూచి దగ్గరకుచేరి, "ఓ కన్నెలారా! మిమ్ములను నేను వలచినాను. మీరు అందరూ నన్ను పెండ్లి ఆడ వలసింది. మీకు మానవత్వము వదలిపోతుంది. ఇక మీకు

జరామరణాదులు ఉండవు. మీరు దేవకన్నెలు అవుతారు. మీ యౌవనము అక్షయము అవుతుంది” అన్నాడు.

ఆ కన్నెలు నవ్వుతూ, “ఓ వాయుదేవుడా! నీ ప్రభావము మేము ఎరుగుదుము. నీవు ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ ఉంటావు. నీకు ఏ అడ్డూ లేదు. ఎక్కువ తక్కువలూ లేవు. ఇప్పుడు మమ్ములను ఎందుకు అవమానించ తలచినావు? మేము కుశనాభుడి కూతుళ్ళము. నిన్నే కాదు, నీ ప్రభువు అయిన దేవేంద్రుణ్ణి కూడా పదభ్రష్టుణ్ణి చేయగలము. ఇంతమాత్రానికి మా శక్తియుక్తులను వ్యర్థము చేయడము ఎందుకు అని ఊరుకుంటున్నాము. నీ దుర్బుద్ధి మా తండ్రికి తెలిస్తే నిన్ను హతమారుస్తాడు, జాగ్రత్త. మమ్ములను అవమానించవద్దు. మేము ధర్మము తప్పము. మా తండ్రే మా ప్రభువు, పరమదైవము. ఆయన మమ్ములను ఎవరికి ఇవ్వవలె ననుకుంటే వారినే భర్తగా వరిస్తాము” అన్నారు.

వాయుదేవుడికి పట్టరానికోపం వచ్చింది. వారిని వశపరచు కోవలెను అనుకొన్నాడు. వారి సర్వావయవాలలోనూ దూరినాడు. అంతట వారందరూ కురూపలూ, కుబ్జలూ అయిపోయినారు. అడుగులు తడబడుతూ తండ్రి దగ్గరకు పోయి ఏడుస్తూ నేలమీద కూలబడ్డారు.

కుశనాభుడు వారిని అందరినీ చూచినాడు. పరమశోభనలు అయినవారు అట్లా కురూపలూ, కుబ్జలూ అయిపోయినందుకు ఆశ్చర్యచకితుడు అయి “పిల్లలారా! ఇది ఏమిటి? చెప్పవలసింది. మీరు ఇట్లా కురూపలూ, కుబ్జలూ ఎందుకు అయిపోయినారు? ఎవడు అయినా ధర్మహాని చేసినాడా? పలుకరేమి? ఏడుస్తారు, మాట్లాడరు ఎందువల్ల?” అంటూ నిట్టూర్పులు విడిచినాడు.

ఆ కన్నెలు తండ్రి పాదాలు పట్టుకొని "ప్రభూ! ఈ ప్రపంచము అంతటా సంచారము చేసే వాయుదేవుడు మమ్ములను బలాత్కరించినాడు. ధర్మాన్ని పాటించలేదు. అక్రమముగా ప్రవర్తించినాడు. మేము ఆకులచాటు పిందెల మాదిరిగా తండ్రిచాటు బిడ్డలము అనీ, స్వచ్ఛందులము కాము అనీ, మా తండ్రిని అడగవలసినది అనీ, ఆయన అంగీకరిస్తేనే మేము పెండ్లి ఆడుతాము అని చెప్పినాము. ఆ పాపకర్ముడు మేము ఏమి చెప్పినా, ఎన్ని చెప్పినా వినలేదు. మమ్ములను భంగపరచినాడు. ఈ విధముగా అయిపోయినాము" అంటూ ఏడ్చినారు.

కుశనాభుడు అసమాన పరాక్రమవంతుడు అయినప్పటికిన్నీ పరమధార్మికుడు, ఆలోచనాపరుడు. కూతుళ్ళను చూచి "ఓ కన్నెలారా! అపరాధులను క్షమించటమే క్షమావంతుల కర్తవ్యము. మీరు మహాగొప్పగా ప్రవర్తించినారు. అడిగితే లొంగిపోలేదు. అవమానపరచినా ఓర్చుకొన్నారు. పురుషులకు అయినా, స్త్రీలకు అయినా క్షమే గొప్ప అలంకారము. అపరాధులను క్షమించటము అశక్యము. అందులో దేవతలే అపరాధము చేసినప్పుడు క్షమించటము అంతకన్నా అశక్యము. ఆడపిల్లలు మీరు అందరూ ఏకమై క్షమించటము అన్నిటికన్నా అశక్యము అయిన విషయము. మీరు నా పరువునూ, మన కులగౌరవాన్నీ నిలబెట్టినారు.

"ఓ పిల్లలారా! క్షమే దానము. క్షమే యజ్ఞము. క్షమే సత్యము. క్షమే యశస్సు. క్షమే సమస్త ధర్మాలకు మూలము. ఈ సకల చరాచరాత్మకము అయిన జగత్తు అంతా క్షమ మీదనే ఆధారపడి ఉంది" అని చెప్పి ఓదార్చి కూతుళ్ళను పంపించివేసినాడు.

అంతట మంత్రిసత్తములను రావించి, ఆ కూతుళ్ళను ఎవరికి ఇచ్చి పెండ్లి చేయటము? ఎప్పుడు పెండ్లి చేయటము? ఎక్కడ పెండ్లి చేయటము? అని ఆలోచించినాడు.

ఆ కాలములో సదాచార సంపన్నుడూ, ఊర్ధ్వరేతస్కుడూ అయిన 'చూళి' అనే బ్రాహ్మణుడు వైదిక తపస్సు చేయటము మొదలు పెట్టినాడు. 'ఊర్మిళ' అనే గంధర్వాంగన కూతురు 'సోమద' అనే ఆమె బ్రాహ్మణ సేవా పరాయణత్వముతో ఆయనకు అప్పుడు సమస్తోపచారాలు చేయసాగింది. చూళి తపస్సిద్ధుడు అయినాడు. ఆ గంధర్వాంగన పరిచర్యకు సంతుష్టుడు అయి, "ఓ సోమదా! నీ శుశ్రూషకు మెచ్చుకున్నాను. నేను ఏమి ఇచ్చి సంతోష పెట్టవలెను చెప్పు" అన్నాడు. అందుకు ఆమె ఎంతో సంతోషపడ్డది. ఆమె మాటనేర్పరి. మధుర స్వరముతో, "ధర్మాత్మా! తాము బ్రహ్మవర్చస్సులో బ్రాహ్మణులను అందరినీ అతిశయించినారు. సాక్షాత్తు బ్రహ్మదేవుడుగా ఉన్నారు. నాకు పెనిమిటి ఎవడూ లేడు. నేను ఎవరినీ పెండ్లి ఆడలేదు. ఇకముందు ఎవరినీ పెండ్లి చేసుకోను. నేను నైష్ఠిక బ్రహ్మచారిణిని. బ్రాహ్మణ శక్తియుక్తుడు అయిన పుత్రుణ్ణి నాకు మీరు అనుగ్రహించ వలెను" అన్నది సోమద.

చూళి ప్రసన్నుడు అయినాడు. మనసా సంకల్పించినాడు. ఆమెకు 'బ్రహ్మదత్తుడు' అనే పుత్రుడు పుట్టినాడు.

ఆ బ్రహ్మదత్తుడు కాంపిల్యా నగరానికి రాజు అయినాడు. దేవేంద్రుడి మాదిరిగా రాజ్యపాలనము చేయసాగినాడు. అతనికి కుశనాభుడు తన నూరుగురు కూతుళ్ళనూ యిచ్చి వివాహము నిశ్చయించినాడు. ఆ బ్రహ్మదత్తుణ్ణి రావించి ఎంతో సంతోషముతో కన్యాదానము చేసినాడు. బ్రహ్మదత్తుడు వరుసగా ఆ కన్నెల పాణులు

పట్టుకొన్నాడు. అంతట వారి కుబ్జత్వము వదలిపోయింది. వెనుకటి మాదిరిగా దివ్య సుందర విగ్రహులు అయినారు. కుశనాభుడు వారిని అందరినీ పురోహితులతో కూడ బ్రహ్మదత్తుడి వెంట కాంపిల్యా నగరానికి పంపించినాడు.

సోమద కోడళ్ళను అందరినీ చూచి సంతోషించింది. అత్యంత ఆదరముతో కౌగలించుకొన్నది. కుశనాభుణ్ణి ప్రశంసించింది.

ఈ కథను పరిశీలించినపుడు కుశనాభుని ధర్మచింతన, రాజర్షిత్వము అంతకుమించి ఆయన క్షమా గుణము స్ఫూర్తిదాయక ముగా ఉంటాయి. ఇట్లే కుశనాభుని నూరుమంది కుమార్తెల ప్రవర్తనము క్షమా గుణమునకు అద్దము పట్టినట్లుండును. తమకు జరిగిన అన్యాయమును కుశనాభుడు, అతని నూరుగురు కుమార్తెలు క్షమతో, ఓర్పుతో, ధీరతతో భరించి అనుకూల కాలమునకై వేచి యుండి ధర్మ మాధారముగనే కృతకృత్యులైనారు. కుశనాభుని కుమార్తెలకు తండ్రి ఆశీర్వచన బలంగా వివాహమగుట, కురూ పత్వము, కుబ్జత్వము తొలగుట జరిగినవి. కుశనాభుని విశేష ధర్మ ప్రవర్తనము కారణముగ అతనికి తన తండ్రియైన కుశుని అనుగ్రహము చేత పుత్ర సంతానము కలిగి కౌశికి గోత్రము వృద్ధి చెందింది. కౌశిక వంశమున పుట్టిన విశ్వామిత్రుని ద్వారా కౌశికస గోత్రము భూమిపై శాశ్వత కీర్తి నార్జించింది.

**తల్లిదండ్రులు, సద్గురువులు తెలిపిన మార్గము ప్రాథమికముగ అసౌకర్యముగ గోచరించినను, ఓర్పుతో అనుసరించువారికి సర్వ శుభములు కలుగునని** రామాయణ బోధన.

# 7. సునశ్శేపుని కథ

పితృ వాక్యమును ధిక్కరించిన విశ్వామిత్రుని పుత్రులు శాపగ్రస్తులైన కథ ఒకటి మనకు రామాయణంలో గోచరిస్తుంది.

పూర్వము అంబరీషుడు రాజ్యపాలన చేస్తున్న సమయంలో యజ్ఞమునొకటి తలపెట్టాడు. యజ్ఞము జరుగుచుండగ, యజ్ఞపశువును దేవేంద్రుడు దొంగిలించుకు పోయాడు. అపుడు పురోహితులు రాజు నుద్దేశించి, అతడు పరాకుగా నుండుట వలననే యజ్ఞపశువు దొంగిలింప బడినదని, యజ్ఞము పూర్తి అగు లోపున యజ్ఞపశువునుగాని, దాని పవిత్రతతో సమానమగు నరపశువునుగాని పట్టుకు రావలెనని తెలిపారు.

అంబరీషుడు యజ్ఞపశువుకై వెతికి, అది లభింపకపోవుటచేత ఋచీక మహర్షి ఆశ్రమాని కేతెంచి తన సమస్యను పరిష్కరించ వలసినదిగా ప్రార్థించాడు. నరపశువుగ మహర్షి కుమారులలో నొకరిని యిమ్మని కోరేడు. జ్యేష్ఠ కుమారుడు తండ్రికి ప్రీతగుట చేతను, కనిష్ఠుడు తల్లికి ప్రీతి అగుటచేతను, మధ్యముడగు సునశ్శేపుని నరపశువుగ అంబరీషున కివ్వటం తటస్థపడుతుంది. అంబరీషుడు ఒక లక్ష గోవులను మూల్యంగా చెల్లించి సునశ్శేపుడిని తనతో తీసుకొని పోయాడు.

దారిలో అంబరీషుడు విశ్రమించు సమయాన సునశ్శేపుడు ప్రాణభయంచేత ఆ పరిసరాలలో నున్న విశ్వామిత్రుని ఆశ్రయిస్తాడు.

అతని పాదాలపైపడి ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థిస్తాడు. దయాళువైన విశ్వామిత్ర మహర్షి సునశ్శేపుడిని రక్షించ నిశ్చయించి, తన కుమారులలో నొకనిని నరపశువుగ అంబరీషునితో వెళ్ళవలెనని, అట్లు చేయుటవలన మహత్తర పుణ్యం లభిస్తుందని తెలుపుతాడు. విశ్వామిత్ర మహర్షి మాటలు విని అతని కుమారులు అంగీకరింపక పోగా, విశ్వామిత్రుని అపహాస్యం చేస్తారు. అపుడు విశ్వామిత్రుడు, తండ్రి మాటను కాదనుటయే కాక, ధర్మ రహితంగాను, దారుణము గాను మాట్లాడిన తన కుమారులను చూచి వారందరు కుక్కమాంసం తినే హీనులుగా దీర్ఘకాలం పడి ఉండేటట్లు శపిస్తాడు.

అటుపైన విశ్వామిత్ర మహర్షి సునశ్శేపుని ప్రాణరక్షణకై ఇంద్రోపేంద్రుల నుద్దేశించి రెండు మంత్రా లుపదేశిస్తాడు. మంత్ర మహిమ వలన సునశ్శేపుని యజ్ఞమున బలి యిచ్చినప్పటికిని అతడు పునర్జీవితుడై, శేష జీవితాన్ని తపస్సు చేయటానికి వినియోగిస్తాడు.

ఈ కథలో **పితృవాక్యాన్ని ధిక్కరించిన సంతానము అధోగతి పాలగుట, పితృవాక్యాన్ని, గురువాక్యాన్ని పరిపాలించిన సునశ్శేపుడు ఉద్ధరింపబడుట గోచరిస్తుంది.** ఇలాంటి రహస్యాలు రామాయణ కథలలో గమనించటం చాలా ప్రధానం.

# 8. కోపము - తపస్సు

ఈ లోకంలో తపస్సు విశ్వామిత్ర మహర్షి రూపాన్న వెలసింది. తపస్సు చేయదలచినవారు విశ్వామిత్రుని ఆదర్శంగా భావించాలి. విశ్వామిత్రుడు చాల చదువుకున్నవాడు. మహా పరాక్రమవంతుడు. అన్నిటిని మించి వజ్ర సంకల్పము కలవాడు. స్వభావమున మిక్కిలి కోపము కలిగి యుండెడివాడు. మహారాజుగ వ్యవహరించుచున్న సమయంలో అతనికి వశిష్ఠుని సాన్నిధ్యంలో గర్వభంగమైనది. పరాభవము చెందిన విశ్వామిత్రుడు పరితపించి తపస్సుకు పూను కున్నాడు. అతని తపస్సు రకరకములుగ భగ్నమైనది. భగ్నమైన ప్రతిసారి విశ్వామిత్రుడు యినుమడించిన సంకల్పబలముతో మరల తపస్సు గావించాడు. తపోబలం చేతనే అతడు కామక్రోధాదులను, మదమాత్సర్యాలను జయించాడు. క్షమదమాది గుణాలను సాధించాడు. కోపాన్ని జయించ లేనప్పుడల్లా విశ్వామిత్రుడు విచారపడెడివాడు. కోపము వలన, కామము వలన చెదరకూడదని కఠోరమగు దీక్షతో తపమును గావించాడు. సుదీర్ఘ కాలము నిరుపమానమగు మౌనవ్రతమును పాటించాడు. అతని కామక్రోధాదు లను, సహనాన్ని ఇంద్రాది దేవతలు పలురకాలుగా పరీక్షించారు.

తపస్సుచేతనే విశ్వామిత్ర మహర్షి తనలోని దోషములన్నిటిని హరింప చేసుకున్నాడు. సామాన్యంగా కోపిష్ఠులకు సంకల్ప బల మెక్కువ. కారణం కోపమొక రజోపూరితమగు రుద్రశక్తి. దానిని సద్వినియోగము కావించటం బుద్ధిమంతుల పని. కోపము కలవారు

మౌనమును పాటించడము వలన వారియందలి రుద్రశక్తి తపోశక్తిగ మారగలదు. రుద్రుడు కూడ సృష్టి ప్రాథమిక దశలో మహోగ్రముగ చీకటులు ఛేదించి అంతరిక్షము నేర్పరచి సృష్టికి తోడైనారు. ఓషధులయందు, జలములయందు, అగ్నియందు, వాయువునందు, ఆకాశమునందు- విశ్వమంతటను వ్యాపించినారు. వారి రౌద్రశక్తి ఇంకనూ పనిచేసినచో సృష్టి తగులబడి పోయెడిది. అందువలన చతుర్ముఖ బ్రహ్మ వారిని తపస్సునకై ప్రోత్సహించెను. అపుడు రుద్రుడు లోకమున తపస్సును కావించి, తపోమార్గమును కూడ మొట్టమొదటగ సృష్టిలో నేర్పరచినాడు.

సామాన్యముగ కోపము కలవారు తమ కోపముతో నిష్కారణ ముగ శత్రుత్వమును పెంచుకొనుట, జీవితమున కష్టనష్టములను కొనితెచ్చుకొనుట చేయుదురు. అట్టివారు విశ్వామిత్ర మహర్షివలెను, ధ్రువునివలెను, తపోధ్యానములకు మళ్ళినచో శీఘ్రముగ ఉత్తమస్థితిని పొందగలరు. కోపిష్ఠులుకు రామాయణ మందలి విశ్వామిత్ర మహర్షి చరిత్ర ఈ సున్నితమగు పరిష్కారము నందించును. పరశురాముడు కూడ కోపిష్ఠి యగుటచే ఋషులు, దేవతలు అతనిని తపస్సునకే ప్రోత్సహించిరి. **కోపమునకు మౌనము, తపస్సు ఉత్తమమగు ఔషధములని తెలియవలెను.**

# 9. శివ ధనుస్సు

శివధనుస్సును ఎక్కుపెట్టడం అను పరీక్షను ఏర్పరచిన జనక మహారాజు యోగీశ్వరులలో శ్రేష్ఠుడు. రాజయోగి. నివురుగప్పిన నిప్పువంటివాడు. అతడు మిథిలాధిపతి. అనగా అతనియందు సురాసుర శక్తులన్నియు మథనమై తదతీతమైన ప్రజ్ఞ నెలకొని యున్నది. శివునివలె తపోదీక్షయందు వుండువాడు. రాజ్యభారము వహించి నప్పటికినీ అతడి అంతర్యాగమునకు ఎప్పుడునూ భగ్నము కలుగదు. శ్రీకృష్ణుడు సహితము అతనిని దర్శించుటకు ఉత్సహించును. భగవద్గీత యందు కూడ అత డుదహరింపబడెను. అట్టి మహాత్ముడు అజేయుడై యున్నప్పటికిన్నీ రాజసమూహములందు గుప్తుడై, అనామకుడై యుండును. యోగులు రహస్య జీవనులు గదా! వారు అప్రకటితులుగ నుండుట కిచ్చగింతురు. పటాటోపము లుండవు. అహంభావము ఇసుమంతయు ఉండదు.

జనకుని జానకిని పొందుటకు ఎందరెందరో వీరులు ఉత్సహించిరి. వారందరును తమతమ బలములపై ఆధారపడి జానకిని గ్రహించుటకు ప్రయత్నించిరి. వ్యక్తిగతమగు బలము దైవబలముతో పోల్చినపుడు అది యల్పమే. జనకమహారాజు ఆత్మబల సంపన్నుడు, దైవబల సంపన్నుడు కూడను. అట్టి వానికి నిధివలె అందినది జానకి. జ్ఞాని అప్రయత్నముగ తనకు లభించినదిగాని, ప్రయత్నమున లభించినది గాని తనది అను భావము కలిగియుండడు.

జనకుని దృష్టిలో జానకి తనకప్పజెప్పబడిన పెన్నిధి. ఆమెను ఆమెకు సంబంధించిన వారికే అందించవలెను. తండ్రిగ అది తన బాధ్యత. జానకి మాహాత్మ్యము తెలిసిన జనకుడు శివ ధనుస్సును ఎత్తుట, ఎక్కుపెట్టుట అను పరీక్షను సముచితముగ భావించెను. అట్లెక్కు పెట్టినవాడే జానకీపతి అగుట కర్హుడని నిర్ణయించెను.

**శివధనుస్సు అనగా ఓంకారమే. ప్రణవమే ధనుస్సు. శివ ధనుస్సు అనగా శివుని నుండి వెలువడు ఓంకారనాదము. దానిని రుచి చూచినవాడే శివధనుస్సును స్పృశించుటకు, ఎత్తుటకును అర్హుడు. ఓంకారము సృష్టికే ఆధారము. సమస్త శక్తులు దానినుండే ఉద్భవించినవి.** శక్తి నారాధించువారు, శక్తిపై ఆధారపడువారు శివధనుస్సు మహిమ తెలియలేరు. మిథిలాపతులు శివధనుస్సును తెలిసినవారు. అనగా తాము ఓంకారమని తెలిసి జీవించువారు. పరమ శివభక్తులు. అది కారణముగ శివధనుస్సు దేవతలద్వారా మిథిలాపతియైన దేవరాతుడికి ఇచ్చినారు. అనగా శివానుగ్రహము, దేవతానుగ్రహము కలవారు మిథిలాధిపతులు. అట్టి అనుగ్రహ మున్నవారికే జానకిని ఇచ్చి పెండ్లి చేసినచో సమతూకముగ నుండునని జనకుడీ పరీక్షను పెట్టెను.

కేవలము తమ బలమును నమ్మినవారు, శక్తులున్నవారు శివధనుస్సును లేవనెత్తలేకపోయిరి. దానిని కదలించుట కూడ వారికి చేతకాలేదు. కారణము, వారికి దైవానుగ్రహము లేదు. దేవతల బలమూను లేదు. అట్టివా రాగ్రహించి మూకుమ్మడిగ మిథిలపై దండెత్తి వచ్చినను మిథిలను జయింపలేకపోయిరి. కారణము, జనకునికి గల ఆత్మబలము, దైవబలమే. ఆత్మబలము, దేవతాబలము గలవారు

నశింపరు. అట్టి వానిని అల్లునిగ పొందవలెనని జనకుని నిర్ణయము. శ్రీరాముడు ముమ్మూర్తులా అట్టివాడే. రామునికి శివుడన్న ప్రీతి. శివానుగ్రహము అమితము. అతడు సహజయోగి. బ్రహ్మర్షులే అతని యందు మోహపడునంతటి దివ్యసంపన్నుడు. అతడు స్పృశించటము తోనే శివధనుస్సు తేలిక యగును. శివుడు పరమానందము చెందును. శివుని ఆనంద సంకేతమే ఎక్కుపెట్టబడు చున్నప్పుడు ధనుస్సు భంగమగుట. రాముడు ధనుర్భంగము చేయలేదు. కేవలము ఎక్కుపెట్టుటకే ప్రయత్నించినాడు. కాని శివధనుస్సు ఆనందముతో అతనికి వంగుటయే కాక, భంగమై రాముని గొప్పదనమును దశదిశల వెల్లడి చేసినది. రాముని హృదయమున నున్నది శివుడు. శివుని హృదయమున నుండునది రాముడు. వారిది అభేదస్థితి. అందులకే కాశీక్షేత్రము నందు మరణించువారికి శివుడే స్వయముగ తారక మంత్రము నుపదేశించు నని ఋషి వాక్కు.

శివధనుర్భంగము ఇట్టి విశేషములతో కూడియున్నది.

# 10. దానము

శ్రీరాముల, పరశురాముల కథ విదితమే. అందు పరశు రాముని ధర్మాచరణము ప్రశస్తము. పరశురాముడు క్షత్రియుల సంహారము గావించి, భూలోకాన్నంతా స్వాధీనము చేసుకొన్నవాడు. అటుపైన యజ్ఞ మాచరించి, యజ్ఞమందు భూమినంతా కశ్యపునికి దాన మిచ్చినాడు. దానమిచ్చిన వస్తువును మరల తన కొరకై వినియోగించుట అపచారము. అందువలన పరశురాముడు భూమిపై కాక, మహేంద్ర పర్వతముపై తపస్సు గావించుటకు వెళ్ళినాడు. అత్యవసర స్థితులలోగాని అతడు తపమును వీడి భూతలమున సంచరించడు. రాముని శౌర్యమును వినిన పరశురాముడు అతని శౌర్యమును మరింత ఇనుమడింప జేయుటకు, దశదిశల వ్యాపింప చేయుటకు విష్ణు ధనుస్సును కూడ నారి కెక్కించవలసినదిగా రాముని పలు వాక్యాలతో కోపోద్రిక్తుడిని చేసినాడు. శ్రీరాముడు పరశురాముని ఆజ్ఞను శిరసావహించి విష్ణు ధనువును ఆరోపించి బాణము సంధించి నాడు. సంధించిన బాణమును నిర్దేశించి గమ్యము భేదించుట క్షాత్ర లక్షణము. అందువలన శ్రీరాముడు, పరశురాముని బాణము యొక్క దిశను నిర్దేశించమని కోరాడు. పరశురాముని పాదగమన శక్తిని ఖండించవలెనో లేక తపోబలముతో సంపాదించిన పుణ్యలోక ప్రాప్తిని హరించవలెనో తెలుపుమని పరశురాముని కోరెను.

వేల సంవత్సరములు చేసిన తపస్సుయొక్క పుణ్య ఫలిత మొకటి. రెండవది పాదగమన శక్తి హరింపబడుట. పాదగమన శక్తి హరింప బడినచో పరశురాముడు భూమిపైనే యుండిపోవలెను. మహేంద్ర పర్వతమును చేరలేడు. అప్పుడతడు కశ్యపునకిచ్చిన దానము ఫలింపదు. తపోబలమును పోగొట్టుకొనవలెనా? దాన ఫలమును పోగొట్టుకొన వలెనా? అనునది మీమాంస. ఇచ్చిన దానమును మరల వినియోగించుట ఈ గాథయందు ఎక్కువ భారమని తెలుపబడు చున్నది. **వేల సంవత్సరముల మహోత్కృష్టమగు తపస్సు కన్న, ఇచ్చిన దానమును మరల గ్రహింపకుండుట మిన్నయని** ఈ గాథయందు తెలియును. భగవద్గీత యందు కూడ యజ్ఞము, దానము, తపస్సు సర్వోత్కృష్ట కార్యములుగ తెలుపబడినవి. అందు 'తపస్సు' కన్న 'దానమే' గొప్పదని పరశురాముని నడత తెలుపుచున్నది.

# 11. భయము

భయపడినవారే ఎదుటివారికి అపకారం చేస్తారు అని రామాయణంలో ఒక సూక్తి ఉన్నది. పులి, పాము యిత్యాది ప్రాణులకు మనుష్యులంటే భయంచేత, మనుష్యులు వాటి జోలికి పోకపోయినా, అవి మనుష్యులను చంపివేస్తాయి. రాముని యువరాజ పట్టాభిషేక సందర్భములో భయము కారణమై రాజ్యాభిషేక కార్యక్రమాన్ని విషాదకరంగా మార్చారు.

దశరథుని అంతఃకరణమున భయము, తొందర ఆవరించుట వలన అతడు భరతుడు లేని సమయంలో రాముని యువరాజ్య పట్టాభిషేకానికి సంకల్పిస్తాడు. అతడి భయమే అతని చేత తొందర పాటు నిర్ణయం చేయించింది. దశరథుడే స్వయముగ రామునితో ఇలా పలుకుతాడు. “రామా! నా అంతఃకరణము నీ రాజ్యాభిషేకానికి తొందరపెడుతూ ఉంది. నీ అభిషేకము రేపే అయిపోవలెను. ఇప్పుడు భరతుడు దూరదేశంలో ఉన్నాడు. వాడు ఇక్కడకు వచ్చేలోపలే నీ రాజ్యాభిషేకము అయిపోవలెను. నీ తమ్ముడు భరతుడు పెద్దలు నడచిన దారినే నడచు స్వభావము కలవాడు కావచ్చును. జ్యేష్ఠుడవని, నిన్ను అనుసరించే వాడే అయి ఉండవచ్చు. ధార్మికుడు, దయార్ద్ర హృదయుడు కూడ అయి ఉండవచ్చును. జితేంద్రియుడు కూడ అయి ఉండవచ్చును. కాని మానవుల చిత్తము అస్థిరము. ఎప్పుడూ ఒక్క మాదిరిగా ఉండదు. ఇది నా అభిప్రాయము.”

దశరథుని పై పలుకులలో అతనికి గల భయము, అనుమానము, తొందరపాటు గోచరిస్తాయి. అతని భయమునకు తగిన కారణము లేదు. నిజమునకు భరతుడున్నప్పుడే యువ రాజ్యాభిషేకము నిర్ణయము అమలుపరిచి యుండినచో, దశరథుని మనోరథము నెరవేరెడిది. తన భయముచేతనే, భరతుడు లేని సమయాన ఆ కార్యము తలపెట్టినాడు.

**భయము సర్వ అనర్థములకు కారణము. భయమున్నచోట అనుమానము కూడ యుండును. సంశయములు, సందేహములు తోడై సత్సంకల్పములను సహితము భగ్నపరచునని** రామాయణ మందలి ఈ సన్నివేశము తెలియజేయును. భయములేని కైకేయిని కూడ మందర భయమునకు గురి చేసినది. కావున ఆమె కూడ దశరథునివలె భంగపడవలసి వచ్చినది.

# 12. అనిర్వచనీయము

కాలమహిమను ఎవ్వరూ ఊహించను కూడ ఊహించలేరు. కాలపు మడతలతో ఏమి దాగియున్నదో ఎవ్వరునూ తెలియజాలరు. ఏ నిమిషమున ఏమి జరుగునో ఎవరూహింపగలరు? జగన్నాటక మున అనూహ్యమగు ఘటనలెన్నియో జరిగినవి. జరిగిన పిదప తెలియుటయే గాని, ముందు తెలియుట సాధ్యము కాదు.

ఎవతో, ఎక్కడ పుట్టినదో ఎవ్వరికినీ తెలియదు. ఆమె కైకేయిదేవికి దాసి. కైకేయితో పాటు ఆమె పుట్టినింటి నుండి వచ్చినది. ఎప్పుడూ ఆమె దగ్గర ఉంటూ ఉంది. ఆమె పేరు మంథర. అతి సామాన్యమగు దాసీజనులలో ఆమె యొకతె. దాసీజనులలో కూడ ఆమె కొక గుర్తింపు లేదు. ఆమె మేధస్సు కూడ అంతంత మాత్రమే. అట్టి జీవి నుండి ఒక దుష్ప్రవర్తన వెలువడి లోక కల్యాణమునకు కారణమైనది. శ్రీ మహావిష్ణువు అవతార ప్రయోజనమునకు శ్రీకారము చుట్టినది. ఇక్ష్వాకు వంశమునందు ఎన్నడూ జరుగని ఒక విపరీత ఘటనకు వాహిక అయినది.

లౌకికముగ చూచినచో మంథర వంటి అల్పబుద్ధిగల జీవి నుండి మహత్తర కార్యములకు ప్రారంభమెట్లు జరుగగలదు? మంథర జీవితమున మనకు తెలిసినది ఒక రాత్రి మాత్రమే. అంతకు ముందు ఆమె ప్రస్తావన లేదు. ఆ తరువాత ఆమె ప్రస్తావన లేదు. ఆమెయందు ప్రవేశించిన శక్తి కైకేయిదేవి యంతటి మహత్తర సంస్కారముగల

జీవి బుద్ధికూడ మసక బారినది. కైకేయిదేవి ప్రవర్తనము అత్యంత శ్లాఘనీయము. ఆమె సవతు లెవ్వరును, ఏ విషయమునందైనను ఆమెకు సాటిరారు. రాముని, భరతుని కన్న ఎక్కువగ ప్రేమించి లాలించిన మాతృమూర్తి. ఆమె ఇనుమడించిన రూపవతియేగాక అతిశయించిన సామర్థ్య సంస్కారములు కలది. ఆమెను పెండ్లియాడిన పిదపనే దశరథుడు చక్రవర్తి అయినాడు. అట్టి మహోన్నతమైన జీవిపై అల్పము, అతి స్వల్పమైన బుద్ధిగల మంథర ప్రభావమెట్లు చూప గలిగినది?

దశరథుడు రాజర్షి, అతనికి బ్రహ్మర్షియైన వశిష్ఠుడు తోడుగ నున్నాడు. దశరథుని కొలువున వశిష్ఠుడు కాక వామదేవుడుకూడ నున్నారు. అనేకులగు బ్రాహ్మణ ముఖ్యులు, ప్రజ్ఞావంతు లున్నారు. అన్నిటికి మించి విశిష్టమగు బుద్ధిశాలురైన మంత్రి ముఖ్యులున్నారు. ఇందరి ఊహను అతిక్రమించి ఒక విపరీతమగు సంఘటన ఒక అల్పజీవి ద్వారా నిర్వర్తింపబడుట ఆలోచించిన కొలది, అది ఎంతటి అద్భుతమో, అనూహ్యమో, అనిర్వచనీయమో తెలియును. అయోధ్యా నగరవాసు లందరిని నిశ్చేష్టులను గావించిన ఒక మహత్తరమగు క్రియ అతి సాధారణమగు వ్యక్తి ద్వారా నిర్వర్తింపబడుటలో దైవ మెంతటి మహత్తు గలవాడో, దైవబల మెంతటిదో తెలియనగును. ఇట్టి అద్భుతము, అనిర్వచనీయము అగు ఘటనలనే, దైవ మందురని అవతారమూర్తియగు రాముడు మాత్రమే పలికినాడు. అట్టి భాషణము రామునికి మాత్రమే సముచితము.

ప్రజ్ఞావంతులు ఇట్టి విషయములపై లోతుగ నాలోచించినచో **దైవ ప్రజ్ఞముందు తమ ప్రజ్ఞ లేశమాత్రము కూడ చేయదని తెలియును. దైవాధీనముననే సమస్తము నడచుచున్నదని కూడ తెలియును.**

# 13. దైవికము

దైవికము ఎట్లుండునో శ్రీరాముడు లక్ష్మణునకు చేసిన బోధనలో స్పష్టముగ బోధపడుతుంది. అది ఎంతటి అనూహ్యమగు విషయమో కూడ బోధపడుతుంది. ఆస్తికులు రాముని మనోభావాన్ని గమనించినట్లయితే, పదే పదే దానినే మననము చేసుకొన్నట్లయితే చాలమటుకు మనోవ్యధలు తొలగిపోతాయి. శ్రీరాముడు లక్ష్మణునికి చేసిన బోధన ఈ విధంగా ఉంది....

"తమ్ముడా! పితృవాక్య పరిపాలనము పుత్రుడు అవశ్యమూ అనుష్ఠించవలసిన ధర్మము అని చెప్పినాను. ఆలోచిస్తూ ఉంటే మరి ఒకటిన్నీ తోచింది. నాయనగారు నాకు రాజ్యాభిషేకము తల పెట్టడమూ, అది ఇపుడు విఫలము అయిపోవడము దైవికము. దైవికమే కాకపోయినట్లయితే, నన్ను ఇట్లా బాధపెట్టవలెను అని కైకేయీదేవికి ఎందుకు బుద్ధి పుడుతుంది? కైకేయీదేవి ఇదివరకు ఎన్నడయినా నన్ను పరాయి అమ్మకన్న బిడ్డవలె చూడడము నీవు ఎరుగుదువా? నేను ఎన్నడయినా సవతితల్లి, కన్నతల్లి అనే భేద భావముతో ప్రవర్తించడము నీవు ఎరుగుదువా? కైకేయీదేవి నన్నూ, భరతుణ్ణీ ఏ తారతమ్యమూ లేకుండా ఒక్కమాదిరిగా చూస్తూ వచ్చింది. అంత వాత్సల్యముతో నన్ను చూస్తూ వచ్చిన కైకేయీదేవి, యువ రాజ్యాభిషేకము కట్టిపెట్టి, అరణ్యవాసానికి పొమ్మని నాతో చెప్పరాని మాట చెప్పింది. ఆమె నోటి వెంట అటువంటి ఉగ్రవాక్కు

వెలువడడము దైవికము. అందుకు మరి ఒక కారణము కనపడడము లేదు."

"లక్ష్మణా! కైకేయీదేవి ఉత్తమ రాజవంశంలో జన్మించింది. ఆమె ఇంతవరకూ తన వంశోచిత సుగుణాలకు అనుగుణముగా ప్రవర్తిస్తూ వచ్చింది. ఆమె ఇప్పుడు దుష్కులాంగనవలె భర్తృ సాన్నిధ్య ములో సిగ్గు బిడియమూ లేకుండా ఆయననూ, ఆయన ప్రియ పుత్రుణ్ణీ బాధించే కోరిక కోరింది. ఆ కోరిక చెల్లించవలెను అని ఆమె ఆయనను నిర్బంధించింది. ఇది దైవికము. అందుకు మరొక కారణము లేదు."

"నాయనా! దైవికానికి తిరుగులేదు. సమస్త ప్రాణికోటి దానికి తల ఒగ్గవలసిందే. ఇప్పుడు అది నా స్థితికి, కైకేయీదేవి స్థితికీ విపర్యయము తెచ్చిపెట్టింది. పెద్దలు అందరూ ఆలోచించి నిశ్చయించిన నా రాజ్యాభిషేకము ఆగిపోయింది. నన్ను ఎంతో వాత్సల్యముతో చూచే కైకేయీదేవి సత్స్వభావము తలక్రిందులు అయిపోయింది. తమ్ముడా! **దైవికానికి ఏ అడ్డూ లేదు. జరిగిన దానిని బట్టే, దైవికము అని అనుకోవలసివస్తూ ఉంటుంది. అది దైవికము అని ముందుగా తెలియదు, తెలుసుకోలేము కూడానూ!** ఎంతో శ్రద్ధతో శ్రమపడి చేసిన పనులు ఒకప్పుడు విఫలము అయిపోతూ ఉంటవి. అందుకు ఏ కారణము కనపడదు. ఏ మాత్రము శ్రద్ధ లేకుండానూ, శ్రమపడ కుండానూ చేసిన పనులు ఒకప్పుడు సఫలము అవుతూ ఉంటాయి. అందుకు కారణము కనపడదు. కాబట్టి ఆయా పనులను ఫలపరి పాకాన్ని బట్టి దైవికము అనుకొని శిరసావహించవలెను. అనుభవించ వలెను. ముందుగా తెలియదు కనుక దైవికాన్ని ఎదుర్కొనడము అనేదే లేదు. సుఖదుఃఖాలూ, భయక్రోధాలూ, లాభాలాభాలూ, ఉత్పత్తి

వినాశాలూ ఈ మొదలైనవి అన్నీ దైవికముగా సంభవిస్తూ ఉంటవి. మహోగ్ర నియమాలతో తపస్సుచేసే మహర్షులు సహితము కామక్రోధ పరవశులు అయిపోవడమున్నూ దైవికమే. **ఎంతో కాలము ఆలోచించి, ఆలోచించి ఆరంభించిన పని ఇట్టే ఆగిపోతుంది. ఎన్నడూ అనుకోని పని హఠాత్తుగా అయి ఊరుకుంటుంది.** దైవికము కాకపోతే ఇటు వంటి సంఘటనకు కారణము ఏమిటి? ఈ యథార్థము నేను గమనించినాను. అందువల్లనే, నేను మనోనిగ్రహముతో ఉన్నాను. నా అభిషేకము ఆగిపోయింది అనే విచారము నాకు లేదు. నీవున్నూ ఆలోచించి చూడు, దుఃఖ పడవద్దు."

"తమ్ముడా! నా రాజ్యాభిషేకము కోసము తెచ్చిన ఈ కలశాల లోని జలాలతో ఇప్పుడు నేను తపోవ్రత స్నానము చేస్తాను. కాదు కాదు, పొరపాటు. ఈ కలశాలలో జలాలు రాజ్యాభిషేకము కోసము తెచ్చినారు. నేను ఉపయోగించకూడదు. నేను స్వయముగా నీళ్లు తోడుకొని తపోవ్రత స్నానము చేస్తాను. నాయనా! నాకు రాజ్యలక్ష్మి విపర్యయము అయిపోయింది అని నీవు దుఃఖ పడవద్దు. రాజ్య పాలనము కన్నా వనవాసమే సుఖముగా ఉంటుంది. శుభ ఫలమూ ఇస్తుంది."

"తమ్ముడా! నా రాజ్యాభిషేకము విఘ్నము అయిపోవడానికి పిన్నమ్మ కారణము కాదు. ఆమె దైవోపహత. అందువల్ల ఆమె అప్రియము చెప్పింది. దైవ ప్రభావము అటువంటిది" అన్నాడు రాముడు.

# 14. వాసనా బలము

తల్లిదండ్రుల సంస్కారములు, కుసంస్కారములు సంతానమునకు సంక్రమించుట తెలిసిన విషయమే. **జీవునికి తనదైన సంస్కారము, కుసంస్కారము వెంట నంటియుండగ, తాను జన్మించిన తలిదండ్రుల శుభాశుభ సంస్కారములు కూడ సంక్రమించును.** కైకేయి దేవి విషయమున అట్టిదే జరిగినదని రామాయణము సూచించును. ఆమె సహజముగ బుద్ధిమంతురాలు. మంగళ స్వరూపిణి. శుభాంగి. ఆమె సాన్నిధ్యము కల్యాణప్రదము. ఆమె ఎన్నడును తన జీవితమున ఒక అనుచితమైన పని చేసి ఎరుగదు. ఒక అప్రియమగు భాషణము కూడ చేయలేదు. చాల ధర్మభీతి కలిగిన ఉత్తమజీవి. నిజమునకామె యశస్విని. ధీమంతురాలు. అట్టి యామె నుండి అనుచితము, కఠినము అగు సంకల్ప మెట్లవతరించ వీలుపడినది? ఏదియో ఒక అశుభ వాసన ఆమె యందు ఏమూలనో దాగియుండనిచో వీలుపడునా? మంథర మాటలు ఆమెకు ముందు చెవికెక్కలేదు. చాల మార్లు తోసిపుచ్చినది. కాని మంథర పట్టువదలక తన సంకుచిత భావమును ప్రకటించుచునే చివరకు నెగ్గినది. దానికి కారణము కైకేయిదేవి స్వభావమున ఆమెకే తెలియక దాగియున్న ఆమె తల్లి క్రూర స్వభావము.

గిరివ్రజాధీశుడైన కైకేయిదేవి తండ్రికి సమస్త ప్రాణికోటి భాషలు బోధపడే వరమిచ్చినాడొక మహాత్ముడు. ఆ వర ప్రభావమువల్ల చీమలు దోమలతో సహా అన్ని జీవరాసుల మాటలు ఆయన కవగాహన మయ్యెడివి. రాజు సమస్త ప్రాణికోటికి వలసిన సేవ చేయవలెను

కదా! ప్రాణికోట్ల భాషణము నవగాహన చేసుకొని అందరిని పరిరక్షించుచు గిరివ్రజాధీశుడు మహావైభవముతో రాజ్య పాలనము సాగించు చుండెడివాడు.

ఒకనా డారాజు పాన్పుపై పడుకొని ప్రక్కనే చీమలు చెప్పు కుంటున్న కొన్ని మాటలు విన్నాడు. ఆ మాటలకు ఆయనకు నవ్వు వచ్చింది. పెద్ద పెట్టున చాలసేపు నవ్వినాడు. ప్రక్కనే పడుకొనియున్న కైకేయిదేవి తల్లి నవ్వునకు కారణ మడిగినది. నవ్విన కారణము తెలిపినచో తనకు మరణ మాసన్న మవుతుందని రాజు తెలిపినాడు. పరిహాసమునకే రాజట్లనినాడని, ఆమె మరల మరల నవ్విన కారణము తెలుపమని కోరింది. రాజు నివారించుటకు చాల ప్రయత్నించెను. కారణము చెప్పుటకు నిరాకరించినకొలది రాణికి పట్టుదల పెరిగినది. ఆమె తన భర్తతో "మీరు చెప్పవలసిందేను. మీరు మరణింతురో జీవింతురో నా కవసరము లేదు" అని నిర్బంధించినది. అపుడు రాజు తనకు వరమిచ్చిన మహాత్ముని స్మరించి కర్తవ్యమేమని ప్రార్థించెను. అపుడా మహాత్ముడు దర్శనమిచ్చి "పతి పతనము, పతి మరణము కోరు పత్ని, పత్నియే కాదని, విసర్జించమని బోధించినాడు. సమస్త ప్రాణికోటికిని హితము చేయువాడైన రాజు ముఖ్యమని, అహితము కోరు పత్నిని విసర్జించి రాజ్య మేలుమని తెలిపినాడు. అపుడు రాజు రాణిని విసర్జించినాడు.

సుమంతుడను దశరథుని మంత్రి కైకేయిదేవి కీవృత్తాంత మెరిగించి, ఆమె వలన సర్వనాశనము జరుగునని, కారణము తల్లి సంస్కారము ఆమె నుండి నిర్వర్తించు చున్నదని, రాముడు లేని దశరథుడు జీవించడని తెలిపిననూ కైకేయి చలించకపోవుటలో స్వతస్సిద్ధము కానప్పటికిని, సంక్రమించిన అశుభవాసన ఎంత బలీయముగ నుండునో ఈ కథ యందు గోచరించును.

# 15. పూజలు – హోమాలు

**మానవులు సుఖప్రదంగా జీవించడానికి దేవతానుకూల్యము చాల ప్రధానము. ఎచ్చట దేవతలకు పూజలు నిర్వహింపబడతాయో, ఎచ్చట దేవతల నుద్దేశించి హోమములు, ఆహుతు లివ్వబడతాయో అచ్చట సర్వము జయప్రదము, శుభప్రదము అవుతుంది. కష్టకాలంలో సామాన్యంగా జీవులు నిరుత్సాహులై, నిర్వీర్యంగా ఉండటంచేత, దైవారాధనకు విముఖత కలుగుతుంది. కాని ఆ సమయంలోనే నిజానికి దేవతారాధన మిక్కుటంగా సాగాలి.**

రామాయణం మనం పఠించినపుడు దశరథుడు, కౌసల్యాదేవి, శ్రీరాముడు, అగస్త్యమహర్షి దేవతారాధనమునందు, హోమములను గూర్చి వారు చూపిన ప్రత్యేక శ్రద్ధ స్పష్టంగా గోచరిస్తుంది. మన లోపల బైట దేవతలెంతో హితకరులై మనలను అహర్నిశలు కాపాడు తున్నారు. అట్టి దేవతా ప్రజ్ఞలను గుర్తించటం, వారిని భక్తిపూర్తకముగా ఆరాధించటం యిహపరములకు శ్రేయస్కరం.

శ్రీరాముడంతటి ధీశాలి, పరాక్రమవంతుడు, సద్గుణ సంపన్నుడు నాటికి నేటికిని మానవులలో గోచరింపడు. మానవులందు అత్యుత్తమోత్తముడు. అతని కతడే సాటి. అట్టి మహాత్ముడుకూడ నిత్యము దేవతార్చనము గావించెను. అయోధ్యకాండలో శ్రీరాముడు వనవాసమునకు కృతనిశ్చయుడై సాగునపుడు తల్లి నుద్దేశించి యిట్లు పలికెను. “తల్లీ! నేను సుఖముగ పదునాలుగు సంవత్సరముల పాటు

వనవాసము చేసి తిరిగి రావటంకోసం నీవు యిక్కడ (అయోధ్యలో) హోమాదులు చేయిస్తూ ఉండు. దేవతలను పూలతో పూజిస్తూ ఉండు. సువ్రతులైన బ్రాహ్మణులను సత్కరిస్తూ ఉండు. అన్ని కోరికలు సఫలమవటానికి దేవతారాధన కావిస్తూ ఉండు.”

కౌసల్యాదేవి కూడ సమాధానం పలుకుతూ ఇలా అన్నది. “రామా! నీ కోసం నేను యిక్కడ దేవతలను పూజిస్తూ ఉంటాను. నిరంతరము స్తోత్రం చేస్తూ ఉంటాను. దేవతలు, మహర్షులు నిన్ను కాపాడుతుంటారు.”

**దేవతారాధనకు గంధము, సువాసనలతో కూడిన పువ్వులు, అక్షతలు, పసుపు, కుంకుమ, నిర్మలమగు వస్తు సామగ్రి చాల ముఖ్యము. అట్లే హోమానికి పవిత్రమగు సమిధలు, ఆవు నేయి ముఖ్యం.**

రాముడు వనవాసం చేసిన సమయంలో కూడ తన కుటీర మున దేవతార్చనకు ప్రత్యేకమైన ఏర్పాటు వివరముగా కావిస్తాడు.

**శ్రద్ధాళువులైన ఆస్తికజనులు నిత్యము షోడశోపచార పూజ గావించుకొనుట అత్యంత ప్రధానము. ఏ గృహమందు దేవతారాధన వైభవంగా సాగుతుందో ఆ గృహమందు సమృద్ధి తప్పక యుంటుంది. సంతోషము, సుఖము ఉంటాయి. కర్మవశాన కష్టములు వచ్చిననూ, అదృష్ట మగు దేవతానుగ్రహముచే త్వరితగతిని కడతేరుతారు. ఆధునిక జీవన మనుకొనుచు చాలామంది భారతీయులు దేవతారాధనమును అశ్రద్ధ చేయుచున్నారు.** ధ్యానము, యోగము అనుచు ఆరాధనము మరచుచున్నారు. అట్టి వారికి రాముని ప్రవర్తనమున ఈ విశిష్ట సందేశము లభించును.

# 16. సదాచారం

మహత్కార్య మొకటి తలపెట్టినపుడు పాటించవలసిన నియమములు మనకి రామాయణంలో గోచరిస్తాయి. వాని ననుసరించే బుద్ధిమంతులు జీవితమును వైభవముగా మలచుకుంటారు. అందులో మొట్టమొదటిది ఉపవాస వ్రతము.

1) శుభ కార్యమునకు ముందురోజు రాత్రి దంపతి ఉపవాసవ్రత మాచరించుట ఎంతయో శ్రేష్ఠముగా తెలుపబడినది. సీతా రాములు సహితము ఈ సదాచారాన్ని పాటించారు. ఉపవాస వ్రతము, చేయబోవు మహత్కార్యములకు దీక్షను పొందు వ్రతముగా భావించాలి.

2) మరునాడు ఉదయము తలంటు స్నానము లాచరించి, మనస్సుద్ధితో యిష్టదేవతా పూజ కావించాలి. అవకాశ మున్నవారు అగ్నిహోత్రమును గావించి, జ్వలిస్తున్న జ్వాలలలో యిష్టదేవతా ప్రీతికై ఆజ్య (నెయ్యి) హోమం చేయాలి.

3) మౌనవ్రతము ముందురోజు సాయంత్రం నుండి పాటించాలి.

4) తెల్లవారుజామునే నిద్రలేచి అభ్యంగన స్నానమాచరించి అలంకరించుకోవాలి. పూజాది కార్యక్రమములను ఆచరించడానికి ముందు దేవతా మంత్ర జపము గావించి స్తోత్ర పఠనం చేయాలి.

5) తెల్లవారుజాము నుండి మంగళవాయిద్యములు మ్రోగుతూ ఉండాలి.

6) ముందురోజే గృహమును శుభ్రపరచుకొని మంగళప్రదముగ అలంకరించుకోవాలి.

7) పట్టు, రంగు వస్త్రములను (పట్టువిగాని, పత్తినూలువి గాని) ధరించాలి.

8) బంధుమిత్రులతో కూడి కోలాహలముగ, శోభాయమానంగా గృహవాతావరణం కర్ణపేయమగు వాయిద్యములతో కూడి విలసిల్లాలి.

9) వీధి గుమ్మాన్ని చక్కగా ఊడ్చి, కళ్ళాపి (ఆవుపేడ కలిపిన నీళ్ళు) చల్లి, బియ్యపు పిండితో ముగ్గులు తీర్చిదిద్దాలి.

10) వీధి గుమ్మానికి యిరుప్రక్కల అరటి చెట్లనుగాని, పొన్నచెట్లను గాని నిలుచుండబెట్టాలి.

వరుస క్రమంలో ముందురోజు నుండి ఈ విధంగా సత్కార్యమునకు సంసిద్ధులగుట అత్యంత శుభకరమని రామాయణము సున్నితముగా బోధిస్తుంది.

# 17. లక్ష్మణుని దీక్ష

దూరప్రయాణం కావించేవారు ప్రయాణ అలసటను మనసులో ఊహించుకొని అవకాశం మేరకు ముందుగానే తగిన విశ్రాంతి తీసుకుంటారు. అర్ధరాత్రో, తెల్లవారుజామునో ప్రయాణం చేయాలంటే ప్రయాణకాలం వచ్చే వరకు కునుకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలాగే ఆత్మీయులు ఆసుపత్రిలో జనన మరణాల మధ్య పోరాడుతుంటే నిద్రను ఆపుకోలేక, ఎవరైనా కొంతసేపు మేలుకొని ఉంటే తాము నిద్రించవచ్చని భావిస్తారు.

అలాంటిది లక్ష్మణుని జీవితంలో వనవాసం మొదటిరోజే తటస్థ పడుతుంది. లక్ష్మణుడు 14 సంవత్సరముల వనవాస దీక్షలో తాను నిద్రించక సీతారాములను పరిరక్షించుకొను దీక్ష పూనుట. 14 సంవత్సరములపాటు నిద్రించకుండ ఉండటం సామాన్య విషయం కానేకాదు. సీతారాములు వనంలో నిద్రిస్తున్నపుడు క్రూరమృగముల బారిన, రాక్షసుల బారిన వారు పడకుండా రక్షకభటుని వలె తాను కాపలా కాయాలని లక్ష్మణుని దృఢనిశ్చయం. శృంగిబేరపురము చేరటంతో వనవాసం ప్రారంభమవుతుంది. అచ్చట గుహుడు ఆదరించి, ఆహ్వానించి, పూజించి సకల సౌకర్యాలు అందించబోగా, వనవాసదీక్షానుసారం రాముడు సున్నితంగా గుహుణ్ణి వారిస్తాడు. సీతతో సహా నేలమీద గంగానదీ తీరాన నిదురిస్తాడు. లక్ష్మణుడు దీక్షతో ధనుర్ధారియై సీతారాములను పరిరక్షించటం గుహుడు గమనిస్తాడు. చాలసేపు లక్ష్మణుని అప్రమత్తతను పరికిస్తాడు. సంతృప్తుడవుతాడు. పరిరక్షణలో లక్ష్మణుడు సర్వసమర్థుడని గమనించి

సుదీర్ఘకాలము అతడు చేపట్టిన దీక్షను గూర్చి విని ఆనందపడి, కనీసం ఆ రాత్రికైనా సుఖముగా నిద్ర పొమ్మని, తాను తన పరివారం కాపుంటామని వేడుకుంటాడు. తనకు రామునికన్న ప్రియమిత్రుడు లేడని, అతడు తన ప్రాణంకన్నా అధికమని, తాను తన పరివారం రామునికోసం ప్రాణాలైనా అర్పిస్తామని, కావున నిశ్చింతగా నిద్ర పొమ్మని తెలియజేస్తాడు. తా నడవికి రాజునని, చతురంగబలాలతో వచ్చినా, తానొకడే నిర్జించగలనని తెలుపుతాడు.

లక్ష్మణుడు సహజమగు బుద్ధిశాలి. గుహుడు చెప్పినది యథార్థ మని గ్రహిస్తాడు. చేజిక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనటం లౌకికమైన తెలివి, కాని లక్ష్మణు డాచరిస్తున్న ధర్మం అలౌకిక వివేకాన్నిగూడ దాటి ఉంది. అయినప్పటికి అతడు సున్నితంగా గుహుణ్ణి వారిస్తూ, రాముని గుణగణాలను ప్రశంసిస్తూ, గుహునితో కలిసి రామస్మరణ చేస్తాడు. తెల్లవార్లూ రాముని గుణగణాలు వర్ణిస్తూ గడుపుతాడు. అటవీపతియైన గుహుడు కూడ లక్ష్మణుని భక్తి ప్రశంసలను విని హృదయము కరిగి కన్నీరు కారుస్తాడు.

లక్ష్మణుని దీక్షకు మూలము సాటిలేని అతని సంకల్పబల మొక్కటియే కారణము. రామునిపై అతనికి గల ప్రేమ కూడ తోడవటంవల్ల ఆ సంకల్పానికి మరింత బలం చేకూరింది. సీతారాములు నేలపై పడుకొనివుంటే తాను నిదురించలేనని స్పష్టంగా తెలుపుతాడు. అది పరమభక్తికి చిహ్నం. **పరమభక్తికి మరో పేరే ప్రేమ. దైవమును ప్రేమించినవారు మాత్రమే అసాధ్యమైనటువంటి దీక్షలను నిర్వర్తించగలరు.** లక్ష్మణుని ప్రేమ, భక్తి రామునికి, హనుమంతునికి మాత్రమే తెలుసు. అతని దీక్షకు మూలము దైవమునం దతనికి గల ప్రేమ, భక్తి. లక్ష్మణుని దీక్ష నిరుపమానము. సాటిలేనిది.

# 18. ఆర్య సంప్రదాయము

ఆర్య సంప్రదాయంలో క్రతుబద్ధ జీవనము ప్రముఖ స్థానం వహించి యున్నది. ఆర్యులు చిన్న పనియైన, పెద్ద పనియైన క్రతు బద్ధంగా నిర్వర్తించటం వలన ప్రకృతి సహకారం వారికి అమితంగా లభిస్తూండేది. దేవతల ఆశీర్వచనం కూడ క్రతుమయ జీవితం నుండి అందుతూ ఉండేవి. జీవన విధానమే క్రతుయుక్తంగా ఉండేది.

ఆర్యులకు తెల్లవారకముందే నిద్ర లేవటం ఒక క్రతువు. శయ్యనుండి లేవటమొక క్రతువు. నాసారంధ్రముల యందలి కుడి ఎడమల శ్వాసను గమనించటము మరియొక క్రతువు. కుడి ప్రక్క నుండి లేచుట, కుడికాలు మోపుట మరియొక క్రతువు. దంత ధావనము కూడ క్రతువే. మలమూత్ర విసర్జనము కూడ క్రతువే. స్నాన మాచరించుట కూడ క్రతుబద్ధమే. దుస్తులు ధరించుట విసర్జించుట క్రతుబద్ధము. భుజించుటకు ముందు, తరువాత క్రతువున్నది. ఇంటినుండి వీధిలోనికి వెడలునపుడు క్రతువు, ప్రయాణమునకు కూడ క్రతువు. నదిని దాటునపుడు క్రతువున్నది. ఇవి యన్నియు సంధ్యావందనాది దివ్యక్రతువులు కాక నిత్యనైమిత్తిక కర్మలకు సంబంధించిన క్రతువులు. నిదుర లేచిన దగ్గరనుండి నిదురపోవు వరకు అంతా క్రతుమయమే. ఇన్ని క్రతువులకు సంబంధించిన మంత్రము లున్నవి. క్రతుమయ జీవనము నిజమునకు విపరీతధోరణి కూడ చేరి చాదస్తముగ మారినది.

రామాయణము నందు ఇట్టి క్రతువులెన్నియో గోచరించును. శ్రీరాముడు సహితము గంగానదిని దాటుటకు నావ ఎక్కు సందర్భమున క్రతుయుక్తముగ మంత్రమును పఠించి నావ ఎక్కుట గోచరించును. అట్లే తమస, గంగ, యమున నదులను దాటునపుడు సీతాదేవి నదులకు నమస్కారము చేయుట, దక్షిణాదులను మానసికముగ దానము చేయుట కనపడును. నేటికిని భారతీయులు నదిని దాటు చున్నపుడు నదికి దక్షిణలు సమర్పింతురు. అట్లే మహత్తరమగు వృక్షములు గోచరించునపుడు వానిని దివ్య జీవులకు ప్రతీకలుగా భావించి నమస్కరించుట, పూజించుట, ప్రదక్షిణలు చేయుట కూడ రామాయణమునందు గోచరించును.

ప్రస్తుతము భారతీయులు బహుకొద్ది క్రతు సంస్కారములను మాత్రమే పాటించు చున్నారు. అవియును ఆడంబరముగనే జరుగు చున్నవి. అందువలన అప్పులపాలు కూడ అగుచున్నారు. **అర్థవంత ముగ క్రతువులు నిర్వర్తింపబడినపుడు, దేహబద్ధుడైన జీవుడు సంస్కరింపబడును. సంస్కరింపబడిన దేహము జీవున కుపయుక్త మగును. లేనిచో దేహము జీవుని బంధించుట, దాని అవసరార్థమే జీవుడు బానిసయై జీవించుట జరుగుచు నుండును. మంత్ర యుక్తముగ, అర్థవంతముగ క్రతువు నిర్వర్తింపబడినపుడు జీవుని దేహమునకు వలసిన శిక్షణ లభించును.** శిక్షణ పొందిన దేహము, శిక్షణ పొందిన జంతువు వంటిది. శిక్షణ నిచ్చి కదా ఎద్దుచే పొలము దున్నించుట, గుఱ్ఱముపై స్వారీ చేయుట జరుగుచున్నది. శిక్షణ లేని ఎద్దు అతిక్రమించి ప్రవర్తించును. అట్లే శిక్షణలేని గుఱ్ఱముపై ప్రయాణము కుదరదు. నిండుగ నూరేళ్లు ప్రయాణము చేయుటకు, మానవునకు

మానవ దేహ మీయబడినది. దానిని నిత్య క్రతుబద్ధమైన జీవనముతో సంస్కరించుకొని ఆర్యులు అనగా మన పూర్వీకులు వందల సంవత్సరములు ఒకే దేహమున నిలచి కృతార్థులైరి. దీని వివరములే రామాయణమున సన్నివేశములతో ముడివైచి వాల్మీకి మహర్షి సున్నితముగ వివరించినాడు.

# 19. రాముడు - ఆచారము

చిత్రకూటము చేరిన రాముడు పలికిన కొన్ని వాక్యాలు శాశ్వత ధర్మాలు. అవి ఇలా గోచరిస్తాయి.

1. లక్ష్మణా! మిట్టపల్లాలు లేని సమ ప్రదేశంలో మనము నివాసము పెట్టుకొందాము.
2. నివాస ప్రదేశము ప్రశాంతమై యుండాలి.
3. బహుకాలము సుఖముగా జీవించాలి అనుకొనేవారు వాస్తు శాంతిని చేయించవలెను.
4. వాస్తు దేవతలలో పాటు విశ్వేదేవతలను, రుద్రులను, విష్ణువును పూజించి అన్నశాంతి చేయాలి.
5. దేవతలకు, అగ్నిహోత్రానికి వివరంగా వేదికను అమర్చాలి.
6. యథావిధిగా భూతశాంతి చేయాలి.
7. శాస్త్రములో చెప్పినట్లు చేయటమే మన కర్తవ్యము. అదే ధర్మము.

పై వాక్యాలు శ్రద్ధ గలవారికి సూక్తములే. శాస్త్రోల్లంఘనము ఎవ్వరికిని తగదు. శ్రీకృష్ణుడు కూడ భగవద్గీతయందు శాస్త్రమే ప్రమాణ మని తెలిపినాడు. శాస్త్రమును అవగాహన చేసుకొనుట, అనుసరించుట అవతార పురుషులు సహితము నిర్వర్తించి చూపిరి. ఆధునికత పేరున శాస్త్రము నుల్లంఘించువారు పతనము చెందక తప్పదు. **శాస్త్రవిధి**

**నాచరించి చూపినవారే ఆచార్యులు. ఆచార్యులకు కూడ శాస్త్రమే ప్రమాణము. వారి ఆచరణము లోకమునకు ప్రమాణము.** నేటి కాలమున ఎందరో ఆచార్యుల మనుకొనువారు శాస్త్ర ప్రమాణమును పాటింపక, తద్విరుద్ధమైన ఆచారముల నెన్నింటినో ఆచరించుచూ, ఆచరింప జేయుచున్నారు. ఇది కలి దోషమున కలుగుచున్న అనాచారమే. **ఆచార్యులకు ధర్మము ప్రభువు. ధర్మమునకు అచ్యుతుడు ప్రభువు.** ఆచారము ధర్మము ననుసరించవలెను. అపుడు దైవము చ్యుతి కలుగనివ్వడు. అందులకే ధర్మమునకు ప్రభువు అచ్యుతుడు అని తెలిపినారు. **"ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః."**

ఈ విషయమున రాముని మించిన మానవుడు గోచరింపడు. అతడు అతి చిన్న విషయము నుండి, అతి గంభీరమగు విషయము వరకు అన్నింటిని ఆచరించి చూపిన శాస్త్రవేత్త.

# 20. దశరథుని వివేకము

**శోకము ధైర్యాన్ని నాశనము చేస్తుంది. వివేకాన్ని నాశనము చేస్తుంది. సర్వాన్నీ నాశనం చేస్తుంది. శోకముతో సరిసమానమైన శత్రువు మరి ఏదీ లేదు.** శత్రువు హఠాత్తుగా దెబ్బ వేస్తే ఓర్చుకో వచ్చును కాని, హఠాత్తుగ ఏ కొంచెము దుఃఖము వచ్చినా ఓర్చు కోవడము అశక్యము.

ఎవడి శుభాశుభ కర్మఫలము వాడు అనుభవించక తప్పదు. ఏ పని చేయ తలపెట్టినా ముందుగా దాని కష్టసుఖాలనూ, గుణ దోషాలనూ ఆలోచించనివాడు మూర్ఖుడు.

చిన్న చిన్న పూలు పూసే మామిడి చెట్లు చిన్న చిన్న కాయలు కాస్తుంది అనుకొని వాటిని నరికివేసి, పెద్దపెద్ద అందమైన పూలు పూసే మోదుగ మొక్కలు నాటి, పాదులు కట్టి, నీళ్ళుపోసి పెంచితే అవి కాయలు కాసేటప్పుడు ఏడవక తప్పదు.

అజ్ఞానము వల్ల చేసినా చేసినదాని ఫలము అనుభవించక తప్పదు. పిల్లవాడు తెలియక విషము తింటే ఏమి అవుతుంది? అపథ్యాహారము తిన్నవాడికి రోగము రాక తప్పదు.

# 21. స్వప్నము - శకునము

శకున శాస్త్రంలో స్వప్నమునకు స్థానమున్నది. భరతునికి ఒక దుస్వప్నం కలిగింది. ఆ స్వప్నాన్ని రామాయణ కావ్యం ఇలా వివరిస్తుంది.

“నాకు రాత్రి ఒక పీడ కల వచ్చింది. మా నాయనగారు మలిన దేహముతో తల విరబోసుకొని, కొండలమీద నుంచి కంపుకొడుతూ ఉన్న ఒక పేడగుంటలో పడిపోయినారు. ఆ పేడ గుంటలోనే తేలుతూ, దోసిటితో నూనె త్రాగుతూ, పదే పదే నవ్వుతూ ఉన్నారు. కొంచెము సేపటికి నువ్వుల అన్నము తింటూ, ఒంటి నిండా నూనె పూసుకొని, నూనెలో మాటిమాటికీ మునుగుతూ ఉన్నారు.

ఆ కలలోనే సముద్రము ఎండిపోతున్నట్లు కనిపించింది. చంద్రుడు హఠాత్తుగా నేలకూలినాడు. జగత్తు అంతా చిమ్మ చీకట్ల మరుగున పడిపోయింది. పట్టపుటేనుగు దంతాలు ముక్కలు ముక్కలుగా అయిపోయినవి. భగభగమండుతూ ఉన్న అగ్నిహోత్రము అకస్మాత్తుగా ఆరిపోయింది. రకరకాల చెట్లూ ఎండిపోయినవి. భూమి బ్రద్దలు అయిపోయింది. కొండలు పగిలి పొగలు రాజుకొంటూ ఉన్నవి.

మా తండ్రి దశరథ మహారాజు నల్లగుడ్డ కట్టుకొని ఒక ఇనుప పీటమీద కూర్చున్నారు. నల్లటి స్త్రీలూ, తేనె రంగు స్త్రీలూ ఆయనను

చూచి నవ్వుతున్నారు. ఒంటినిండా నల్లటి రంగు పూసుకొని, మెడలో ఎఱ్ఱటి పూలదండలు వేసుకొని, గాడిదలు కట్టిన రథము ఎక్కి దక్షిణ దిక్కుగా పోతున్నారు. ఎఱ్ఱటి చీరకట్టుకొన్న ఒక రాక్షసాంగన వికృతాననముతో వికవిక నవ్వుతూ ఆయనను రథము మీదనుంచి క్రిందికి పడలాగింది.

మిత్రుడా! ఇంత భయంకరమైన కల వచ్చింది. ఇక నాకో, రాముడికో, లక్ష్మణుడికో, కాకపోతే మా నాయన గారికో చావు రాక తప్పదు. గాడిదలు కట్టిన రథము ఎక్కిపోయినట్లు కల కాంచినవాడు అచిరకాలములో చచ్చిపోతాడు. తప్పదు. అందువల్ల ఇంత దిగులు పడుతున్నాను. ఇప్పుడు నా మనస్సు స్వస్థముగా లేదు. నా గొంతు ఆరిపోతున్నది. అందువల్ల మీ అందరితో కులాసాగా మాట్లాడలేకుండా ఉన్నాను. నేను ఎన్నడూ, దేనికీ భయపడి ఎరుగను. ఇప్పుడు నిష్కారణ ముగా నాకు భయము వేస్తూ ఉంది. ఎందుకో నన్ను నేనే నిందించు కొంటున్నాను. కారణము ఏమిటో తెలియడము లేదు.

ఓ మిత్రుడా! ఇదివరకు నాకు ఎన్నడూ ఒక్క కల రాలేదు. రాత్రి రకరకాలుగా పీడకల వచ్చింది. ఎంతో దూరాన ఉన్న మా తండ్రి దశరథ మహారాజును తలచుకొన్నకొద్దీ నాకు భయము వేస్తూ ఉంది.”

**ఈ స్వప్నమందు వివరించిన విషయములు అన్నియు దుఃఖము కలుగజేయు కాలమును సూచించునవిగ గోచరించును. బుద్ధిమంతులీ విషయమును గమనించి మెలకువ వచ్చినంతనే కాళ్ళు, చేతులు, ముఖము కడుగుకొని, ముమ్మారు ప్రణవ ముచ్చరించి, ఇష్టదేవతా స్మరణము చేయవలెను. మానవులకు**

**స్వప్నము చతుర్విధ స్థితులలో ఒకటి. ముందు జరుగబోవు సన్నివేశములు స్వప్నము ద్వారా తెలిసే అవకాశము ఉన్నది. తెల్లవారు జామున వచ్చు స్వప్నములు సంభవించే అవకాశము ఎక్కువ.**

పై విధముగనే బాలకాండలో మరొక శకున శాస్త్రపరమైన విషయం తెలుపబడింది. పరశురాముడు రంగప్రవేశం చేసే సమయంలో **ఆకాశంలో పక్షులు ఆందోళనకరమైన కూతలు కూస్తాయి. జంతువులు అడ్డగోలుగా పరిగెడతాయి. లోపల కారణము లేని దిగులు కలుగుతుంది. దుమారం లేపేటట్లుగా గాలి వీస్తుంది. ఉన్నతమైన వృక్షాలు నేలకూలుతాయి. అకస్మాత్తుగా చీకట్లు కమ్ము కుంటాయి. అంతా మసిబారినట్లు అయిపోతుంది. ఇలాంటి సన్నివేశాలు ఏర్పడినపుడు ప్రయాణ ప్రయత్నము నిలిపివేసి దైవారాధన చేయటం మంచిది.**

పై విధంగా రామాయణంలో అడపాదడపా శకున శాస్త్రం వివరింపబడుతూ ఉంటుంది. శ్రద్ధ గలవారికి రామాయణంలో చాలా శాస్త్రాలు గోచరిస్తాయి.

# 22. పని – ఫలము

తెలిసి చేసినా, తెలియక చేసినా చేసినదాని ఫల మనుభవింపక తప్పదని రామాయణ ధర్మం తెలుపుతుంది. అలాగే వర్షఋతువులో ఆహార నియమములు పాటించని వారికి, వారి శరీరమున మదము చేరే అవకాశమున్నదని కూడ రామాయణం తెలుపుతుంది. ఈ రెండు సత్యాలు యౌవనంలో ఉన్న దశరథుని జీవితంలో గోచరిస్తాయి. అపుడు దశరథుడు యువరాజు, యౌవనోత్సాహంతో జంతువులను వేటాడాలని ఉత్సహించాడు. పగలంతా వేటాడాడు. కాని అతనిలోని యౌవన మదము చీకటిలో కూడ వేటాడటానికి ప్రోత్సహించింది. చీకటిలో ఏమీ కనబడకపోయినప్పటికి, శబ్దమును బట్టి శరమును ప్రయోగించే విద్యయందు నైపుణ్య ముండటం చేత ధను వెక్కుపెట్టి చీకటిలో ఏమరుపాటు లేకుండ, మాటున ఉండి చప్పుడు వినబడిన చోటికి బాణం వదిలాడు. చప్పుడైంది, ఒక బాలుడు ఏటినుండి నీళ్ళు తీసుకుంటూండటం వలన బాణము మునిబాలుణ్ణి సంహరించింది. అతడు బ్రహ్మతేజస్సుతో నున్నాడు. అతనికి వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు. అందునా తండ్రి మహాతపస్వి. పుత్రశోకాన్ని భరించలేక అతడు, దశరథుని పుత్రశోకంతో మరణించమని శపిస్తాడు. అతని శాపం ఈ విధంగా వర్ణించబడింది.

“ఓ రాజా! నీవు తెలియక నా పిల్లవాణ్ణి చంపావు. ఇపుడు పశ్చాత్తాప పడుతున్నావు. పశ్చాత్తాప పడుతున్నావు కనుక మహా

పాతకమేదీ నిన్ను బాధించదు. కాని వృద్ధాప్యంలో నాకు పుత్ర శోకమనే దక్షిణ ఇచ్చావు. నీవిచ్చిన దక్షిణ వృథాగా పోదు. నీవును నావలె వృద్ధాప్యంలో పుత్రశోకంతో మరణించు."

దశరథుడు తెలియక చేసిన పనియే అయినప్పటికి దాని ఫలము అనుభవింపక తప్పలేదు. **తెలిసి చేసినా, తెలియక చేసినా కర్మ తప్పదనుట పెద్దలు తెలుపు ధర్మము.** తెలియక విషము తిన్నచో మరణము తప్పునా! అందువలన ఒక పని చేయుటకు ముందు గుణదోషాలను ఆలోచించవలెను. లేనిచో మూర్ఖతవలన దుష్పరిణామము లేర్పడగలవు.

# 23. తల్లి దీవెన

తల్లికి పుత్రుడే ప్రియతము డవుతున్నాడు. పుత్రునికన్న ఆత్మబంధువు స్త్రీకి లేదు. నిజమునకు భర్తకన్న కూడ పుత్రుడే తల్లికి ఎక్కువ ప్రీతి నిస్తాడు. భర్త ప్రియుడే అయివున్నప్పటికిని, పుత్రుడు ప్రియతముడు.

పుత్రుని కష్టము తల్లి భరించలేదు. పుత్రుడు దుర్మార్గ డయినప్పటికి కూడ తల్లి పుత్రుని క్షేమం కోరుతూనే ఉంటుంది. అటువంటిది, సన్మార్గమున చరించు పుత్రుని విషయమున కష్టములు కలిగినప్పుడు కామధేనువు వలె ఓర్చుకోలేక కన్నీరు పెడుతుంది.

**పుత్రులపై తల్లికి గల ప్రేమ, పుత్రులకు తల్లిపై నుండదు. కాని తల్లులను సంరక్షించు పుత్రుడు, తల్లుల అభీష్టము నెరవేర్చు పుత్రుడు కోకొల్లలుగ అదృశ్యమగు ఆశీర్వచనము పొందుతారు.**

ఈ ఆధునిక జీవన విధానములో ఈ శాశ్వత ధర్మాన్ని అనుస రించే బుద్ధిమంతులు అమితమగు సుఖశాంతులను, సంపదలను పొందగలరు.

# 24. ఋషి గుణములు

**అంతయు తన వశమున నుండవలెనని కోరనివాడు, ధనమే ప్రధానముగ బ్రతుకనివాడు, శరీరమునందు కొంత కాలముండ వలెనని ఆశించనివాడు, ధర్మమే ప్రధానమని భావించినవాడు ఋషి అనబడును.**

శ్రీరాముడు కైకేయిదేవితో మాటాడునపుడు తాను ఋషినని తెలుపుచు, ఋషి గుణములను వివరించెను. ఈ నాలుగు గుణములు సామాన్యజీవులకు నాలుగు ఆశయములు. **"నాహం అర్థపరోదేవి!"** ఓ తల్లీ! నే నర్థపరుడను కాదు అని పలికినాడు. అర్థపరులనగ ధనమే ప్రధానమని, పరమార్థమని జీవించువారు. వీరు ధనముకొరకై ఆశించి బలహీనులను, అమాయకులను, తెలివి తక్కువ వారిని మోసగించుచు జీవింతురు. స్వశక్తి పై జీవింపక, సోదర సోదరీ జనముల ధనములు, పిత్రార్జితమగు ధనములు ఆశించుచు, వాని కొరకై కలహించుచు జీవింతురు. స్వశక్తిని నమ్మిన వారికి యితరుల ధనముపై వ్యామోహ ముండదు. అట్లే యితరులపైన కూడ వ్యామోహ ముండదు. అందరు తన మాట వినవలెనని నిర్బంధించుట యుండదు. విననివారిని ద్వేషించుట యుండదు. వీరికి కర్తవ్యమే ముఖ్యము కాని, యితరులు వారి ధనములు ముఖ్యము కాదు. ఎంతకాలము దేహముండునో అంతకాలము ధర్మము నాశ్రయించి కర్తవ్యములను నిర్వర్తింతురు. దేహముండవలెనని కూడ ఆశించరు.

**నిజమగు భారతీయులు ధర్మమును, కర్మమును ఆశ్రయించిరి గాని ధనము, కీర్తి, అధికారము, దేహముల నాశించలేదు. ధర్మము, పదవి, కీర్తి, దేహము కలిగినచో వానిని కూడ ధర్మ నిర్వహణమునకే సమర్పించి జీవించిరి.**

ప్రస్తుత కాలమున యిది కేవలము అందని ఫలముగ గోచరించును. క్రమముగ స్వయంకృషితో దీనిని సాధింపవచ్చునని రామాయణగాథ తెలుపుచున్నది.

# 25. సాటిలేని ప్రవర్తనము

**ఏ కర్మ ఆచరించినచో ధర్మము, అర్థము, కామము కూడ సిద్ధించునో దానినే ఆచరింపవలెను. దేని నాచరించుటచే మూడును లభింపవో అట్టి కర్మను చేయరాదు.**

కేవలము అర్థమునకు, కామమునకు ఆశించి ధర్మరహిత మగు కార్యములు చేయరాదు. అట్టి కార్యములు సిద్ధింపబోవు. కాలక్రమమున దుఃఖము కలిగించును. లోకమున అందరు దూషింతురు.

భోగకామములు అనుభవించవచ్చును గాని ధర్మమును వదలి అనుభవించుట కూడని పని. ధర్మమునే చిరకాల మాచరించుట వలన కాలక్రమమున అర్థకామము లన్నియు అప్రయత్నముగ సిద్ధించును.

పై శాశ్వత సత్యమును శ్రీరామచంద్రుడు తల్లియగు కైకేయికిని, సోదరుడగు లక్ష్మణునికి వివరించి తన ధర్మ స్వరూప మును వారియందు కూడ ఆవిష్కరించినాడు. కనుకనే రాముని ప్రవర్తనము సాటిలేనిదై నిలచినది.

# 26. శ్రీరాముని దైవ సూక్తము

**జీవునకు కలుగు సుఖదుఃఖములకు ఎవ్వరును కారణము కాదు. దైవమే కారణము.** నేనరణ్యమున కేగుటకు కైకేయి కారణము కాదు. దశరథుని ప్రతిజ్ఞా కారణము కాదు. దైవమే కారణము.

రాజ్య మొసంగితినని యువరాజ్య పట్టాభిషేకమునకు నిర్ణయము గావించిన తండ్రి, ఆలోచన మారి అరణ్యమున కంపుటకు కారణము దైవమేకాని, దశరథుడు కాదు. **దైవ ప్రభావము కాలము రూపమున ప్రసరించినపుడు అనూహ్యమగు చేష్టలు పరిచితుల నుండి కూడ వ్యక్తమగుచుండును. అపుడు జరుగుచున్న మార్పులు దైవముగ భావించ వలెను కాని యితరులను తప్పు లెన్నరాదు. జరుగవలసి ఉన్నది జరిగి తీరును.**

తండ్రి దశరథుడు గాని, తల్లి కైకేయిగాని నా యందు చూపిన ప్రేమలో తారతమ్యము లేదు. వారు వర్షించిన వాత్సల్యమునందు యిట్టి మార్పు ఊహింప నశక్యము. ఈ మార్పు దైవమే. మరియొకటి కాదు.

కైకేయిదేవి మంచి స్వభావము గలది. ఉత్తమ వంశములో పుట్టినది. దయ, ప్రేమ, వాత్సల్యముగల మాతృమూర్తి. అట్టి స్త్రీ మూర్తి నీచ స్వభావము గలదై, గుణహీనురాలువలె ప్రవర్తించుటకు

దైవముకంటే వేరొక కారణ మేమియుండును. దైవముయొక్క ప్రభావము యిట్టిది అని ఎవ్వరును ఊహింపజాలరు.

ఏ ప్రాణి విషయమునందైనను దైవము వారింప శక్యము కానిది. దాని ననుసరించుటయే కర్తవ్యము. ఫలము సిద్ధించువరకు అది తెలియక యుండును.

**పట్టుటకు దొరకని దైవముతో పోరాడుట మూర్ఖము. దైవము కంటికి కనబడునది కాదు. కలిగిన ఫలముచే దైవము నూహించ వలెనేకాని, ఎట్లుండునో ఎవ్వరికిని తెలియదు.**

మానవులకు ఒకప్పుడు సుఖము కలుగును. ఒకప్పుడు దుఃఖము కలుగును. అట్లే భయము, క్రోధము కలుగును. లాభము నష్టము వచ్చును. ప్రయత్న మేకరూపముగ నున్నను, ఫలములో భేదములు కలుగుటకు కారణమేదో తెలుసుకొనుట శక్యము కాదు. అట్టి సమయమున దానిని 'దైవము' అని అనుకొనక తప్పదు గదా!

సామాన్య మానవుల విషయమే కాక ఋషులపైన కూడ దైవము తన ప్రభావము చూపును. నియమ నిష్ఠలు కలిగి తీవ్రమగు తపస్సు చేయుచున్న ఋషులు, తపస్సు నుండి భ్రష్ట మగుచుందురు. దానికి కారణము దైవమే.

ఒక విధమగు ఫలము కోరి, ఒక విధమగు ప్రయత్నమును పూర్ణమగు పట్టుదలతో మానవుడు చేయుచుండును. చేయుచుండగనే అనుకోకుండ హఠాత్తుగ ప్రయత్న మాగిపోవును. అట్లే ఆశించిన

ఫలముకంటె విపరీతమగు వేరొక ఫలము సంభవించును. అది దైవము చేయు పని. ఒక మానవుడు చేసిన పని కాదు.

ఎందుకట్లు జరుగుచున్నదో మనకు తెలియక మనుషులపై కోపింతుము. పగ ఏర్పడును. మనస్సు నిలకడగ నున్నచో జరుగుచున్న విపరీతములు దైవమని తెలిసి బుద్ధిమంతుడు కర్తవ్యోన్ముఖుడగును.

**పురుష ప్రయత్నముకంటే దైవమే బలమైనది. స్వధర్మమే సర్వశ్రేయములకు సాధనము. అర్థకామముల కంటే ధర్మము ప్రధానము. పురుష ప్రయత్నము కంటే దైవము ప్రబలము.**

# 27. లక్ష్మణ భక్తి

శ్రీరామచంద్రుడు తండ్రిమాటను నెరవేర్చుటకై అరణ్యమున కేగుటకు నిర్ణయించినపుడు, అర్ధకామములకంటె ధర్మమే ప్రధానమని, పౌరుషము (పురుష ప్రయత్నము) కంటె దైవమే బలమని, దైవము యొక్క స్వరూప స్వభావములను సాత్వికముగ వివరించినాడు.

లక్ష్మణునకు ధర్మము తెలియును. ధర్మము ననుసరించుట శాశ్వత సుఖమునకు. సుఖము నిచ్చునది ధర్మాచరణమా, జ్ఞానమా, భక్తియా? ధర్మము నాచరించునపుడు ఉత్తమ సుఖము దొరకునా? మానవుడు జీవితములో ధర్మమును, దైవమును పాలించవలెను. ధర్మమును పాలించుచు, దైవమును తృప్తి పరచనివాడు ధర్మమునకు చేటు కలిగించువాడే. దైవమును తృప్తి పరచుటయందు సత్యమును, ధర్మమును మరచువారు తత్త్వ మెరిగినవారు. ఇది విపరీత వాదమువలె గోచరించును. కాని యిందు సత్యమున్నది. లోకమున సామాన్య ధర్మములు, విశేష ధర్మములు కలవు.

**సమాజములో జీవించునపుడు ఈ జన్మలో, పై జన్మలలో, పై లోకములో సుఖము నందుటకు ఈ శరీరముతో ఆచరింపదగిన ధర్మములు సామాన్య ధర్మములు.** కాని పరమాత్మకే చెందినవాడై పరమాత్మయే తన అస్థిత్వముగ భావించువాడు, పరమాత్మకే ఉపయోగ పడువాడు, పరమాత్మయే సర్వస్వమని తన్ను సమర్పించుకొని జీవించు వాడు సామాన్య ధర్మములను లెక్కచేయడు. పరమభక్తులగు

గోపికాస్త్రీలు సర్వస్వమును కృష్ణునికే అర్పించి జీవించుటలో యితర ధర్మము లన్నింటిని పరిత్యజించిరి. **దైవము కొరకై అన్ని ధర్మములు పరిత్యజించుట విశేష ధర్మము.** అట్టి ధర్మము తెలిసినవాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు రాముని సుఖమే కోరును. రాముడు పరుడే అని తెలిసినవాడు లక్ష్మణుడు. రాముని సుఖమునకు కలుగు అంతరాయము సహింపలేకపోవుట, స్వసుఖమునకు పరిత్యజించుట అను అంశమున లక్ష్మణునితో సాటియైనవాడు లేడు. అతడు మహాజ్ఞాని. తత్త్వ మెరిగినవాడు. రాముని భాషణమునకు తల వంచుకొని నిలచినాడే కాని యిష్టపడలేదు. అందులకే ధర్మము కన్న దైవమే గొప్పది గనుక దైవసుఖమునకు ధర్మమును సహితము ఎదురింతునని పౌరుష వాక్యములు పలికినవాడు లక్ష్మణుడు. అతని పలుకులు ఆవేశముతో పలికినవి కావు. అజ్ఞానముతో పలికినవి అంతకన్నా కావు. పరమభక్తితో పలికినవి. రామునితో లక్ష్మణునకు గల ఐక్యభావము గుర్తించుట బుద్ధిమంతులు చేయవలసిన పని.

# 28. మంగళాశాసనము

రామాయణమందు కౌసల్యాదేవి రాము డరణ్యమునకు వెళ్లునపుడు మంగళాశాసన మొకటి చేసినది. ఈ మంగళాశాసనము దూరదేశముల కేగు తమ వారి నుద్దేశించి శ్రేయోభిలాషులు తప్పక చేయవలసిన విధి గోచరించును. మంగళాశాసనము ఈ విధముగ నున్నది.

**శ్లో॥ యన్మంగళం సహస్రాక్షే సర్వదేవ నమస్కృతే ।**
**వృత్రనాశే సమ భవత్తత్తే భవతు మంగళమ్ ॥**

సర్వదేవతలచేత నమస్కరింపబడు ఇంద్రుడు వృత్రాసురునితో యుద్ధము చేసినపుడు ఏ మంగళము లభించినదో ఆ మంగళము నీకు లభించుగాక!

**శ్లో॥ యన్మంగళం సుపర్ణస్య వినతా కల్పయత్ పురా ।**
**అమృతం ప్రార్థ యానస్య తత్తేభవతు మంగళమ్ ॥**

గరుత్మంతునకు అమృతము తెచ్చువేళ వినతాదేవి ఏ మంగళము అనుగ్రహించినదో, ఆ మంగళము నీకు లభించుగాక!

**శ్లో॥ అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్యయత్ ।**
**అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్ ॥**

రాక్షసులను సంహరించు ఇంద్రునకు అదితి దేవి ఎట్టి మంగళమును ప్రార్థించినదో ఆ మంగళము నీకు కలుగుగాక!

**శ్లో॥ త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోర మిత తేజసః ।**
**యథాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్ ॥**

అమిత తేజోవంతుడగు విష్ణువు మూడడుగులతో లోకములను కొలచినపుడు ఏ మంగళము సంభవించెనో ఆ మంగళము కలుగు గాక!

**శ్లో॥ ఋతవస్సాగరా ద్వీపాః వేదాలోకా దిశశ్చతే ।**
**మంగళాని మహాబాహో దిశంతు శుభమంగళమ్ ॥**

ఋతువులు, సముద్రములు, ద్వీపములు, వేదములు, లోకములు, దిక్కులు అన్నియు శుభమంగళము కలిగించుగాక!

# 29. రాముని ధీరత

**తన శోకమును ఒకరికి చెప్పి, వారికి శోకమును కలిగించుట ధీరుల లక్షణము కాదు. శోకమును ఆపుకొనలేనివాడు కూడ ధీరుడు కాడు. ధీరుడు పరివారమునకు ధైర్యము చెప్పి శోకించకుండ చేయవలెను. ఇతరులు శోకించుటకు అవకాశ మీయరాదు. తాను శోకించి యితరులను శోకింపజేయుట పురుష లక్షణము కాదు. ధీరత మానవుడు నేర్చుకొనవలసిన ప్రధాన ధర్మము. శోకించుట, శోకింపచేయుట భీరువుల లక్షణము.**

శ్రీరాముడు కైకేయి దేవినుండి తన వనవాసమును గూర్చి, భరతుని యువరాజు పట్టాభిషేకమును గూర్చి వినినపుడు సత్యమును ధర్మమును ప్రధానముగ భావించి, కైకేయిని దూషింపక, దశరథుని నిందింపక, అంతయు దైవకృతమని సహించి ధైర్యము వహించెను. అతడు మనసున బాధ పడలేదు. మరణవార్తవంటి అప్రియమగు వార్తను కైకేయి ద్వారా విని, ధీరుడై నిలచి, తన సమ్మతమును కైకేయికి విశ్వాసము కలుగునంతగ తెలియపరిచెను. శ్రీరామునికి రాజగృహ వాసము, వనవాసము ఒక్కటియే. నిత్యము దైవమునందు వశించు వానికి దివ్యవాసము ప్రధానము. భౌతిక వాసములు అప్రధానములు. శ్రీరాముడు ధైర్యముతోనే తల్లిని చేరెను. తల్లికి కూడ ధైర్యము నూరిపోసెను. సౌహార్దముతో లక్ష్మణునికి నచ్చ జెప్పెను. ధర్మాచరణ విధానమును బోధించెను. కాని సీతను చూచినపుడు కించిత్ దుఃఖము

కలిగినది. ఆ శోకము కూడ తాను అరణ్యమునకు వెళ్లవలసి వచ్చెనని కాని, రాజ్యము పోయినదనికాక, ఆమె దుస్థితిని గుర్తించినపుడు దుఃఖము కలిగినది.

**తన దుఃఖమునకు దుఃఖించువాడు భీరువు. ఇతరుల దుఃఖములు గుర్తించి, దుఃఖము చెందువాడు ప్రేమమూర్తి.** దశరథునికి పరివారమున్నది. అదియును గాక ఇచ్చిన మాట నెరవేర్చు ధర్మ మున్నది. అది తోడై నిలచును. కైకేయికి భరతుని ఆధారమున్నది. పరివారము కూడ నున్నది. లక్ష్మణుడు స్వయముగ ధీరుడు. కౌసల్యకు భర్త ననుసరించుట ధర్మము. సీతకు మాత్రము తానే ఆధారము. తాను లేక సీత యుండలేదు. ఇది గమనించిన రామునికి కించిత్ శోకము కలిగినను, ధైర్యము వహించి పలుకుట రాముని ధీరత!

# 30. భాషణా రహస్యము

రామపత్ని అయినటువంటి సీతామాత రామునితో అరణ్యమునకు వెళ్ళుటకు నిశ్చయించుకొని, తాను కూడ వత్తునన్నది. ఆ శ్లోకమీ క్రింది విధముగ నున్నది.

**శ్లో॥ అహం గమిష్యామి వనం సుదుర్గమమ్**
**మృగాయుతం వానర వారణై ర్యుతం ।**
**వనే నివత్స్యామి యథా పితుర్గృహే**
**తవైవ పాదా వుపగృహ్య సంయతా ॥**

మృగములు, వానరములతో కూడిన దుర్గమ మగు అరణ్యమునకు నేనును వత్తును. నీ పాదములే నేనుండు స్థలము. వనములో పుట్టింటిలో ఉన్నట్లుండగలను అని పలికినది.

పలికిన పలుకులలో భవిష్యత్ వాణి వినబడుట బుద్ధిమంతులు గ్రహింతురు. ఇతరులు పై పై మాటలనే వినుదురు. సీతమ్మ మాటలలో రహస్యార్థ మొకటి గోచరించి, భవిష్యత్ కార్యమును తెలుపుచున్నది. అందు **"మృగ ఆయుతం"** అను పదమున్నది. అనగా లేడిచే విడదీయబడి అను అర్థము వచ్చును. 'మృగ' మనగా లేడియని అర్థమున్నది. 'ఆయుత' మనగా విడదీయబడుట. అటులనే **"వానర వారుణైర్యుతం"** అను పదమున్నది. అనగా వానర శ్రేష్ఠులచే కలుపబడుట అని యర్థ మున్నది. ఒక లేడి విడదీయు ననియు, వానర

శ్రేష్ఠులైన సుగ్రీవాదుల వలన మరల కలియుదు మనియు తెలిపెను. అట్లే పుట్టింటిలో నున్నట్లుగ దుర్గమ మగు వనమందు రాముని పాదములే రక్షగ యుందుననెను. పుట్టింటిలో నున్నట్లు వుందునని తెలిపెను.

సీత ముందు జన్మమున వేదవతి. వేదవతిగ ఆమె లంకలో జనించినది. అందుచేత లంక ఆమెకు పుట్టినిల్లు. తరువాత జన్మలో సీతగ జనకునకు జన్మించినది. కావున లంకలో యుండుట పుట్టినింటిలో యున్నట్లే. దుర్గమమగు వనమని సంబోధించినది. రావణుని లంకలో రావణుని దుర్గము అందు గోచరించును. లంక యందు సీతమ్మ రామపాదములే శరణ్యముగ జీవించినది. ఇట్లు భవిష్యత్ వాణి సీతమ్మ నుండి మున్ముందుగనే బయల్పడినది. దానికి తగినట్లుగనే ఆమె కోరి రామునితో వనవాసమునకు చనినది. జీవన లక్ష్యము సాధించుటకు వలసిన ధ్వని లోనుండియే జనించినది.

**కేవలము పలుకుటయందే గాక పలికిన పలుకులు వినుటకు కూడ నిశితమగు బుద్ధి అప్రమత్తమై యుండవలెనని** సూచన ఈ వృత్తాంతమున గోచరించును.

సీతాదేవి తానును వనములకు వత్తును అని తెలిపిన పిదప మరియొక విషయమును శ్రీరామునికి వివరించెను. ఇదియును రహస్యార్థములతో కూడినదే.

**"అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్."**

మీకంటే ముందుగ దర్భముళ్ళను త్రొక్కుచు నేను ముందు సాగెదను అని యర్థము. వనమున ఋషిజనులు దర్భలను కోసి

క్రతు కార్యములను నిర్వహింతురు. కోయగ భూమిపై మిగిలిన దర్భలు ముళ్లవలె నుండును. అట్లే లేళ్ళు మేయగ మిగిలిన ముక్కలు ముళ్లవలె నుండును. వానిపై రాముడు నడచినపుడు సుకుమారమైన అతని పాదములు కందిపోవును. కావున సీతమ్మ తాను ముందు నడచి, వాటిని మెత్తగ చేయుదునని, అటుపైన శ్రీరాముడు నడువ వచ్చునని పలికినది. ఇదేమి ప్రసంగము? రాముని పాదములకన్న అతి సున్నితమైన సీతమ్మ పాదములు దర్భముళ్లను ఎట్లు మెత్తపరచగలవు? అది సాధ్యమా? అంతరంగము నుండి ఈ పలుకులు వెలువడినవి గాని, కేవలము మనస్సు నుండి కాదు.

శ్రీరాము డవతరించినది వనవాస కర్మము ననుభవించుటకు కాదు. దేవతల ప్రార్థనలు మన్నించి, వారి మనోరధ మీరేడుటకై రావణుని చంపుటకు కదా! అందులకు శ్రీరాముడు లంక కేగవలసి యున్నది. లంక కేగుటకు వనవాసము కేవలము నిమిత్త కారణము. రాము డొకడే వనవాసమున కేగినచో కాగల కార్యము కానేకాదు. సీతమ్మకూడ ఏగవలెను. అపుడే స్త్రీ కాముకుడైన రావణుడు ముందుగ సీతను లంకకు చేర్చును.

**“అగ్రతస్తే గమిష్యామి”** మీకన్న ముందు నేను వెళ్లుదును అనునది సత్యమే గదా! ముందువెళ్లి ఏమి చేయును? గుచ్చుకొను ముళ్ళను మృదువు చేయును. దర్భముళ్ళను కుశకంటకము లందురు. ‘కుశ’ అను పదమునకు భూమి, సుఖము అని అర్థము. ‘కు’ అనగ భూమి. ‘శ’ అనగా కుశలము లేక సుఖము. ‘కంటకము’ లనగ సుఖము కడ్డు వచ్చునవి. భూమి సుఖమునకు అడ్డువచ్చునది అసురశక్తియే. ఆ అసురశక్తిని తాను ముందు లంక చేరి మెత్తబరతును

అని సీత పలికినది. ఎంత నిగూఢమైన భాషణము! తాను లంక చేరుటవలననే లంకకు, రావణునకు వినాశము కలుగును. అది దివ్యవాణి. అది నెరవేరవలె నన్నచో, తాను ముందుగ లంకచేరి కొంత రాక్షస సంహారము, లంకాదహనము జరిగిన వెనుక శ్రీరాముడు భూమికి సుఖమును చేకూర్చవచ్చును అనునది రహస్యార్థము.

# 31. రాముని హితోపదేశం

బుద్ధిమంతులగు పురుషులు తమ సాన్నిధ్యమున యితరులను స్తుతించినచో సహింపలేరు అని శ్రీరాముడు జానకీదేవికి హితబోధ గావించెను.

**"బుద్ధియుక్తా హి పురుషాహ న సహంతె పరస్తవం ।"**

అధికారులగు ప్రభువులు బుద్ధిమంతులైనను వారి సముఖ మున ప్రసంగించు చున్నపుడు యితరులను గొప్పగ పొగడరాదు. అట్లు పొగిడినచో వారి ఆగ్రహమునకు గురికావలసి వచ్చును. బుద్ధిమంతు లగువారు అహంకారము దాటినవారు కారని తెలియ వలెను. అహంకారము దాటిన బుద్ధిమంతులు ఆత్మజ్ఞానులే. ఆత్మజ్ఞానులు అరుదుగ గోచరింతురు. బుద్ధిమంతులు మెండుగ గోచరింతురు. కావున బుద్ధిమంతుల సముఖమున యితరులను పొగడుట యుక్తము కాదు. వారి మనసునకు నచ్చునట్లుగ మాట్లాడ వలెను. ఇది ఒక సూచన.

శ్రీరాముడు సీతమ్మకు మరియొక హితమును పలికెను.

**"విప్రియం నచకర్తవ్యం కదాచన ।"**

పెద్దలకు అప్రీతి కలుగకుండ నుండవలెనని మరియొక సూచన. రాబోవు కాలమున భరతుడు రాజగునని, అతని ఎదుట తనను పొగడ తగదని, అతనికి అప్రియమగు విధముగ ప్రవర్తింప

వలదని సీతమ్మకు శ్రీరాము డుపదేశించెను. సాధారణముగ మానవులు తమ కెవరితో నైనను పనిపడినపుడు, వారితో ప్రవర్తింప వలసిన విధానము ఈ రెండు సూక్తులయందు ఉన్నది. పై సూక్తుల నాచరింపనినాడు పెద్దవారు మనయందు విముఖులై యుందురని తెలియవలెను. ఇటుపైన వారిని సుముఖులను చేసుకొనుటకు ఈ క్రింది సూక్తమును పలికినాడు.

**"ఆరాధితాహి శీలేన ప్రయత్నైశ్చోపసేవితాః రాజాన సంప్రసీదంతి ।"**

ప్రయత్నపూర్వకముగ సేవించి ఆరాధించినచో రాజులు అనుగ్రహింతురు అని తెలిపినాడు. లోకమున తమకన్న పెద్దవారిని ఉన్ముఖులను చేసుకొనుట, సుముఖులను చేసుకొనుట, ఆనందింప జేయుట వలన స్వకార్యము నెరవేరునుగాని, మరియొక విధముగా వలనుకాదు గదా! లోకమున కార్యసిద్ధి కోరువారు అసత్యదోషము లేక పై విధముగా ప్రవర్తించినచో వారికి తప్పక సిద్ధి కలుగును. ఇది సరియగు లౌక్యము. అహంకార పడినచో విఘ్నములు మెండగును.

# 32. ప్రత్యక్ష దైవములు

శ్రీరామచంద్రుడు నర రూపమును ధరించిన దైవము. నరుడుగ మానవుడు నిర్వర్తించవలసిన ధర్మమును సందర్భోచితముగ ఉటంకించినాడు. ప్రస్తుత కాలమున మానవుడు ప్రత్యక్ష దైవమును మరచి, పరోక్ష దైవమును ఎక్కువగ ఆశ్రయించు చున్నాడు. అట్టి వానికి రాముని హితోపదేశము ఎంతయో అవసరము.

**"మనకు ప్రత్యక్ష దైవములు తల్లి, తండ్రి, గురువు. పరోక్ష దైవము భగవంతుడు. ప్రత్యక్షముగ మనచే ఆరాధింపబడి, ఆనందించి మనను ఆజ్ఞాపించి, సేవలను పొంది ఆనందింపజేయు తల్లిని, తండ్రిని, గురువును వదలి ఎక్కడో కనబడని దైవమును అనేక విధముల ఆరాధించుట తగని పని."**

**శ్లో॥ అస్వాధీనం కథం దైవం ప్రకారై రభిరాధ్యతే ।**
**స్వాధీనం సమతిక్రమ్య మాతరం పితరం గురుమ్ ॥**

అందుబాటులో నున్న తల్లి తండ్రి గురువులను ఆరాధింపక, సేవింపక, అనుసరింపక అందుబాటులో లేని భగవంతునెట్లు ఆరాధించుట, సేవించుట, ఆనందింపజేయుట జరుగును? ప్రత్యక్ష మగు దైవమును వదలి, పరోక్ష దైవమును పొందుటకు చేయు ప్రయత్నము, ఉట్టికెక్కలేనమ్మ పర్వతారోహణము చేయుటకు ప్రయత్నించుట వంటిది.

**ఏ మూడు కార్యముల వలన మూడు లోకములను పొంద వలెనని లోకమునందు మానవులు ప్రయత్నింతురో ఆ మూడు లోకములను తల్లి తండ్రి గురువులను సేవించి పొందవచ్చును. వారితో సమానమగు, పవిత్రమగు వస్తువు మూడు లోకములందు వేరొకటి లేదు. వారినే మనము సేవించవలెను. ఆరాధించవలెను. వారి ఆజ్ఞలను ధర్మాధర్మ విచక్షణను మాని పరిపాలింపవలెను. ఇది రామ వాక్యము.**

యజ్ఞము, దానము, తపస్సు చేయుచు మూడు లోకములను మానవుడు పొందవచ్చును. ఈ మూడింటిని పొందుటకే అనాదిగ మానవులు యజ్ఞము, యాగము, తపస్సు చేయుచు నున్నారు. కాని మూడు లోకములు పొందుటకై ప్రయాస చెందుటయే జరుగు చుండును గాని, లభ్యము కావు. అనాయాసముగ మూడు లోకము లను పొందుటకు శ్రీరాముడు ఉపాయము తెలుపుతున్నాడు. ప్రత్యక్ష దైవములగు తల్లి – తండ్రి – గురువులను ఆరాధించుట, సేవించుట, వారి ఆజ్ఞలను పరిపాలించుట చేయువారు శీఘ్రముగ మూడు లోకములను జయింతురని తెలిపినారు.

**శ్లో॥ యత్త్రయం తత్త్రయో లోకా పవిత్రం తత్ సమం భువి ।**
**నాన్యదస్తి శుభాంపాంగే తేనేదమభిరాజ్యతే ॥**

పరశురాముడు, శ్రీరాముడు పితృవాక్య పరిపాలనలో సాటిలేని వారు. పరశురాముడు తండ్రియగు జమదగ్ని మహర్షి ఆజ్ఞాపింపగ, తల్లియగు రేణుకాదేవి శిరస్సును ఖండించెను. జమదగ్ని మహర్షి రేణుకాదేవియందు ఏర్పడిన మలినత్వమును దర్శించి, శిరోఖండనము

చేయుడని కుమారుల నాజ్ఞాపింపగ, పరశురాముడు తప్ప అందరును వెనుకాడిరి. తల్లిని సంహరించుట ధర్మము కాదని భావించిరి. కాని పరశురాముడు ధర్మాధర్మ విచక్షణను తండ్రికే వదలి శిరో ఖండనము చేసెను. అటుపైన జమదగ్ని మహర్షి సంతసించి, రేణుకాదేవిని పునరుజ్జీవింపజేసి పరశురాముని బహు విధములుగ శక్తివంతుని గావించెను. పరశురాముడు మహాశక్తివంతుడై ఇరువది ఒక్కమారు భూప్రదక్షిణము గావించి దుష్టులగు రాజుల నందరిని సంహరించి ధర్మసంస్థాపనము చేసెను. దత్తవరప్రసాది, అజేయుడు అయిన కార్తవీర్యుని కూడ తుదముట్టించెను. మూడు లోకముల చేతను పూజింపబడెను. రామాయణ మీ ధర్మమును విస్తృతముగ బోధించును. ప్రత్యక్ష దైవములు అనుగ్రహించినచో భగవంతుడును అనుగ్రహించును. ఆగ్రహించినచో దైవమేమియు చేయక నిర్లిప్తముగ నుండును.

**సత్యము పలుకుటకంటే, దానము చేయుటకంటే పెద్దలను, ఋషులను, దేవతలను పూజించుట కంటే పితృసేవ గొప్పది. తగిన దక్షిణ లిచ్చి ఎన్ని యజ్ఞములు చేసినను పితృసేవతో సమానములు కావు. పరలోకమందు కూడ అభ్యుదయము కలిగింపగలుగు బలము నిచ్చునది పితృసేవ. పితృసేవ వలన లభించు శక్తి దేనివలనను లభించదు.**

**శ్లో॥ న సత్యం దాన మానౌవా న యజ్ఞాశ్చాప్త దక్షిణాః ।**
**తథా బలకరాస్సీతే యథా సేవా పితుర్హితా ॥**

కావున ప్రత్యక్ష దైవమును సేవించుట బుద్ధిమంతులు నిర్వర్తింప వలెనని శ్రీరాముడు పలుకుచున్నాడు.

**శ్లో॥ స్వర్గో ధనం వా ధాన్యం వా విద్యాః పుత్రా స్సుఖానిచ ।**
**గురువృత్త్యనురోధేన నకించిదపి దుర్లభమ్ ॥**

**"లోకములో ఒక్కొక్క ఫలము పొందుటకు ఒక్కొక్క కర్మ చేయుదురు. కాని పెద్దలగు తల్లిదండ్రులు, గురువుల మాట పాటించుటచే ఎన్నో ఫలములు ఒక్కుమ్మడిగ లభించును. కొన్ని కర్మలు చేయుటచే ధన ధాన్యములు లభించును. కొన్ని కర్మలు చేయుటచే విద్య అలవడును. కొన్ని కర్మలు చేయుటచే సత్సంతానము కలుగును. కాని పెద్దల వాక్యములను పాలించిన వారికి పొందలేని దేదియు లేదు."**

"దేవలోకము, గంధర్వలోకము, భూలోకము కూడ మాతాపితరులను సేవించుటచే పొందవచ్చును. బ్రహ్మోపాసనచే పొందదగిన మోక్షము కూడ తలిదండ్రుల సేవచే పొందవచ్చును. తల్లిదండ్రులు ఎట్లు నన్ను శాసించినారో అట్లే నడుచుకొందును. వాటిననుసరించి యుండుటయే సనాతన ధర్మము" అని నిర్ద్వందముగ రాముడు ధర్మబోధను గావించినాడు.

# 33. లక్ష్మణుని శరణాగతి

**మహాయశస్సు, శక్తి, సమర్థత కలవాడైనను పొందవలసిన ఫలములను పొందుటకు భగవానుడే సాధనము. లౌకికములైన ఫలములనుగాని, అలౌకికమైన ఫలములను గాని అనుగ్రహించువాడు భగవానుడే. మోక్ష మొసంగెడిది కూడ భగవంతుడే!**

కాని అందరకు అట్లనిపించదు. తాము చేయు ప్రయత్నముచే, తాము చేయు కర్మలచే తమకు ఫలము సిద్ధించునని అనుకొను చుందురు. లౌకికములగు ఫలములను స్వప్రయత్నముతో పొంద వచ్చునని, స్వర్గము మొదలగు వానిని యజ్ఞ, యాగ, దానాది కర్మలతో పొందవచ్చునని భావింతురు. మోక్షము కూడ కర్మచేతనో, భక్తి చేతనో పొందవలెనని భావింతురు. కర్మాచరణమునకు, ఫలసిద్ధికి నడుమ దైవమున్నాడని తెలియకపోవుట అవివేకము. కర్మలు శాస్త్రవిధిని ఆచరించినను ఫలములు కలుగకపోవచ్చును. నిత్య జీవితమున ఈ సత్యమును మానవుడు దర్శించుచునే యున్నాడు. నిజమునకు ఫలసిద్ధి దైవానుగ్రహమే. దాంపత్య జీవితమున సంతానము కలిగితీరునని ఎవ్వరునూ చెప్పలేరు గదా? ఎదురుగ నున్న భోజనము నోటి కందుటకు గల వ్యవధిలో కూడ దైవమున్నాడు.

బుద్ధిమంతులు భగవానుడు తప్ప యితరమైనవి ఏవియు ఫలముల నందించు సాధనములు కావని తెలిసియుందురు. చేసిన ప్రయత్నములు ఫలించుట భగవదనుగ్రహమే. భగవంతుడు

సంతుష్టినంది, ఫలములు తానే ఒసంగును గాని, కేవలము చేసిన కర్మయే సాధనము కాదు.

**కర్మచేతగాని, జ్ఞానముచేతగాని, భక్తిచేతగాని, వైరాగ్యముచేత గాని, యోగసాధన చేతగాని, మోక్షము లభించునది కాదు. ఇవి యన్నియు భగవదనుగ్రహము కొరకు చేయు సాధనములు. భగవదను గ్రహము లభించుట, లభించకపోవుట జీవుల అధీనమున లేదు. భగవంతుడే ఉపాయమని విశ్వసించుట నిజమగు ఉపాయము. ఇట్టి తెలివిగలవా రందరును శరణాగతి మార్గము ననుసరింతురు.**

శ్రీరాముడు వనవాసమునకు దృఢ విశ్వాసముతో నున్నాడని ఎరిగిన లక్ష్మణుడు శరణాగతి మార్గమునే అనుసరించినాడు. అందులకై రాముని చరణములను గట్టిగ కౌగలించుకొని తన పరమభక్తిని ప్రకటించినాడు.

దైవమునే ఉపాయముగా మనసులో దృఢముగ నమ్మియుండు వాడు భక్తుడు. అనూహ్యము, క్లిష్టము, అవశము అయిన పరిస్థితులలో సాధకుల మనస్సు పరిపరి విధములగు తర్కమును సూచించు చుండును. బంధువులు, స్నేహితులు వారి వారి మనస్సునకు తోచినవి సూచింతురు. జీవిత భాగస్వామి కూడ తనదైన తెలివితో లౌక్యమును తెలుపుచుండును. చలించిన మనసు కలిగియున్నపుడు సానుభూతి కొరకు, శీఘ్ర పరిష్కారము కొరకు సాధకుడు వక్రమార్గములు సూచింపబడినపుడు అవి సరియగు మార్గములుగనే కన్పట్టును. క్లిష్ట సమయములలో మనస్సు చలించుటయే దీనికి కారణము. సూచన లను, సలహాలను యిచ్చువారందరును వారి ఆతురతను ప్రకటించు

చుందురు. అట్టి సమయమున పెద్దలు, తెలిసినవారు త్వరపడి సలహాల నివ్వరు. వారి వద్దకు చేరి సలహాను కోరినగాని తెలుపరు.

శ్రీరామునికి కైకేయి భాషణముతోనే జరుగవలసినది పట్టాభిషేకము కాదనియు, వనవాస దీక్షయనియు సూటిగ తెలిపినది. అప్పటికప్పుడే నిర్ణయము గావించుకొనినాడు. కావున ఆ విషయమై వశిష్ఠాది మహర్షులను సంప్రదించలేదు. వారి సలహాను కోరలేదు. సిద్ధపడిన పట్టాభిషేకమునకు భంగము కలిగి, అరణ్యమున కేగుట అవమానమని భావింపలేదు. తన దోషముచే వచ్చినది కాదు గనుక ఉపేక్షించెను. మనసులో దృఢముగ నిశ్చయించుకొనెను. వనవాసమునకు నిర్ణయించుకొనెను. "లక్ష్మణా! నేను మనసులో నిర్ణయించుకొనిన దానిని విరమించుకొనుట నాకు చేతగాదు." ఇది రాముని స్థితప్రజ్ఞత్వం. **"బుద్ధి ప్రణీత ఏ నేయం మనస్య సుసమాహితం"** (22వ సర్గ, 14వ శ్లోకం) **క్లిష్టమైన సమయములందు మనస్సును పరిపరి విధముల పోనీక దైవమునకు సమర్పించిన వారికి బుద్ధి నుండి దైవమే సరియగు ప్రేరణ యిచ్చును.** రాము డట్టివాడు గనుక అతడికి క్లిష్ట సమయమున దైవ ప్రేరణ లభించినది. కేవలము స్థిరమతి అయినంత మాత్రమున దైవప్రేరణము లభించునని చెప్ప లేము. నిరంతరము అంతస్మరణమున దైవసాన్నిధ్య మనుభవించు వారికి ప్రేరణ లోనుండియే కలుగును. కనుకనే శ్రీరాముడు కౌసల్యా దేవి తెలిపిన ఉపాయమును, లక్ష్మణుడు తెలిపిన ఉపాయమును మనస్సున తిరస్కరించి, ఒకరికి ధర్మబోధ, మరియొకరికి దైవబోధ గావించినాడు. ఇట్టి గంభీరమగు విషయములు రామాయణ కావ్యముపై శ్రద్ధ వహించి ప్రశాంత చిత్తముతో పఠించిన తెలియగలవు.

# 34. రాముని అవతార లక్షణము

లక్ష్మణుడు, కౌసల్యాదేవి రాముని వనవాసమునకు ప్రతికూలముగ స్పందించిరి. కారణము వారికి రామునిపైగల అపారమగు ప్రేమ. వారి దృష్టిలో కైకేయి ప్రవర్తనము ధర్మ రహితము. శ్రీరాముడు అన్యాయమునకు గురి చేయబడినవాడని వారి భావము. కావున వారు దశరథుని, కైకేయిని దూషించిరి. అది కేవలము రామునిపైగల ప్రేమచేతనే. మన మిష్టపడినవారికి ఎవరైనను కష్టము కలిగించినపుడు, వారిని దూషించుట లోకసామాన్యము. కౌసల్య, లక్ష్మణులు గూడ ధర్మపరులే గనుక రాముని ప్రత్యుత్తరమునకు సమాధానపడిరి. రాముడే జరుగుచున్న మార్పునకు సమాధానపడినాడు గనుక, వారును సమాధానపడుట తప్పనిసరైనది. వారిరువురును రాముని యందు గల ప్రేమచేత ధర్మాధర్మములను లెక్కచేయలేదు. వారికి ధర్మము కన్న రాముడే గొప్పవాడు. రాముడే దైవమని నమ్ముటవలన, రాముడే శరణ్యమని, రాముడే సత్యమని, అట్టి రామునకు కించిత్ కష్టము కలిగినను సహింపలేక పోవుట వీరిద్దరి యందు బుద్ధి మంతులు గమనించవలెను.

ధర్మపరులైనను సన్నిహితులకు కష్టము కలిగినపుడు దానికి కారణమైన వారిని దూషించుట కద్దు. దైవమును గూడ దూషించుట జరుగుచుండును. అట్టి పరిస్థితులలో దైవమునకే కష్టము కలిగినదని భావించువారికి ధర్మమును లెక్కచేయుట కుదరని పని. ఇచ్చటొక

ధర్మ రహస్యము రామాయణమున గోచరించును. పరమ ప్రేమ యున్నచోట ధర్మమునకు తావున్నదా, లేదా? ధర్మము గొప్పదా, దైవమునందు ప్రేమ గొప్పదా? **దైవము గొప్పదని భావించువారు భక్తులు. ధర్మము గొప్పదని భావించువారు జ్ఞానులు. రెండింటిని సమన్వయించువారు అవతార పురుషులు.**

శ్రీరాముడు జరిగిన ఆకస్మిక మార్పునకు స్పందించిన తీరులో అతడవతారమూర్తి యని స్పష్టముగ తెలియవచ్చును. అతడు దశరథుని, కైకేయిని, కౌసల్యా లక్ష్మణులవలె తప్పు పట్టలేదు. జరుగవలసిన కార్యమునకు వారు కేవలము నిమిత్తమాత్రులని భావించెను. తనపైగల ప్రేమ భావముచేత ధర్మము తప్పుదని బోధించు కౌసల్యా లక్ష్మణులకు ధర్మమును బోధించి సుస్థితులను చేసినాడు. కైకేయిదేవికి కూడ శీఘ్ర వనవాస గమనము ద్వార ఊరట కలిగించాడు.

దశరథుని విషయమున విశేష ధర్మము నాచరించెను. తన తండ్రికి తనయందు అపారమగు ప్రేమ. తాను కనపడనిచో దశరథునికి అపరిమితమగు దుఃఖము కలుగును. దశరథునకు రాముడే సర్వము. రాముడు లేక జీవించలేని స్థితి అతనిది. దశరథుడు చక్రవర్తి. సత్య పరాక్రముడు. సత్యమును, ధర్మమును పాటించుచు మహత్తర సామ్రాజ్యము నెలకొల్పి, బహుకాలము నిర్వర్తించిన వాడు. అతడు ధీరుడే గాని భీరుడు కాదు. అతడికి కైకేయి నిమిత్త కారణముగ ఘర్షణ కలిగినది. రాముని ప్రేమించువారిలో దశరథుడు ఎవ్వరికిని తక్కువ కాదు. రాముడే తన ప్రాణమై జీవించువాడు. రామాయణమున రాముడు కనిపించనిచో మరణించిన మరియొక పాత్ర లేదు.

కైకేయి కోరిన వరము మన్నించుట దశరథుని కర్తవ్యము. అది ధర్మము. మాట యిచ్చుట చేత కైకేయి కోరిన వరము తీర్చుట ధర్మమై నిలచినది. ఎన్నడును ధర్మము తప్పనివాడు దశరథుడు. **మాటయిచ్చి తప్పుటకన్న, మాట కొరకు ప్రాణములను బలియిచ్చుట మహాత్ముల మార్గము.** తానుగ వనవాసమున కేగుమని, భరతునికి పట్టాభిషేకము చేతునని దశరథుడు పలుకలేదు. సత్యవాక్యమును పరిపాలించవలె నన్నచో అతడు కైకేయి కిచ్చిన మాటను పాలించుట తప్పనిసరి. దశరథునికి కూడ ధర్మము కన్న రాముడే గొప్ప. కాల మతనిని అవశుని జేసినది. రాముడు అందరిని ఎదిరించి రాజ్యము నాక్రమించినచో బాగుండునని లోలోపల భావించెను. రాముడట్లు చేయడని కూడ తెలిసియు, చేసినచో బాగుండునని ఎంతయో భావించెను.

దశరథుని చూచిన రాముడు క్షణ కాలములో తండ్రి మథనమును గ్రహించెను. తనను వనవాసమునకు పంపుట దశరథుని ధర్మము. కాని తనను పంపకుండుట అతని కిష్టము. మొదటి కార్యము దశరథునికి శ్రేయస్సు కలిగించును. రెండవ కార్యము దశరథునికి ప్రీతి కలిగించును. దశరథునికి ప్రియమగునట్లు చేసినచో దశరథుడు ధర్మము తప్పిన వాడగును. తాను కారణముగ తన తండ్రి ధర్మము తప్పుట రామునికి సుతరాము యిష్టము లేదు. దశరథునికి శ్రేయస్సు కలుగవలెనన్నచో తాను వనవాస మేగుటయే కర్తవ్యము. పితృవాక్య పరిపాలనము తనకును, తండ్రికిని శ్రేయస్సు అయి నిలచినది. అట్లు చేయకుండుట తన తండ్రి కపాయము కలిగించును. ఈ కారణముగ దశరథుని ఉత్తరగతులకు భంగము కలుగకుండ ధర్మమును ఆచరించి చూపించిన అవతార పురుషుడు రాముడు.

# 35. లక్ష్మణుని తత్త్వచింతన

జీవునకు శరీరమునకు గల సంబంధ మెటువంటిదో, దైవమునకు జీవునకు గల సంబంధమట్టిదే. దైవమునకు జీవుడు వాహిక. జీవునికి శరీరము వాహిక. శరీరము జీవునిపైనే ఆధారపడి యున్నది. జీవులెట్లు సంకల్పించిన అట్లు ప్రవర్తింతురు. జీవుని కొరకే ప్రవర్తించును. జీవుడాధారముగనే నిలచి ఉండెడిది శరీరము. జీవుడు విసర్జించిన శరీరము జీవింపదు.

జీవునికొరకే శరీర మెట్లున్నదో దైవము కొరకే జీవుడట్లున్నాడు. కాని జీవుడజ్ఞానముచే ఈ సత్యమును మరచును. తనకొరకే అన్నియు చేయు చున్నానని భావించును. పరమార్థమే జీవుని ప్రయోజనమై యున్నను, స్వార్థము కొరకై పనిచేయుచు, తన్నుతాను బంధించు కొనుచున్నాడు. తన యందు దైవము తనవలె యున్నాడని తెలియదు. తనయందలి తెలివి, ప్రాణము తనది యనుకొనును. నిజమునకవి దైవమునవి. దైవము తన అస్థిత్వమును జీవుని అస్థిత్వముగను, తన ప్రాణమును జీవుని ప్రాణముగను, తన తెలివిని జీవుని తెలివిగను ఏర్పరచియున్నాడు.

**దైవముపైనే జీవుడాధారపడి యున్నాడు. శరీరము తనను సేవించునట్లుగ, తాను దైవమును సేవించవలెను. తాను సంకల్పించినది తన శరీరము చేసినట్లుగ, దైవము సంకల్పించినది జీవుడు చేయవలెను. శరీరము ప్రతి కార్యమును జీవుని ఆజ్ఞ ప్రకార**

**మొనరించి, జీవునికి ప్రీతి కలిగించుచున్నది. అట్లే తాను దైవము నకు ప్రీతి కలిగించవలెను. పరార్థమే తన జీవన ప్రయోజన మని గుర్తించుట వలన జీవుడు తనను తా నెరిగి స్వస్థత పొందును. అనగా స్థిరమగు సుఖమున నిలచును. శరీర మెట్లు జీవుని విడచి ఉండలేదో, అట్లే పరమాత్మను విడచి ఆత్మ యుండలేదు.**

పై సత్యమును తెలిసినవాడు లక్ష్మణుడు. సతతము రామునితో ఉండెడి వాడు, రాముని విడిచి జీవించలేని వాడతడు. భక్తులకు, జ్ఞానులకు అత డాదర్శమూర్తి. భక్తులు, జ్ఞానులు, యోగులు ఎట్లుండ వలెనో తన ప్రవర్తనముతో నిరూపించినాడు. శ్రీరాముడు యితరమగు కర్తవ్యమును లక్ష్మణునకు బోధించినను, లక్ష్మణుడు మాత్రము తన జీవన ప్రయోజనము పరమాత్మ ననుసరించుటయే అని, తనను అనుచరునిగ అనుగ్రహించమని కోరినాడు.

# 36. త్రిజటోపాఖ్యానము

త్రిజటుడు బ్రాహ్మణుడు. తీవ్రమగు నిష్ఠ నియమములు కలవాడు. వయస్సు మళ్ళినవాడు. అతడు ప్రతిదినము త్రవ్వుకోల, గునపములతో అడవికి పోయి దుంపలు త్రవ్వుకొని, ధాన్యపుగింజ లేరుకొని తెచ్చుకొని జీవించు చుండెడి వాడు. అతడు బహుకుటుంబి. భార్యాపుత్రులకు కనీసపు అన్నవస్త్రములను మాత్రమే ఏర్పరచుచు, తాను కూడ కనీస అన్నవస్త్రములే అనుభవించెడివాడు. శ్రమపడి పరుషకారమే ఆధారముగ జీవించెడివాడు. శ్రీరాముడు వనవాసమున కేగుచు తనకున్నదంతయు దానము చేయుచున్నాడని తెలిసిన త్రిజటుని భార్య అతనిని రాముని వద్ద కేగుమని, ధన మర్థించమని వేడుకొనినది. త్రిజటునికి రాముని దానయజ్ఞము గూర్చి తెలిసినను, తనకు తానుగ చనలేదు. భార్య వేడిన పిదపనే సమ్మతించి, రాముని కడకేగెను.

బక్కచిక్కిన బ్రాహ్మణుడు రాముని కడకేగి యిట్లని పలికెను. నేను నిర్ధనుడను. చాలమంది పిల్లలు కలవాడను. నాపై దయ చూపుమని వేడెను. రాముడు నవ్వుచు త్రిజటునితో సరయూనదీ సమీపమునగల గో సమూహమును చూపి, నీ చేతికఱ్ఱ ఎంత దూరము నీవు విసిరెదవో అంతవరకున్న ఆవులన్నియు నీకే యిచ్చెద ననెను. త్రిజటుడు ఆత్రుతతో ప్రాణశక్తి నంతటిని కూడగట్టుకొని చేతికఱ్ఱను విసిరెను. త్రిజటునికి కూడ ఆశ్చర్యము కలిగించునట్లు ఆ చేతికఱ్ఱ

గోవులన్నింటిని దాటి నదీ మధ్యమున నున్న ఆబోతువద్ద పడినది. రాముడు సంతసించి ఆ గోవులన్నింటిని త్రిజటున కిచ్చుచు యింకనూ ధనమిచ్చెను.

ఈ వృత్తాంతమున సాధకులు తెలియవలసిన ఒక రహస్య మున్నది. త్రిజటుడు స్వప్రయత్నము చేతనే క్లేశములు తొలగించు కొనవలెనని భావించి జీవించుచున్నాడు. అయోధ్యయందే జీవించు చుండెను. అయోధ్యలోనే రాముడు కూడ యున్నాడు. అతడు దయామయుడు. దానశీలుడు. అర్థించినవా రందరికిని మేలు చేయు వాడు. అయినను త్రిజటునికి రామునివద్ద కేగవలెనను భావము కలుగలేదు. అందరకు అన్నియు యిచ్చుచున్నాడని తెలిసి కూడ వెళ్ళుటకు బుద్ధి కలుగలేదు. సాధకులు కూడ యిట్లే ప్రవర్తించు చుందురు. తమకు కలిగిన క్లేశములను తామే ప్రయత్నముచే తొలగించుకొన గలమని భావింతురు.

వలసినది ఒసంగెడు వాడు భగవంతుడని తెలియక స్వప్రయత్నమే ఉపాయమని భావింతురు. అట్టివారు త్రిజటునివలె శ్రమపడుచు జీవించుచుందురు. బక్కచిక్కిన బ్రాహ్మణుడు చేతికఱ్ఱను స్వప్రయత్నముతో ఎంతో దూరము విసరలేడు. కాని చేతికర్రను విసరుటకు సంకల్పము రామాజ్ఞగ వచ్చినది గనుక చాల దూరము పోయి పడినది. ఆశించిన దానికన్న విశేషమగు ఫలము త్రిజటునకు లభించినది.

**సంకల్పము తనదనుకొని ప్రయత్నమున నిలచిన వానికి ఫలమంతంత మాత్రమే. సంకల్పము దైవమునదని తలచి ప్రయత్న మున నిలచినవానికి లభించు ఫలము అత్యధికము.**

హనుమంతుడు బలవంతుడు, జ్ఞానవంతుడు, బుద్ధిమంతుడే అయినను రామాజ్ఞను సంకల్పముగ గొని రామబాణమువలె సముద్ర లంఘనము చేయ నిశ్చయించుకొనెను. అంతేకాని తాను బలవంతుడనని, సూర్యుని వరకు కూడ ఎగిరితినని, తానుగ సముద్ర లంఘనము చేయగలనని భావింపలేదు.

సమర్థులగువారు ప్రయత్నశీలురై కార్యములు చేయునపుడు భగవత్ సంకల్పముగ భావించి, భగవదర్పితముగ నిర్వర్తించినచో విశేష ఫలసిద్ధి యుండును.

# 37. అతియశము

ప్రకృతి కతీతుడు పరమాత్మ. పరమాత్మ - పరాప్రకృతి యిరువురిని కలిపి తత్త్వమని పిలుతురు. 'తత్' అనగా అది. అది పురుషుడు కాదు, స్త్రీయు కాదు. అది రెండును కలసియున్న స్థితి. సృష్టి సంకల్పము కాలక్రమమున జనించినపుడు అది పరమాత్మగను, పరాప్రకృతిగను విడివడును. (నిద్రయందు మనము, మన స్వభావము కలిసి ఒకే తత్త్వముగ నుండి, మేల్కాంచగనే రెండగును.) అట్లే సృష్టి మేల్కాంచినపుడు ఒకటి రెండగుట జరుగును. మరల రెండు ఒకటి యగుట యోగము. మూలాధార మందలి కుండలినీ శక్తి సహస్రార మందలి శివునితో ఏకమగుట యోగఫలమని, సమాధి యని యందురు. మరల సంకల్పము కలిగినపుడు సమాధి చేరిన స్వభావము నే నను ప్రజ్ఞకన్న వేరుగ అస్తిత్వమును గొని సంకల్పాను సారము సృష్టిని ప్రారంభించును.

సృష్టియందలి జీవులకును, పరమాత్మకును నడుమ ప్రకృతి యున్నది. జీవు లందరు పరాప్రకృతి నుండి పుట్టిన త్రిగుణముల నుండి పుట్టినవారే. త్రిగుణములను దాటి, పరాప్రకృతిని చేరి పరమాత్ముని చేరుట విధానము. పరాప్రకృతి పరమాత్మయొక్క ప్రకృతియే. ప్రకృతిని మన్నింపక, ఆరాధింపక, అనుగ్రహము పొందక పరమాత్మను చేరుట దుస్సహము, కష్టతరము. తల్లిని కాదని తండ్రిని చేరు కుమారుడు తండ్రి మన్నలను పొందలేడు. తల్లి అనుగ్రహించి

నచో తానే మన్నించి, తండ్రివద్దకు గొనిపోయి, అనుగ్రహింపుడని మద్దతు పలుకును. ఇట్లు తల్లినుండి తండ్రిని చేరువాడు పరమ యశస్కు డగును. యశస్సు ప్రకృతి చేతియందున్నది. ప్రకృతి సృష్టి యందు ఎట్టివారిపైనను మాయ ప్రసరింప జేయగలదు. తననుండి పుట్టినవారందరు తన మాయకు లోబడియే యుందురు. ఆమె మాయను దాటి దైవమును చేరుట దుర్లభము. ఆమె అనుగ్రహమున దైవమును చేరుట సులభము.

**భగవదనుగ్రహమునకు జీవునకు నడుమ త్రిగుణాతీత, త్రిగుణాత్మిక అయిన 'శ్రీ' యున్నది. భగవానుని అనుగ్రహము కోరు వారు శ్రీని మెప్పించవలెను. అనగా ముందుగ అమ్మ నారాధించవలెను. ఆమె మధ్యవర్తి. జీవులను దైవమువద్దకు చేర్చగల ఘటికురాలు.**

సర్వలక్షణ లక్షణుడైనటువంటి లక్ష్మణుడు వనవాసమేగుటకు రాముని చరణములను గాఢముగ ఆలింగనము చేసుకొని ముందుగ సీతమ్మను తాను కూడ వనవాసమునకు చనుటకు అనుమతి వేడుకొనెను. అనుగ్రహించవలసినది రాముడే అయినను, సీతామాత ద్వారా రాముని వేడుట లక్ష్మణుని యశస్సును చాటును. కావుననే లక్ష్మణుడు 'అతియశుడు' అని వాల్మీకి వర్ణించెను.

సృష్టియందు మహాయశస్సును పొందుటకు అనుగ్రహము అత్యవసరము. అట్టి యనుగ్రహము జగన్మాత ఆశీఃఫలము. దైవమును చేరుట పరమోపాయ మైననూ, చేర్చునది అమ్మయే! కావున ఆరాధన మంతయు శ్రీ, పురుష ఆరాధనముగ సాగవలెను. ఇది సౌమ్యము, సులభము అగు మార్గమే కాక యశస్సును కూడ కలిగించును. లక్ష్మణుని ప్రవర్తనము ఈ సత్యమును ప్రకటించు చున్నది.

# 38. రాముని రూప సౌందర్యము

రాముని రూపము గూర్చి ఎందరో కవులు, ఎన్నో రకములుగ వర్ణించిరి. రాముడందమైనవాడు. ఆజానుబాహువు. సుకుమారుడు. ఆకర్షణీయమగు శ్యామల వర్ణము కలవాడు. ఈ విధముగ ఎన్నియో వర్ణనలున్నవి. వాల్మీకి మహర్షి రాముని రూపమును గూర్చి సీత మాటలుగ ఒక మాహాత్మ్యము నావిష్కరించినాడు. ఆ మాహాత్మ్యము ఇట్లున్నది.

రాఘవా! తమ రూపమువంటి రూపము మునుపెన్నడును చూడకపోవుటచే మిమ్ములను చూడగనే వారికి ప్రేమభావము, స్నేహ భావము కలుగును. మరల మరల మిమ్ములను చూడవలెనని వారి కనిపించును. మీ రూప సౌమ్యత వారి యందలి సౌమ్యగుణము నావిష్కరించును. ప్రేమపూర్వకము, స్నేహపూర్వకము అగు చూపులతో మిమ్ములను మరల మరల చూడవలెనని వారి కనిపించును. సమీప మున నిలచి జంతువులు మిమ్ములను చూచి ఆనందించును గాని, మీద పడవు. మీ రూప సౌమ్యత అట్టిది.

మీ రూపము ఎంత సౌమ్యమో అంత భయమును గూడ కొలుపును. క్రూరులకు, క్రూర జంతువులకు మిమ్ములను చూచినపుడు భయము పుట్టును. కావున భయంకరమగు క్రూర మృగములు మిమ్ములను చూచినచో పారిపోవును. కావున అడవిలో మీతో సంచరించుట, విహరించుట వలన, ఎవ్వరికిని ఎట్టి భయము ఉండదు.

రాముని రూపము పూర్వము సృష్టిలో చూడబడిన రూపము కాదు. అంత అందమైన రూపము, ఆకర్షణీయమగు రూపము, సుకుమారమైన రూపము అప్పటికెవ్వరును ఎరుగరు. ఋషులు సైతము రాముని రూపమును దర్శించి మోహపరవశులైరి. సామాన్యుల మాట ఇక చెప్పనేల. అయోధ్యానగరము మొత్తము అతడు రాజ వీథులలో అటునిటు చనునపుడు చూచుట కెంతయో ఉత్సహింతురు. మహాక్రూరుడైన రావణుడు కూడ ప్రప్రథమముగ రాముని రూపమును జూచి చేష్ట లుడిగినవాడై నిలచెను. కారణము నిజమునకు రావణుడు అంతరాంతరములలో దైవభక్తు డగుటయే కారణము.

**సౌందర్యము, భయంకరము కూడ నొకే రూపమునందు వుండుట అనుపమానమగు స్థితి.** రాముడు క్రూరులకు భయము గొల్పువాడగు మహా విష్ణువు వలె గోచరించును. అసురశక్తులు భయపడునది మహా విష్ణువునకే. రాముని రూపము నందుగల అక్రూరత్వము క్రూరులకు భయము కలిగించును. మారీచుడు రాముని రెండు రూపములను ఒకేసారి దర్శనము పొందినవాడు. అతడు కూడ రాముని గూర్చి సీతవలెనే పలుకును. ఆపత్తులు నివారించు సమయమున రాముని సుకుమార రూపము రుద్రరూపము దాల్చుట వలన అట్టి భయము క్రూరులకు కలుగును. కృష్ణరూపము కూడ యిట్లే వర్ణింతురు. రాముని అరుదైన రుద్రరూపమును సముద్రుడు చూచినాడు. లంకను చేరుటకు విఘ్నముగ గోచరించిన సముద్రునిపై రాముడు బాణము సంధించినపుడు ప్రళయాగ్ని రుద్రునివలె నున్న రాముని చూచి సముద్రుడు శరణువేడుట జరిగినది. అంతటి **రుద్రరూపము సర్వ సామాన్యముగ సౌమ్యరూపమై యుండుట దివ్యవిభూతి.**

# 39. లక్ష్మణుని వినయము

లక్ష్మణుడు రాముని పాదములను పట్టుకొని అతియశస్కుడై సీతారాముల నుద్దేశించి **"కురుష్వమామ్ అనుచరం"** మీ అనుచరునిగ నన్ను అనుగ్రహింపుడు అని అన్నాడు.

భక్తిగలవారి భాషణము యితరుల భాషణముకన్న భిన్నముగ నుండును. మీరు వనవాసమున కేగినచో నేను కూడ అనుసరింతును అని లక్ష్మణు డనలేదు. తనను అనుచరునిగ అనుగ్రహింపుడని వేడుకొనెను. ఇది నిరహంకారులు మాత్రమే చేయగల భాషణము. దైవము, ప్రకృతుల నుండి దిగివచ్చిన జీవుడు వారిని అనుసరించవలె నన్నచో వారి అనుగ్రహము తప్పనిసరి. భక్తునికి కోరిక కలిగినపుడు అట్టి కోరికను దైవముయొక్క అనుగ్రహము పొందుటకు ప్రార్థింతురే గాని, తమంతట తాము పొందవలెనని భావింపరు. సీతారాములు అనుగ్రహించనిచో వారి వెంటనుండి సేవ చేయుట వీలుపడు విషయము కాదు. భక్తునకు భగవంతు ననుసరించుట, అప్రమత్తుడై సేవించుట మాత్రమే ప్రధానము. వేరొక ప్రయోజనము లేవియు వారు కోరరు. చావుపుట్టుక లుండగూడదని కోరరు. మూడు లోకములపై ఆధిపత్యము కావలెనని కోరరు. మోక్షము పొందవలెనను కోరిక కూడ వారి కుండదు. దైవము ననుసరించుచు దైవ సేవలో ఉండుటయే వారికి సర్వస్వమును. ఇతరములైన విషయములు అప్రధానములు. తాను జీవుడు. ప్రకృతి పురుషుల నాశ్రయించి

జీవించువాడు. వారే తన అస్తిత్వముగ కలవాడు. తనకు తానుగ అనుసరించ గలనను అహంకారము లేనివాడు భక్తుడు.

భక్తునకు దైవముతో ఉన్న సహజమగు సంబంధమును సహజముగ తెలిసియుండును. నిజమునకు జీవుడు దేవుడు విడదీయరాని సంబంధము కలవారు. వస్తువు గుణము ఎట్లు వేరుచేయుట వీలుపడదో అట్లే జీవుడు, దేవుడు కూడ. అజ్ఞానముచే జీవుడు మరచునే కాని, మరచిన వానిలో కూడ ప్రాణముగను, తెలివిగను దైవమే యున్నాడు. జీవుడు దైవముతో వేరుచేయుటకు వీలుకాని స్థితి యందున్నాడు. తాను వేరుగ నున్నాడనుకొన్నవాడు తాను లేనివాడగును. సముద్రము లేని అల ఉండునా? అల లేని సముద్రముండ వచ్చును కాని, సముద్రములేని అల ఉండదు.

నన్ను నీతో కూడివుండువానిగ చేయుము అని కోరుటలో ఎంతయో జ్ఞాన మున్నది. జ్ఞానముతో పాటు వినయ మున్నది. అనుచరుడుగ ఉండదలచిన వాడు అపుడపుడు ప్రమత్తుడై, అనుచరుడుగ ఉండజాలక పోవచ్చును. అప్రమత్తుడై ఉండుటకు అనుగ్రహ మవసరము. లక్ష్మణుడు రామునికి తన కోరికను ప్రార్థనగ సమర్పించెనే గాని, కోరికగ సమర్పించలేదు. **దైవమును సేవించుట జీవుని ధర్మము. జీవుల సేవ నందుకొనుట దైవము ధర్మము. దైవమును సేవించు బుద్ధి జీవున కొసగువాడు కూడ దైవమే.** కావున ముందుగ రాముడు లక్ష్మణుని అనుచరునిగ చేయవలెను. అపుడు లక్ష్మణు డనుచరుడై నిలువగలడు. దైవము ననుసరించుట కిదియే ఉపాయము. తానుగ అనుసరింతు ననుకొనుట అహంకారము.

# 40. లోకరీతి

తీగలేని వీణ మ్రోగదు. చక్రము లేని రథము నడువదు. భర్త లేని స్త్రీ సుఖము నొందదు. వాయిద్యమున తీగలే శబ్ద తరంగములను పుట్టించినను వీణ బాగా పలికన దందురుగాని, తీగలు బాగా పలికినవని ఎవరును అనరు. రథము సాగుటకు శ్రమపడునది చక్రము. గతుకుల రహదారులలో కూడ వేగముగ తిరుగుచు రథమును ముందుకు సాగునట్లు శ్రమించును. రథము బాగా సాగిన దందురు కాని చక్రము బాగా తిరిగినదని ఎవరును అనరు. తీగ, రథచక్రము శ్రమపడినట్లు భర్త శ్రమపడి గృహజీవితమును నిర్వర్తించు చున్నపుడు కీర్తి గృహిణికే కలుగును. అట్లే భార్య శ్రమపడి గృహ విషయములను సమర్థవంతముగ నిర్వర్తించుచున్నపుడు పురుషుడు సమాజమున విజృంభించి పనిచేయుచు కీర్తి ప్రతిష్ఠలను పొందును. **కీర్తి ఒకరిది. శ్రమ మరియొకరిది.** ఇది లోకరీతి.

రాముని వలన సీత కెంత కీర్తి కలిగినదో, సీత వలన రామునికి కూడ అంతియే కీర్తి కలిగినది. వారి విషయమున శ్రమ ఒకరిది, కీర్తి ఒకరిది కాక యిరువురి శ్రమ, యిరువురి కీర్తి సమానమై నిలచినది. కనుకనే వారి జీవితములు లోకోత్తరమైనవి. లోకరీతి నధిగమించి యున్నవి. కీర్తి కొరకు కాక ధర్మము కొరకై శ్రమించువారు యిట్లుందురు.

# 41. లక్ష్మణ భక్తి

శరీరము, జీవుడు, దేవుడు ముగ్గురును మానవ శరీరమున కలిసే యుందురు. శరీరము, జీవుడు దేవుని వారే. జీవుడు దైవమును పొందుటకే శరీర మీయబడినది. మానవ శరీరమే ధర్మసాధనకు పనిముట్టు. దైవానుభూతికి వేదిక. జీవునికి శరీరమును, యింద్రియములను, మనస్సును ప్రసాదించినవాడు దేవుడే. జీవుని యందు బుద్ధిరూపమున వెలుగొందువాడు కూడ దేవుడే. ఇన్ని ఏర్పాట్లు జీవునికి చేసినవాడు దేవుడు. ఎందుల కిట్లు జీవుని కొరకై దేవు డమర్చినాడు? జీవుని ఆనందము కొరకు. ఆనందము కొరకు అన్వేషించువాడే జీవుడు. ఆనంద స్వరూపమే దేవుడు. దేవుని అనుగ్రహమున, జీవుడు దైవమును చేరినచో అతని అన్వేషణమునకు రస సిద్ధి లభించును. అన్వేషణమునకు వలసిన సదుపాయము లన్నియు కూడ దైవమే ఏర్పరచెను. ఏ ప్రయోజనము కోరి జీవునకు శరీరాదు లేర్పడినవో, ఆ ప్రయోజనము జీవుడు మరచిన నాడు జీవితము ఒక చిక్కు ప్రశ్నగ మిగులును.

మానవుడు శరీరముతో ఉండుట భగవంతుని పొందుటకే అని ఋషులు అభిప్రాయపడిరి. **శరీరముతో చేసే సర్వవ్యాపారములు భగవంతుని సేవ కొరకే అని గుర్తింపవలెను.** శరీరము మన కుపయోగపడునట్లు కనపడును. నిజమునకది మనము దేవుని చేరుట

కుపయోగపడునది. ఇతర ప్రయోజనములకు వాడినపుడు అది కృశించు చుండును.

జ్ఞానముగల జీవుడు శరీరమునందు వసించుచు దాని నెట్లు నడిపింప వలెనో ఎరిగి పరమాత్మను చేరుటకు ప్రయత్నించును. అట్టి వానికి క్రమముగ దైవ సంకల్పము బుద్ధికి ప్రేరణ నిచ్చి పనులను గావించుచుండును. అట్టి సమయమున జీవుడు దైవ సంకల్పమునకే క్రమముగ సమర్పణ గావించుకొనుచు, తనదగు స్వతంత్ర సంకల్పము లను అనాయాసముగ విసర్జించును. అజ్ఞానముచే జీవుడు తాను స్వతంత్రుడ నని భావించి తన శరీరముతో తాను చేయు పనులు తనకొరకే చేయుచున్నానని అనుకొనుచుండును. ఇది భ్రాంతి. **చేయుటకు ప్రేరణ యిచ్చువాడు, చేసిన పనులచే ప్రీతినందువాడు మన లోపలి దైవమే.** లక్ష్మణుడు ఇట్టి జ్ఞానము కలవాడగుటచే రాముడే దైవమని తెలిసి, సీతారాములకు అహర్నిశలు సేవ చేయుటయే తన ధర్మముగ భావించెను.

# 42. వరము - అపాయము

ఋషులు, మునీంద్రులు అనుగ్రహించి ఏదైన ఒక వరము నిచ్చి, ఒక నియమము తెలిపినచో ఆ నియమమును పాటించుట వరగ్రహీత బాధ్యత అయి ఉన్నది. అట్లు చేయనిచో వరమే శాపము కాగలదు. వరములకొరకు కుతూహలించు వారు నియమములను పాటించనిచో శాపగ్రస్తు లగుచుందురు.

పూర్వము కేకయ రాజునకు ప్రాణులయొక్క ధ్వనులలోని అర్థమును ఎరుంగు శక్తిని ఒక మునీంద్రు డొసగినాడు. ఆ వర ప్రభావమున కేకయరాజు ఎన్నియో నిగూఢమగు ప్రకృతి రహస్యము లను గ్రహించి, బలవంతుడై ప్రజారంజకముగ రాజ్యము పాలించి నాడు. పశు, పక్షి, క్రిమి, కీటకముల ధ్వనులలోని అర్థమును గ్రహించి, కాలవశమున జరుగు సన్నివేశముల నెరిగి బుద్ధిమంతుడై రాజ్యమును పాలించెను. తా నిచ్చిన వరమును, తాను వినిన ధ్వనులను యితరులకు వివరింపరాదని మునీంద్రుడు నియమమును కూడ నొసంగెను. నియమోల్లంఘనము చేసినచో రాజు మరణించునని కూడ తెలిపినాడు.

ఒకనాటి రాత్రి కేకయరాజు మంచముపై పరుండిన సందర్భమున మంచము క్రింద ప్రాకుచున్న చీమ ఒకటి ధ్వని చేసెను. ధ్వనిశబ్ద మెరిగిన రాజునకు నవ్వు వచ్చినది. మంచముపై తన ప్రక్కననే పడుకొనియున్న రాణి, రాజును చూచి అతని నవ్వునకు

కారణమడిగెను. రాజు నియమబద్ధుడై తన నవ్వునకు కారణము తెలుపుటకు యిచ్ఛగించలేదు. అహంకారియైన రాణి తనను గూర్చియే రాజు నవ్వినాడని భ్రమపడి, నవ్వునకు కారణమేమో తెలుపమని నిర్బంధించెను. తాను కారణము తెలుపలేనని, తెలిపినచో మరణింతు నని రాజు తెలిపినను రాణి పట్టువదలక రాజును నిర్బంధించినది.

తాను విన్న ధ్వని అర్థము నిజమునకు స్వల్ప విషయమే కాని, తెలిపినచో తాను మరణించుట తథ్యము. మరణించినను సహింతును కాని, అవమానము భరించలేననుచు రాణి పలికిన పలుకులకు రాజు నిస్సహాయుడై మునీంద్రుని ప్రార్థించెను. అపుడు మునీంద్రుని వాక్కులిట్లు వినబడినవి. "రాజా! పతి మరణము సహితము కోరు భార్య, భార్య కాదు. అట్టి భార్య మృత్యువు. ఆమెను తక్షణమే విసర్జించుము." మునీంద్రుని ఆజ్ఞను పాలించి, రాజు రాణిని విసర్జించెను.

**వరములు పొందినవారికి ఆపదలు, కఠినమైన పరీక్షలు తారసిల్లుట ప్రకృతి సహజము.**

# 43. దశరథుని భంగపాటు

సత్యము, ధర్మము అనునవి రెండును విడువక కలసి యుండును. సత్యము ఎప్పుడును మారకుండ యుండును. ధర్మము దేశమును బట్టి, కాలమును బట్టి, వర్ణమును బట్టి, ఆశ్రమమును బట్టి, వయస్సును బట్టి మారుచుండును. రూపాయి నాణెమునకు ఒకవైపు విలువ, రెండవ వైపు బొమ్మ యుండును. నాణెముపై బొమ్మ మారవచ్చును కాని విలువ మారదు. ఒక రూపాయి బిళ్ల, ఒక రూపాయిగనే చెల్లుబడియగును. రెండు రూపాయల బిళ్ల, ఐదు రూపాయల బిళ్ల కూడ అట్లే. విలువను బట్టి చెల్లుబడి యగును. నాణెముపై బొమ్మ దేశ కాలములను బట్టి మారుచుండును. అట్లే సత్యము, సత్యముగనే యుండును. అది నాణెము విలువ వంటిది. ధర్మము పై తెలిపిన సందర్భములలో మారుచుండును. అది నాణెముపై బొమ్మవంటిది. రెండును కలసి నాణెముగ చెల్లుబడి యగుచుండును.

మానవ జీవితమున గూడ సత్య మెప్పుడును మారదు. ధర్మము మారుచుండును. సత్య మందరికిని సమానము. ధనికునికి దరిద్రునికి కూడ ఒకటియే. **"బ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే"** అను అన్నమాచార్య కీర్తన సత్యమును చాటు కీర్తన. ధర్మము మాత్రము మానవులకు వారి వారి గుణసంపద బట్టి యుండును. ఎవరి గుణముల కనుగుణమైన ధర్మమును వారు పాటింపవలెను. అంతియే

గాక కాలమును బట్టి, దేశమును బట్టి తగు మార్పులను కూడ చేసుకొన వచ్చును. వయస్సును బట్టి కూడ మార్పులు చేసుకొన వచ్చును. **ధర్మమునకు మార్పులు తగు విధముగ జరుపుకొనుట సమ్మతమే. తగు విధముగ అనగ అనుకూలముగ అని కాదు. శాస్త్రాను సారముగ అని తెలియవలెను. సత్యము మాత్రము ఎప్పుడును ఒకటియే. ఒకటిగనే యుండును. దానికి మార్పు లుండవు.**

దశరథుడు సత్యవాక్పరిపాలనము గావించుచు ధర్మము నాచరించెడి చక్రవర్తి. కాని రామ పట్టాభిషేక విషయమున రామునిపై గల ఆత్మీయభావనను బట్టి సత్యమును కూడ మలచుటకు ప్రయత్నించుట వలన భంగపడెను. రాముడు సత్యమే అగుటవలన దశరథుని సత్యమున నిలబెట్టి ఊర్ధ్వగతికి పాత్రుని జేసెను.

సత్యమును వీడి ధర్మమును పాలించుట కొరకై దశరథుడు ప్రయత్నించెను. రామునికి యువరాజ్య పట్టాభిషేకము గావించుట ధర్మము. రాముని మించిన రాజు ఎవరు? త్రికాలము లందు కూడ ఎవ్వరును రాముని మించిన రాజు కాలేరు. సమానులు కూడ కాలేరు. అతడు అంతటి సత్యపరాక్రముడు. రాముని రాజును చేతునని దశరథుడు పలికినపుడు రాజసభలోని వారందరు హర్షపులకాంకితు లైరి. అయోధ్యా రాజ్యమంతయు ఆనందించినది. రాముడు జ్యేష్ఠ కుమారుడు. అనర్హత ఏమైన ఉన్నచో కేవలమది కారణముగ రాజ్యార్హత నుండి తప్పించ వచ్చును. ధృతరాష్ట్రుని అట్లే తప్పించి, పాండురాజునకు రాజ్య మొసగబడినది. ధృతరాష్ట్రుడు గ్రుడ్డి వాడగుటయే అతని అనర్హత. రాముని కనర్హత లేనపుడు, అర్హత పుష్కలముగ నున్నపుడు అతడికి రాజ్య మొసంగకుండుట అధర్మము.

భరతునకొసగుట కూడ అధర్మమే యగును. కావున ధర్మచింతనతో, ధర్మబద్ధుడై దశరథుడు అమితానందముతో ధర్మము నాచరించుట కుపక్రమించెను.

కాని సత్యము నెవరును వీడరాదు. కైకేయిదేవి జాతకమున ఆమె పతి చక్రవర్తి యగుటకు వలసిన సంకేతము లెన్నియో ఉన్నవి. తాను చక్రవర్తి యగుటకు దశరథుడు కైకేయిని వివాహ మాడెను. అప్పటికే దశరథునికి కౌసల్య, సుమిత్రలు భార్యలుగ నుండిరి. అందువలన కైకేయిని వివాహ మాడునపుడు, కైకేయి కుమారునకే రాజ్యమిత్తునని ప్రతిజ్ఞ చేసినాడు. కేకయ మహారాజుకు దశరథుడు చేసిన ప్రతిజ్ఞ గుర్తున్నది. రాముని రాజును చేయవలెనన్న ధర్మమును పాటించుటకు దశరథుడు కైకేయిని, ఆమె కుమారుడగు భరతుని సంప్రదించి తన మనోరథము తెలిపి, వారి సమ్మతిని పొంది రామునికి పట్టాభిషేకము చేసినచో బాగుండెడిది. అపుడు సత్యమును, ధర్మమును పాలించినవాడగును.

కాని దశరథుడు జంకినాడు. కైకేయి, భరతులను సంప్ర దించినచో వారు కాదందురేమో అని భయపడినాడు. సత్యమును ప్రక్కకు నెట్టి ధర్మము నాశ్రయించినాడు. ప్రజల అభిమతమును బలముగ నెంచి మంత్రులను, పురోహితులను, సామంతులను, ప్రజా ప్రతినిధులను పిలచి రామ పట్టాభిషేక నిర్ణయమును తెలిపినాడు.

భరతుడు నగరమున లేడు. నగరములో నున్న తన ప్రియతమ భార్యయగు కైకేయికి తెలుపలేదు. కారణము మనసులోని సంకోచమే. కైకేయి, భరతులను ఒకమారుగ తనవద్దకు పిలచి మాటాడినచో మార్గము సుగమ మయ్యెడిది. భరతుడు అతని తాతగారింటిలో

ఉండగనే పట్టాభిషేకము జరుగవలెనని కోరుట అసమంజసము. నలుగురు కుమారులలో ఒక కుమారుడు దూర ప్రాంతమున నున్నపుడు మరియొక కుమారునకు పట్టాభిషేకము చేయవలసిన అవసర మేమున్నది? అట్టి అత్యవసర మేమియు లేదు.

ప్రజల అభిమతమును ఆధారముగ చేసుకొని తానాడిన మాటను ధర్మము పేరున ప్రక్కకు నెట్టుటకు సిద్ధపడినాడు. కేకయ మహారాజునకుగాని, జనక మహారాజునకు గాని కబురు కూడ పంప లేదు. సత్యవాక్యము పాలించుట సాగదని, ధర్మము నాశ్రయించి, సత్యమును ప్రక్కకు తొలగించుట జరిగినది. అందులకే ఆ సందర్భ మున రాముని పట్టాభిషేకము కాలేదు. విడదీయరాని సత్య - ధర్మములను విడదీయవలెనని, ధర్మముచే సత్యమును త్రోసిపుచ్చ వలెనని ప్రయత్నించుట అనర్థమునకు దారితీసినది.

# 44. సత్యపరాక్రమము

**శ్లో॥ సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః ।**
**గురూన్ శుశ్రూషయా వీరో ధనుషాయుధి శాత్రవాన్ ॥**

రాముడు సత్యముచే సర్వలోకములను గెలిచెను. దానముచే దీనులను వశపరచుకొనెను. శుశ్రూషచే గురువులను, పెద్దలను ఆకర్షించెను. వీరుడై ధనుస్సుచే శత్రువులను జయించెను.

రామునుద్దేశించి ఈ శ్లోకము చెప్పబడినది. రాముని గుణములను క్లుప్తముగ, పూర్ణముగ వివరించు శ్లోకమిది. రాముడు సత్యసంధుడు. సత్యము నాచరించుట వలన సర్వలోకములు అతనికి వశమైనవి. సత్యము నాచరించు వారి అందరి విషయమునను ఈ ధర్మమే వర్తించును. సత్యమును వీడక, తా నాచరింపవలసిన ధర్మము నాచరించుచు ప్రవర్తించినచో అంతయు తన వశమున ఉండగలదు. **సత్యవంతునకు సత్యాచరణమే తపస్సు, యజ్ఞము.** శ్రీరాముడు జటాయువునకు దహన సంస్కారముచేసి "వెనుకకు మరలిరాని ఉత్తమ లోకములకు చనుము" అని పలికెను. తత్కారణముగ జటాయువు కూడ దశరథుడేగిన లోకమును చేరెను.

శ్రీరాముడు మానవుడుగనే ఈ కార్య మొనర్చెను. సత్యవాక్కును పరిపాలించు మానవునకు అట్టి సామర్థ్యము కలుగ గలదని రామాయణము బోధించుచున్నది. సత్యముచేతనే ఊర్ధ్వలోకములు

వశము కాగలవు. శ్రీరాముడు సత్యముచే అన్ని లోకములను వశపరచుకొని యుండుట చేత, ఆ లోకములకు ఏగుమని జటాయువును నిర్దేశించెను.

శ్రీరాముడు సత్యదర్శనుడు. సత్యసంధుడు. సత్యవాక్య పాలకుడు. కనిపించు ప్రతి వస్తువులో ప్రకృతిని, దాని గుణరూప సౌందర్యమును మాత్రమే చూచుటగాక అంతర్యామిగ నున్న పరమాత్మను దర్శించి భేద భావము లేక మెలగుటయే సత్యదర్శన మునకు నిదర్శనము. సర్వజీవుల మూలము సత్యమే. సత్యమునకు లొంగనిది లేదు. అన్నియు సత్యము నుండే వెలువడినవి. సత్యము నుండే చైతన్యము, త్రిశక్తులు, పంచభూతములు ఏర్పడినవి. సర్వదేవతలు చైతన్యము నుండి దిగివచ్చినవారే. జీవులందరును కూడ అట్టివారే. వారికి మూడు గుణములు, ఐదు భూతములుగ ఎనిమిది ఆవరణలు ఏర్పడును. చైతన్యవంతులుగ వారు తొమ్మిదవ వారు. వారికి మూలము సత్యమై యున్నది. మూలము దర్శించు రాముడు సత్యమును సంధించు నటువంటివాడు. కనుక సత్యసంధుడు.

# 45. కల్యాణ గుణములు

**శ్లో॥ సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః ।**
**గురూన్ శుశ్రూషయా వీరో ధనుషాయుధి శాత్రవాన్ ॥**

సత్యము వలన లోకము లెట్లు వశమగునో దానము వలన దీనులు వశ మగుదురు. దీనులు వశమగుటకు దానమే ప్రధానము. దానము కారణముగ దీనులు స్వచ్ఛందముగ దాసు లగుదురు. దీనుల ఎడ దయ గలిగినవాడు దానము చేయుచు వారి అభిమానమును, గౌరవమును పొందగలడు. సుఖము కలుగుటకు దానమే ప్రధానమగు లక్షణమని పురాణములు తెలియజెప్పుచున్నవి. దయతో దానము చేయుట వలన పరులు సుఖింతురు. దానము చేయువాడు సుఖము ననుభవించుటచే సుఖమును పొందుచున్నాడు. దీనుల నందరిని రాముడు దానము చేత వశపరచుకొనెను.

**పెద్దలను, గురువులను సుముఖులుగ చేసుకొనుటకు శుశ్రూష ప్రధానము. అనగా వారికి సేవ చేయుట ప్రధానము.** శ్రీరాముడు తాను సుక్షత్రియుడనని అభిమానపడక పెద్దలను, గురువులను త్రికరణశుద్ధిగ సేవించెను. క్షత్రియులకు అభిమానము పాలెక్కువ. వారు శుశ్రూషలను పొందుటయేగాని చేయుట అంతగ జరుగదు. సేవా భావము కలిగియుండుట వినయమును సూచించును. నిరహంకారమును సూచించును. అహంకారము

గలవారు వంగి నమస్కారము చేయలేరు. సాష్టాంగ ప్రణామము చేయలేరు. నమస్కరించుట యందు గూడ వినయ మంతంత మాత్రముగనే యుండును. అట్టివారియందు గురువులు, పెద్దలు సంతుష్టి పొందలేరు. సుముఖులుగను ఉన్ముఖులుగను ఉండలేరు.

శ్రీరాముడు విద్యాభ్యాస సమయమున తోటి విద్యార్థులతో సహవసించి యుండెను. వారితో సరిసమానముగ ప్రవర్తించెను. వారికంటె తాను గొప్పవాడనని, చక్రవర్తి కుమారుడనని పూర్తిగ మరచి ప్రవర్తించెను. వశిష్ఠాది సద్గురువులను శరీర శ్రమకోర్చి సేవించెను. అట్లే విశ్వామిత్రుని తన వినయముచే సంతసింపజేసెను. వనవాసమున సమస్త ఋషులను సేవించి వారి ఆనుకూల్యమును పొందెను. శుశ్రూషతో మాత్రమే గురువుల ఆశీర్వచనము పొందుటకు వీలగును. ఎందరో ఋషీంద్రుల ఆనుకూల్యతను సంపాదించిన శ్రీరాముడు శుశ్రూషలో దిట్ట. ఋషులందరును రామునియందు దైవమును చూచు చున్నప్పటికిని శ్రీరాముడు తనను మానవుడుగనే భావించుచు ఋషులను సేవించెను. ఇట్లందరును చేయలేరు.

అట్లే శ్రీరాముడు ధనుస్సుతో శత్రువులను జయించిన వీరుడు. రాము డెల్లపుడును ధనుర్ధరుడే. ధను వనగా ప్రణవమని రహ స్యార్థము. రాముడు ఎల్లప్పుడును ప్రణవమును ధరించి యుండును. ప్రణవ మున్నచోట శత్రువులగు రాక్షసు లుండలేరు. దేవతా సమూహములు ప్రణవమును ఆశ్రయించి యుండును. రాముడు ప్రణవధారి గనుక సర్వదేవతాశక్తులు అతని నాశ్రయించి యుండుట, శత్రువులైన రాక్షస శక్తులు నిర్జింపబడుట యుండును.

రాముని సత్యనిరతి, దానగుణము, గురు శుశ్రూష, ప్రణవ ధారణము అతని లోకోత్తర స్థితికి నిదర్శనములు. మానవులకు ఈ గుణము లాచరణీయములు. రాముడు భూమిపై మానవుడుగనే వర్తించెనుగాని అతీతశక్తులను ప్రదర్శింపలేదు. మానవమాత్రుడుగనే సర్వమును పై తెలిపిన నాలుగు గుణములచే జయించవచ్చునని రామాయణము బోధించుచున్నది.

# 46. సత్యము-ప్రణవము-ధర్మము-వేదము

**శ్లో॥ సత్యేమేక పదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః ।**
**సత్యమే వాక్షయా వేదాః సత్యైనెవాప్యతే పరం ॥ (1-14-7)**

సత్యమే మానవుడు పొందవలసిన ప్రధానమగు తత్త్వము. "బ్రహ్మము" అను పదము సత్యమునకుగల మరియొక పేరు. సత్యమనగ కేవలము భాషణయందు సత్యము అని కాదు. దేని మూలమున చైతన్యము అష్టప్రకృతులతో సృష్టి నిర్మాణము, జీవుల నిర్మాణము కావించు చున్నదో అది సత్యము. అది ఎప్పుడునూ ఉండునది. అందుండి చైతన్యము, చైతన్యము నుండి అష్ట ప్రకృతులు దాని ఆవరణలుగ ఏర్పడి నామరూపాత్మకమైన జగత్తుగ గోచరించును. నవావరణములకు అదియే మూలము. కావున దానిని పూర్ణమని పలికిరి. నవావరణములు అందుండియే ఉద్భవించి వృద్ధి చెంది మరల దానియందే లయ మగును. నవావరణముల యందును సత్యమే మూలము. సత్యమునకు ఆధారము సత్యమే గాని మరియొకటి కాదు.

ఇట్టి సత్యము మానవునియందు కూడ ఉండుటచే మానవుడు "తా నున్నాను" అని అనుకొనుచున్నాడు. అట్లనుకొనుటకు అతని చైతన్య మాధారము. అతడు అహంకారాది అష్ట ప్రకృతులతో యుండును. అవి వరుసగ అహంకారము, బుద్ధి, చిత్తము, పంచేంద్రియములు. పంచేంద్రియముల చుట్టును పంచభూతములును

చేరును. పంచప్రాణములు, పంచతన్మాత్రలు కూడ చేరును. పంచార మగు శరీరమున త్రిగుణములతో కూడి జీవుడుండును. అహంకారము, బుద్ధి, చిత్తము, అంతఃకరణముల ద్వారా మనస్సు ఆధారముగ పంచారమగు శరీరమున వర్తించువాడు జీవుడు. మానవుడు సహజముగ సత్‌చిత్ స్వరూపుడు. అతడు త్రిగుణములను పంచభూతముల ఆధారముగ అష్టప్రకృతులలో వసించి యుండును. వానికి వశమై జీవించు చుండును. అతడును బ్రహ్మమువలె తొమ్మిది అంశములతో కూడియున్నవాడు. అతడు సహజమగు బ్రహ్మము. కాని సత్యము నుండి, చైతన్యము నుండి అవస్థితి చెంది అహంకార ప్రజ్ఞగ తా నొకడను ఉన్నాననుకొని జీవించు చుండును. బ్రహ్మమే తానుగ నున్నాడని మరచును.

ఇట్టి సత్యమును తెలుపునది, సత్యమునకు దారి చూపునది ఏకాక్షర పదమగు ఓంకారము. కావున ఓంకారము కూడ సత్యమే. కావున సత్యమును చేరుటకు సత్యస్థితి తెలియుటకు, సత్యమై నిలచుటకు ఓంకారము నుచ్చరించి, వినుట మార్గమై నిలచినది. ఓంకారము నుచ్చరించుచు క్రమముగ పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, త్రిగుణములు అగు ఎనిమిది ఆవరణలను దాటి తాను తొమ్మిదవ వాడగు చైతన్యమై నిలువ వచ్చును. అట్లే ఓంకారము నుచ్చరించుచు చైతన్యమగు తాను అనంతమైన సత్యమున కలసితినని భావించవలెను. అనంతమైన సత్యమే తానుగ స్థితి గొనవలెను. అట్టి స్థితియందు తాను సత్‌చిత్ స్వరూపుడుగ సంప్రజ్ఞాత సమాధి యందుండును. అపుడపుడు తా నున్నానను మెరమెర కూడ అదృశ్యమై కేవలము సత్యమే మిగులును. అట్టి సమాధిని అసంప్రజ్ఞాత

సమాధి అని యందురు. ఇట్లు మానవుడు మూలమును చేరగలడు. అదియే తనకు, సృష్టికిని మూలము.

ఇట్టి సత్యము ధర్మమునందు ప్రతిష్ఠితమై యున్నది. అట్టి ధర్మము వేదమునందు ప్రతిష్ఠితమై యున్నది. అందువలన వేదములు అక్షయములై నిలచినవి. **సత్యమును పాలించు వారికి వేద ధర్మము విశదమగును. అట్టివారు ప్రణవము నుచ్చరించుచు సత్యమును చేరుదురు.**

# 47. ప్రత్యక్ష దైవము

**శ్లో॥ యతో మూలం నరః పశే ।**

**"శరీర ముండుటకు కారణమైనవాడు తండ్రి. భగవంతుడు సృష్టించినాడని అందురుగాని అతడు ప్రత్యక్షముగ కనిపింపడు. ప్రత్యక్షముగ పోషింపడు, రక్షింపడు. సృష్టించునది, పోషించునది, రక్షించునది తండ్రియే."**

పై మాటలు పలికినది శ్రీరాముడు. ప్రత్యక్ష దైవములను పూజింపక, పరోక్ష దైవములను పూజించువారు అహంకారులు. దైవము స్వయముగ తానేమీ చేయడు. తల్లిదండ్రుల రూపమున, గురువుల రూపమున, రక్షణ పోషణ వృద్ధి కలిగించు చుండును. అందువలన తల్లి–తండ్రి– గురువు ప్రధానమగు దైవ స్వరూపములు. వీరిని కాదనువారికి దైవానుగ్రహము కలుగుట క్లిష్టము. తల్లి దండ్రులను, గురువులను, సాధు ఋషిగణములను, దేవతలను, గ్రహదేవతలను మన్నించుట, పూజించుట, భక్తితో నమస్కరించుట శ్రీరాముడు తన జీవితమున నెరపి చూపెను. అట్లే సర్వ జీవరాసుల యందు మైత్రీభావమును గరపెను. తండ్రి మాటకై సర్వమును త్యాగము చేసిన శ్రీరాముడు ఇహపరములు రెంటిని పొందినాడు. **తండ్రిని దూషించుట, తిరస్కరించుట, అగౌరవ పరచుట, తల్లిదండ్రుల కష్టములయందు పాలుపంచుకొనకుండుట, తమ స్వార్థము కొరకు**

**తల్లిదండ్రులను వినియోగించుకొనుట వంటి దుష్కృత్యములు ఆధునిక మానవులలో ఎక్కువగ గోచరించు చున్నవి.**

రామాయణము వంటి మహా గ్రంథములలోని ధర్మమును, నీతిని పాఠ్యాంశములలో నుండి తప్పించుట వలన విద్యాభ్యాసమున విలువైన విషయములు కరవైనవి. ఇట్టి సమయములో గృహస్తు లందరు స్వయముగ రామాయణమును పఠించి అందలి నీతి వాక్యములను, ధర్మ సందేశములను, శాశ్వత సత్యములను తెలియుట శ్రేయస్కరము.

# 48. రాముని లోదృష్టి

**శ్లో॥ గురోరప్యవ లిప్తస్య కార్య కార్య మ జానతః ।**
**ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనం ॥**

**"వయసున పెద్దవారైనను, చేయదగనిది, చేయదగినది తెలియక తప్పుదారి పట్టినపుడు శిక్షించవలెనని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి."**

పై ధర్మమును లక్ష్మణుడు శ్రీరామునకు గుర్తు చేసెను. దశరథుడు చేయుచున్న పని తప్పు అని, ధర్మసమ్మతము కాదని, కావున దశరథుని మాటను లక్ష్య పెట్టరాదని రామునికి లక్ష్మణుడు సూచించెను. శ్రీరాముడు దశరథునియందు తన తండ్రిని గుర్తించెను. చక్రవర్తిగ కూడ గుర్తించెను. చక్రవర్తిగ దశరథుడు రామ పట్టాభిషేక మును నిర్ణయించెను. అది ధర్మము. అట్లు చేయనిచో దశరథుడు చక్రవర్తిగ అధర్మమును పాటించిన వాడగును. అర్హునకు రాజ్యము నందించుట రాజు కర్తవ్యము. రామునియందు గల అర్హతలు మరి ఎవ్వని యందును లేవు. ఎవ్వరును అతనితో సరిసమానము కాదు. రాజుగనే కాదు; మానవుడుగ కూడ రామునితో సమాన మగువారు రామునికి ముందెపుడునూ లేరు. రామునితో సమకాలికులైన మానవులు కూడ రామునితో ఎవ్వరును సమానులు కారు. అప్పటికి, యిప్పటికి, ఎప్పటికిని కూడ రామునితో సమానమగు మానవు డుండడు. రామునివంటి రాజు కూడ ఉండడు. అట్టి రామునికి

పట్టాభిషేకము చేయు నిర్ణయము అందరికిని హర్షము కలిగించును. దశరథుడు ఆ విధముగ చక్రవర్తిగ తన బాధ్యతను అద్భుతముగ నిర్వర్తించినాడు.

చక్రవర్తిత్వము ఒక బాధ్యత. దశరథుడు మొదటగ నరుడు. మానవుడు. సత్యవాక్పాలనము గావించుచు, పరాక్రముడై చక్రవర్తి అయ్యెను. తాను పలికిన పలుకు నిర్వర్తింపనిచో అది తనని బంధించుట తథ్యము. కైకేయిదేవికి వరము నిత్తునని పలుకుట తానిచ్చిన మాటయే. తన మాటలు బట్టియే కైకేయి వరములు కోరినది. తానిచ్చిన మాట, రాజుగ తాను నిర్వర్తింపవలసిన ధర్మము రెంటికి నడుమ ఘర్షణము కలిగినది. ఇట్లు సత్యధర్మముల మధ్య ఘర్షణ మేర్పడినది. కావుననే దశరథు డవశుడై నేలకొరగినాడు.

రాముడు దశరథుని యందు జరుగుచున్న ఘర్షణను గుర్తించి నాడు. దశరథుడు తెలిపిన ఘర్షణమును రాముడు తెలుసుకొనినాడు. పదునైన రాముని బుద్ధి చురుకుగ పనిచేసినదే కాని రాముని మనసులో శోకము కలుగలేదు. వెంటనే కృతనిశ్చయుడైనాడు. దృఢవ్రతుడై నిలచినాడు. దశరథుడు ప్రప్రథమముగ తనకు తండ్రి. తరువాతి సంబంధము చక్రవర్తి. చక్రవర్తిగ దశరథుడు తాను చేసిన నిర్ణయ మందలి మార్పును ఎరిగింపలేదు. అతడి మాటగ కైకేయి పలికినది. తండ్రిగ అతడు సత్యమునందు నిలచుటకు గాని, నిలువకుండుటకు గాని రాముడు చేయు నిర్ణయము ప్రధానమై నిలచినది. రాముడు రాజ్యమునే కోరి కైకేయి వరములను అనుసరింపనిచో దశరథుని ఉ త్తరగతు లెట్లుండును? దశరథుడు పతనము చెందును. ఊర్ధ్వము, ఉత్తమము అగు లోకముల కేగుటకు అనర్హు డగును. తాను వరము

లకు సమ్మతించి అనుసరించినచో దశరథుని మాట సత్యమై నిలచును. తాను లేనిచో రాజ్యము చెడదు. భరతుడు సకల సుగుణ సంపన్నుడు. శౌర్యపరాక్రముడు. దివ్యమగు చక్రములు కలవాడు. అతడు రాజ్యమేలునపుడు, రాజ్యము సుభిక్షముగనే యుండగలదు. అతడు రాజైనచో రాజధర్మము చెడదు. తాను రాజైనచో దశరథుని సత్య వ్రతము చెడును. కుమారునిగ తన బాధ్యత నిర్వర్తించుట వలన దశరథునికి ఉత్తమగతులు తప్పక కలుగును. రాజ్యము సుభిక్షముగ నుండుటకు, దశరథుడు ఉత్తమ గతులు పొందుటకు తాను రాజ్యమును వీడి వనవాసమున కేగుటయే పరిష్కారము. రాముడట్టి పరిష్కారము నిచ్చినాడు.

# 49. ధర్మార్థ కామములు

అసత్య దోషమునుండి దశరథుని కాపాడుకొనుటయే రాముడు తన కర్తవ్యముగ భావించినాడు. రామునికి దశరథుడు తండ్రి. తన మేలు కోరువాడు. దేశమునకు రాజు. పెద్దవాడు. పై నాలుగు కారణములుగ దశరథుని సంరక్షించు కొనుటయే ప్రధాన మని, రాజ్యాధికార మప్రధానమని రాముడు భావించినాడు. ధర్మమే ప్రధానముగ ఋషివలె యుండుటయే తన మనోభీష్టమని, ఎల్లప్పుడు ధర్మమునందే స్థితి గొందునని భావించినాడు శ్రీరాముడు. రాజ్యమతని హస్తగత మగుటకు వేచియున్నను, రాముని మనసున రాజ్యము కన్న తండ్రియే ప్రధానమని నిలచింది.

రాముడు రెండు మాటల వాడు కాదు. ధర్మభంగ మగునని దశరథుడు రామునికి, కైకేయి అడిగిన వరములు తెలుపలేదు. కైకేయి తెలుపగ, ధర్మము సత్యము చెడకుండ రాముడు నిరుపమానమైన నిర్ణయమును క్షణకాలములో పాటించినాడు. సత్యధర్మముల ఘర్షణములో పడిన దశరథునికి శ్రీరాముడే పరిష్కారమై నిలచినాడు. శ్రీరాముడు ధర్మము ననుసరించి సత్యమును నిలబెట్టినాడు. రాజ్యానుభవము ఈ జీవితమునకే పరిమితము. ధర్మానుభవము శాశ్వతమై నిలచును.

తండ్రిమాటను పాటించుటకు పూర్వము కండు మహర్షి గోవును చంపినాడు. తండ్రి ఆజ్ఞను పాలించుటకు పరశురాముడు

స్వయముగ గండ్ర గొడ్డలితో తల్లియగు రేణుకకు శిరచ్ఛేదము గావించినాడు. తండ్రియే ప్రత్యక్ష దైవమని, తండ్రిమాట దైవము మాటేయని భావించి, స్వలాభం, స్వకీర్తి, స్వసుఖమును భావింపక క్షణకాలములో రాముడు వనవాస దీక్ష కుపక్రమించినాడు.

**వేద సంప్రదాయమున తండ్రికి యిటువంటి స్థానము కలదు. ప్రస్తుత కాలమున ఉత్తరగతులను గూర్చి గాని, రాబోవు జన్మ పరంపరలు గూర్చిగాని భావనయే కరువగుటచే స్వసౌఖ్యము కొరకు తలిదండ్రులను విస్మరించుట, అనుచితముగ వినియోగించుకొనుట జరుగుచున్నది. ప్రతి మానవుడు తానీ జన్మమునందు ఆడిన మాట, జరిపిన చేతల ప్రభావము ముందు జన్మలలో వెంటాడునని, అవియే సుఖ దుఃఖములకు కారణమగునని భావింపనైనను జరుగుట లేదు. ఏ కర్మ ఆచరించినచో ధర్మము, అర్థము, కామము కూడ సిద్ధించునో దానినే ఆచరింపవలెను. అర్థకామములతో సంబంధము లేక ధర్మము నాచరించవలెను. రాముడట్లు చేసెను.**

# 50. పితృసేవ - సూక్తము

సత్యము పలుకుట కంటె, దానము చేయుటకంటె, పెద్దలను, ఋషులను, దేవతలను పూజించుటకంటె పితృసేవ గొప్పది.

తగిన దక్షిణ లిచ్చి ఎన్ని యజ్ఞములు చేసినను పితృసేవతో సమానములు కావు.

పరలోకమందు అభ్యుదయము కలిగింప గలుగు బలము యివ్వగలిగినది పితృసేవ. సత్యము, దానము, యజ్ఞము అంతటి పరలోక సౌఖ్యము కలిగింప లేవు.

మానవులు లోకమున తమతమ ధర్మములచే, తపస్సుచే, యాగముచే, దానములచే మూడు లోకములను పొందవలెనని ప్రయత్నించుచుందురు. కాని తల్లి - తండ్రి - గురువు అనెడివారే మనము పొంద దగిన మూడు లోకములు. వారితో సమానమగు పవిత్రముగల వస్తువు లోకమున వేరొకటి లేదు.

**తల్లి– తండ్రి– గురువు ప్రత్యక్ష దైవములు. భగవానుడు పరోక్ష దైవము. మనచే ఆరాధింపబడి, సేవలను పొంది ఆనందించు తల్లి– తండ్రి– గురువులను వదలి, కనపడని దైవము నారాధించుట తగని పని.**

# 51. కారణము - దైవము

పట్టుటకు దొరకని దైవముతో పోరాడుటకు సిద్ధమగుట అవివేకము. **దైవము కంటికి కనపడునది కాదు. కలిగిన ఫలములచే దాని నూహించవలెనే కాని, అది ఎట్లుండునో ఎవరికిని తెలియదు.** ప్రయత్నమెప్పుడు ఒక్క విధముగనే యున్నను మానవులకు ఒకప్పుడు సుఖము కలుగును. ఒకప్పుడు దుఃఖము కలుగును. ఒకప్పుడు భయము కలుగును. ఒకానొకప్పుడు క్రోధము కలుగును. అట్లే లాభము, నష్టము కూడ వచ్చును. ప్రయత్నము ఏక రూపముగ నున్నను ఫలములో భేదములు కలుగుటకు కారణమేదో తెలుసు కొనుటకు శక్యము కాదు. అట్టి దానిని దైవ మనుకొనుట తప్పదు.

కాలము ననుసరించి ఫల మందింపబడు చున్నది. కాల ప్రభావమే దైవ ప్రభావము. "నే నరణ్యమున కేగుటకు కైకేయి కారణము కాదు. మంధర కానే కాదు. తండ్రి గారి ప్రతిజ్ఞ కూడ కారణము కాదు. దైవమే కారణము" అని రాముడు పలికినాడు.

కావుననే రాముడు దైవము ననుసరించినాడు. దశరథుడు, కైకేయి కారణమని భావింపలేదు.

# 52. దైవము

సామాన్య మానవుల విషయమున మాత్రమేకాక మహాత్ముల పైన కూడ దైవము ప్రభావము చూపును. తీవ్రమగు తపస్సు చేయు ఋషులు కూడ కోరికచేత, కోపముచేత, తాము నిత్యము పాటించు నియమములను మరచి ప్రవర్తింతురు.

ఒక విధమగు ఫలము కోరి, నిర్దిష్టమగు ప్రయత్నమును పట్టుదలతో చేయుచున్నను హఠాత్తుగ ఆ ప్రయత్న మాగును. అనుకొనిన ఫలముకంటె విరుద్ధమగు ఫలము సంభవించు చుండును. అదియే దైవము చేయు పని. ఇది తెలియనివారు మనుష్యులపై కోపగింతురు. మనుష్యులను ద్వేషింతురు. పగ కూడ ఏర్పడును. ఇది యంతయు అవివేకము. దైవనిర్ణయముగ భావించి కర్తవ్యము ననుసరించుటయే మార్గము. శ్రీరాము డట్లు కర్తవ్యమునే నిర్వర్తించెను గాని, విపత్కర సన్నివేశములలో ఎవ్వరిని దూషింపలేదు. అతడు రాజ్య పాలనమును, వనవాసమును సమానముగ భావించినాడు. పట్టాభిషేకమునకు సిద్ధపడిన తాను అరణ్యమున కేగుట అవమానమని భావింపలేదు. ఆ ఘటన యందతని దోషమేమియు లేదు గనుక ఉపేక్షించెను. లక్ష్మణుని గూడ తన ననుసరించవలెనని హితవు పలికెను.

**అసంకల్పితమగు అకస్మాత్ ఘటన దైవమే అన్నది సూక్తము. దాని ననుసరించుటయే గాని విచికిత్స పనికిరాదు.**

# 53. మాతృ ఆశీర్వచనము

ప్రయాణము చేయు సంతానమునకు తల్లులు అందించ వలసిన ఆశీర్వచన మెట్లుండవలెనో రామాయణము తెలుపుచున్నది. కౌసల్యాదేవి వనవాసమునకు సిద్ధమైన రాముని ఆశీర్వదించి పంపునపుడు ఈ క్రింది విధముగ పలికినది.

**1 శ్లో. యన్మంగళం సహస్రాక్షే సర్వదేవ నమస్కృతే ।**
**వృత్రనాశే సమ భవత్తత్తే భవతు మంగళమ్ ॥**

**2 శ్లో. యన్మంగళం సుపర్ణస్య వినతా కల్పయత్ పురా ।**
**అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్ ॥**

**3 శ్లో. అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్ ।**
**అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్ ॥**

**4 శ్లో. త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమిత తేజసః ।**
**యధాసీన్మంగళం రామ త్తతే భవతు మంగళమ్ ॥**

**5 శ్లో. ఋతవస్సాగరా ద్వీపాః వేదాలోకా దిశశ్చతే ।**
**మంగళాని మహాబాహో దిశంతు శుభమంగళమ్ ॥**

1. సర్వదేవతలచేత నమస్కరింపబడు ఇంద్రుడు వృత్రాసుర సంహారమునకు చనుచున్నపుడు ఏ మంగళము లభించినదో అట్టి మంగళము నీకు లభించుగాక!

2. తల్లి దాస్యవిముక్తికై అమృతమును తెచ్చుటకు గరుత్మంతుడు ప్రయాణమగు సందర్భమున, పూర్వము వినతాదేవి ఏ మంగళమును అనుగ్రహించినదో ఆ మంగళము నీకు కలుగుగాక!

3. ఇంద్రుడు రాక్షస సంహారమునకు పూనుకొను సందర్భ మున అదితి ఏ మంగళమును ప్రార్థించెనో ఆ మంగళము నీకు కలుగు గాక!

4. అమిత తేజశ్శాలియగు విష్ణువు మూడడుగులలో లోకము లను కొలిచినపుడు ఏ మంగళము సంభవించెనో ఆ మంగళము నీకు కలుగుగాక!

5. ఋతువులు, సముద్రములు, ద్వీపములు, వేదములు, లోకములు, దిక్కులు అన్నియు నీకు శుభ మంగళమును ప్రసాదించు గాక!

పై విధముగ భావన చేసి తల్లులు శిరస్సుపై అక్షతలు చల్లి, గంధము పూయుట సర్వ శుభంకరము. అంతేకాని, దూరదేశమున కేగుచున్నాడన్న బాధతో కంట తడిపెట్టరాదు. మనసున దుఃఖము బాధించుచున్నను, సంతానమునకు మంగళము కలుగవలెనని సంతోషముతో ఉన్నట్లే కనపడవలెను.

పై ఆశీర్వచనమున అదితిదేవి, వినతాదేవి, మహావిష్ణువు, ఋతువులు, సముద్రములు, వేదములు, లోకములు, దిక్కులు మంగళముల నిచ్చునవిగ భావించుట ప్రధానముగ సూచింపబడినవి. శుభములను కోరువారు పై తెలిపిన స్థానములనుండి మంగళములను ఆకాంక్షించవలెను.

# 54. స్త్రీ స్వేచ్ఛ

రామాయణ మందు రాముడు స్త్రీ స్వేచ్ఛను ప్రకటితము కావించిన ధర్మస్వరూపుడు. స్వేచ్ఛగనే వివాహితయగు స్త్రీ, భర్తను అనుసరించవలెనని రాముని విశ్వాసము. సీతమ్మవారు తానుగ ఇష్టపడియె రాముని వివాహమాడెను. శ్రీరాముడు తన ధర్మపత్నిని తనతో సమానముగ ఆదరించెనేగాని, ఎన్నడూ శాసించలేదు. ఆమెను ఎన్నడూ నిర్బంధము చేయలేదు.

లోకమున సాధారణముగ భార్య తనకు విధేయురాలిగ ఉండ వలెనని భర్త ఆశించును. అట్లాశించుట అవివేకము. నిర్బంధించుట అజ్ఞానము. ఆమె కర్తవ్యమున ఆమెకు స్వేచ్ఛ యుండవలెను.

లోకములో స్త్రీలు భర్తను ప్రేమించినను కష్టములు ఓర్వజాలక ధర్మము నతిక్రమించ వచ్చును. స్వభావమున ధర్మాచరణమునకు కొద్దిగ తగ్గుట ఉండవచ్చును. అట్టివారిని నిర్బంధించుటకు భర్తల కధికారము లేదు. ఇది తెలియజెప్పుటకే శ్రీరాముడు ధర్మాచరణమున తాను వనవాసమునకు వెళ్ళుట తప్పనిసరి యని, తన నిశ్చయము సీతామాతకు తోచునట్లు తెలియచెప్పెనే గాని, తనను అనుసరించి వనవాసమునకు వచ్చుట సీతామాత కర్తవ్యమని పలుకలేదు. శ్రీరాముడు పరిపూర్ణ సౌజన్యమూర్తి యగుటచే సీతామాతకు ఎప్పటి కప్పుడు స్వేచ్ఛ ఒసగినాడు. అతని యనురాగము సీతామాతకు మాత్రమే తెలియును.

భర్త లీ విధముగ ఉన్నపుడు యిసుమంత వివేకము గల స్త్రీలు తమ కర్తవ్యమును తెలుసుకొని అనుసరింతురు. ఇది సంస్కారము. **బాధ్యత లెరిగిన చోట సంస్కార ముండును. హక్కు లెరిగినచోట సంస్కార ముండదు.**

# 55. శరీరము - ఆత్మ - పరమాత్మ

జీవునకు పరమాత్మతోగల సంబంధము, శరీరమునకు ఆత్మకు గల సంబంధము వంటిది. శరీరము ఆత్మపైనే ఆధారపడి యున్నది. ఆత్మ ఎట్లు సంకల్పించిన అట్లు ప్రవర్తించు చుండును. తాను చేసిన ప్రతి వ్యాపారము వలన లోనున్న ఆత్మకే ప్రీతి కలుగును. ఇట్లు ఆత్మకొరకే ప్రవర్తించుచు, దానివలననే నిలచి, దానితోనే విడువక యుండెడిది శరీరము.

జీవుడు కూడ అట్టివాడే. తాను చేయు సర్వవ్యాపారములు పరమాత్మ ప్రీతికే అని తెలిసి చేయుట జీవాత్మ కర్తవ్యమై యున్నది. పరమాత్మ ప్రీతికొరకే ప్రవర్తించుచు, దానితోనే విడువక ఉండుట ఆత్మధర్మము. పరమాత్మ సంకల్పమే తన సంకల్పముగ ప్రవర్తించుచు నుండుట సమంజసము. ఆత్మలేని శరీరమెట్లు లేదో, పరమాత్మ లేని జీవాత్మ లేదు.

ఇది తెలియక మనము అజ్ఞానముచే మన జీవితము మన కొరకే అని భావించుచు పనులు చేసుకొను చున్నాము. ఈ స్వార్థ చింతనే ఆత్మకు బంధము నేర్పరచును. తాను చేయు సర్వవ్యాపారములు పరమాత్మకొరకే అని గుర్తించుట ద్వారా తనను తానెరుగుట జరుగును.

పై విధమగు జ్ఞానము కలవాడగుటచే లక్ష్మణుడు వనవాసము చనుచున్న రాముని ఆశ్రయించి, అతనితో చనినాడు. శ్రీరాముని వీడక యుండినాడు. అతనిని పూర్ణముగ ఆశ్రయించినాడు. తాను స్వతంత్రుడనను భావనను పరిత్యజించి, పరుడగు రామునికి దాసుడైనాడు. పరతంత్రుడైనాడు. పరమాత్మయే ఉపాయమని, అట్లు రాము ననుసరించినాడు. ఇట్టివాడే మోక్ష ధర్మమున నిలువగలడు.

# 56. లక్ష్మణుని కోరిక

**శ్లో ॥ కురుష్వమాం అనుచరం వైధర్మ్యం స్నేహవిద్యతే ।**
**కృతార్థోహం భవిష్యామి తవచార్థః ప్రకల్పతే॥ (22-31-2)**

"నన్ను నీ అనుచరునిగ నియమింపుము. దీనివలన ఏ విధమగు ధర్మవిరోధము కలుగదు. మిమ్మనుసరించుచు, మీ సేవ చేయుటచే నాకు కృతార్థత సంభవించును. నేను మీ కొరకే ఏర్పడి యున్నాను."

పై తెలిపిన మాటలు లక్ష్మణుని ముఖము నుండి వెలువడినవి. లక్ష్మణుడు రాముని కొరకే జన్మించినాడు. రాము ననుసరించుటయే తన కర్తవ్యముగ భావించినాడు. దానివలననే కృతార్థు డగుదునని నిశ్చయముగ తెలిపినాడు.

ఇందు జీవాత్మ పరమాత్మల అనుసంధానము మరియు గురుశిష్యుల సంబంధము పరిపూర్ణముగ ఆవిష్కరింపబడినది. ఒక వస్తువును దాని గుణముతో ఎట్లు వేరు చేయలేమో, అట్లే జీవుని పరమాత్మనుండి వేరుచేయ తగదు. వీలుపడదు కూడ. పరమాత్మ జీవాత్మల సంబంధ మట్టిది. వేర్పాటు భావము అజ్ఞానవశమున జీవున కేర్పడును. నిజమునకు బ్రహ్మమే జీవునిగ నున్నాడు. కాని జీవుడు తానొకడు వేరుగ నున్నటులు భావించును. నిజమున కతడు పరతంత్రుడు. కాని స్వతంత్రుడనని భావించును. సర్వకార్యములచే

పరమార్థమే నెరవేరును గాని స్వప్రయోజనము నెరవేరదని గుర్తింపడు. తన కొరకు తాను కర్మలు చేయు చున్నానని అనుకొనుచుండును. ఒక పండునకు రంగు రుచి ఎట్లుండునో, అట్లే పరమాత్మతో వేరు చేయుటకు వీలుకాక జీవుడు కలిసి ఉండును. రంగు రుచి పండు యొక్క వైభవము. పండు లేక రంగు రుచి లేవు గదా! ఉన్న వనుకొనుట భ్రమ, భ్రాంతి. అట్లే **పరమాత్మ లేని జీవాత్మ లేదు. పరమాత్మ వైభవమే జీవాత్మ.** రాముని వైభవమే లక్ష్మణుడు మరియు యితర అనుచరులు. **సద్గురువు వైభవమే అతని అనుయాయులు. అతని మహిమే వారియందు భాసించు చుండును.**

ఇట్టి జ్ఞానము లేక ప్రవర్తించువారు అల్పబుద్ధులు.

# 57. లక్ష్మణుని ప్రార్థన

**"మాం అనుచరం కురుష్వ"** అనునది ఉత్తమోత్తమమైన ప్రార్థన. "నిన్ననుసరించు వానిగ నన్ను చేసుకొనుము" అని దీని అర్థము. అనుచరు డనగ సర్వకాల సర్వావస్థల యందును కూడి యుండువాడు మరియు కలిసి చరించెడివాడు. ఇది లక్ష్మణుని ప్రార్థన. దైవముతో కూడి యుండుట, దైవముతో కలిసి చరించుట జీవుని కృతార్థుని చేయును. కనుక లక్ష్మణు డట్లు కోరినాడు. అతని కోరికలో యుక్తి కూడ యున్నది. "నీవే నన్నుచరునిగ చేసుకొను" మనుటలో దైవము అనుమతియే గాక, అనుగ్రహమును కూడ వేడుకొనుట యున్నది. దైవమే అట్టివానిని తీర్చిదిద్దును. జీవుడు సర్వ సంసిద్ధు డైనపుడు దైవము తప్పక తీర్చిదిద్దగలడు.

"నేను నీ అనుచరుడుగ నుందును" అని అనుకొనుట అహంకారము. దైవము ననుసరించు సమర్థత జీవునకు లేదు. దైవ మనుగ్రహించినచో సమర్థత కలుగును. అందుకే లక్ష్మణుడు తనంత తానుగ అనుసరించ లేనని, నీవే అనుచరునిగ చేసుకొనవలె నని కోరినాడు. ఇది సాత్వికమగు ప్రార్థన.

ప్రార్థన రాజసికమైనపుడు నే ననుసరింతును అన్న భావన ప్రకటిత మగును. **సద్గురువు ననుసరించు శిష్యుడు, సద్గురువు అనుమతిని కోరవలెను. అనుచరునిగ చేసుకొమ్మని ప్రార్థింప వలెను. అదియే కర్తవ్యము.**

దైవము ననుసరించుట జీవుని కర్తవ్య మైనపుడు తన మహిమను జీవునిపై ప్రసరింపజేయుట దేవుని కర్తవ్య మగును. అపుడు జీవుడు కృతార్థు డగును. దైవమహిమ కూడ వ్యాప్తి చెందును. తన కొరకు, తనవారి కొరకు, ఇతరుల కొరకు అని భావించి చేసినచో జీవుడు తాను చేయవలసిన పనిని చేయనివా డగును. తనవారు, యితరులు, తాను, దైవము ప్రతిరూపములే అన్న భావనతో వారికి చేసిన సేవ, భగవత్సేవగ పరిణమించును.

అనుసరించువానిని నియమించు బాధ్యత దైవముది. అట్లు నియమింపనిచో గురువు ధర్మము చెడినవాడగును. అనుసరించి చేయని వాడగుచో శిష్యుని ధర్మము చెడును. గురువగు శ్రీరాముడు తిరస్కరింపజాలని విధముగ లక్ష్మణుడు భక్తితో ప్రార్థించినాడు.

**"అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చతే ।" (25-31-2)**

"నీవు మేలుకొని ఉన్నప్పుడు, పండుకొని ఉన్నప్పుడు నీ కవసరమైన అన్ని పనులను చేయుచుందును" అని లక్ష్మణుడు వేడుకొనెను. **అనుచరుడైనవాడు అనుసరింపబడుతున్న వాని కన్న ముందుగ నిద్ర లేవవలెను. వెనుకగ నిద్రించవలెను. నిద్రయందు కూడ అప్రమత్తుడై యుండవలెను. మొద్దు నిద్ర పనికి రాదు. గురువును సేవించు శిష్యునకిది ప్రాధానమగు నియమము. ముందు నిద్రించు వాడు, వెనుకగ లేచువాడు సద్గురువు అవసరములను తీర్చలేడు. కనుక అనుసరింపలేడు. సద్గురువు కన్న ముందుగ తాను మేల్కాంచి, అతని అవసరము లన్నియు తాను వ్యక్తిగతముగ నిర్వర్తించి, అతను నిద్రించిన వెనుక తాను నిద్రించుట యుక్తము. అప్పుడు కూడ**

**అప్రమత్తుడై యుండవలెను.** అప్రమత్తతకు లక్ష్మణుడు పరాకాష్ఠ. రామునికి ఎప్పుడు ఏది అవసరమగునో యని అతడు నిదురనే త్యజించెను. సీతారాములకు తానే కందమూలములను తెచ్చి యిచ్చెను. దుంపలను, పండ్లను తెచ్చి యిచ్చెను. విల్లు, బాణములు ధరించి తాను ముందుగ నడిచి మార్గమును నిష్కంటకము చేయు చుండెను. క్రూర మృగములను అదిలించుచు, బెదిరించుచు, ముందుగ నడచుచు వనమున మార్గమును చూపుచుండెను.

అట్టి అనుచరునకు పరమాత్మయే ప్రేరణ కలిగించి సకాలమున పనులను నిర్వర్తింప జేయును. అట్టి వానికి శరీరము కూడ సహకరించును. జీవుడు, జీవుని శరీరము పరమాత్మకు చెందినవే. జీవుడు పరమాత్మ ననుసరించినపుడు, పరమాత్మ నుండి ఏర్పడిన ప్రకృతి నుండి ఏర్పడిన శరీరము కూడ సహకరించును. జీవుని శరీరము తన వశమున గాక దైవ వశమున నుండును. జీవుడు దైవసేవ యందున్నపుడు శరీరము జీవుని సేవయందు లగ్నమగును. జీవుడు చేయు దైవసేవకు అనుగుణమై వర్తించును. దైవము జీవుని, అతని శరీరమును కూడ పరిరక్షించు చుండును. ఈ విధముగ జీవుడు కృతార్థుడగును.

**"అహం తవచార్థః ప్రకల్పతే"**

నేను మీ కొరకే శరీరముతో నున్నాను. నీ కొరకే కల్పింపబడి యున్నాను. నన్ను నీ అనుచరునిగ అనుగ్రహించి, నన్ను కృతార్థుని చేయుము. మీరు పొందవలసిన ఫలము కూడ సిద్ధించును అని లక్ష్మణుడు రాముని వేడుకొనినాడు.

జీవుడు మానవ శరీరముతో నుండుట భగవంతుని పొందుట కొరకే. అందుకొరకే భగవంతుడు మానవునకు మనో ఇంద్రియ శరీరములతో పాటు బుద్ధిని గూడ ప్రసాదించెను. వాని నాధారముగ గొని భగవత్సేవకే తనను వినియోగించుకొనుచు జీవుడు కృతార్థుడు కావలెను. శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి తన కొరకు అని భావించు జీవుడు అజ్ఞానమున పడును. అవి తనవి కావు. దైవమునవి. తాను దైవమును చేరుటకు తనకు ఉపయోగపడుటకై దైవమిచ్చినవి. దైవము ప్రీతి కొరకు వాని నుపయోగించుట ధర్మము. ఇట్లు తనను, తనకు దైవదత్తమైన దైవప్రజ్ఞలను దైవము కొరకు వినియోగించుచు, ఫలమును గూడ దైవమునకే అంకితము గావించిన వాడు ధన్యుడగును. అట్టి వానికే అహంకార మమకారములు తొలగును. ఇది మానవ జీవిత లక్ష్యము. దీనిని సర్వ లక్షణ లక్షణుడు అయిన లక్ష్మణుడు నిర్వర్తించి చూపినాడు.

**శ్లో॥ సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః ।**
**సీతామువాచ అతియశాః రాఘవంచ మహావ్రతమ్ ॥**

లక్ష్మణుడు రాముని ప్రార్థించుట కొరకు రాముని పాదములను మనసారా పట్టుకొని, సీతమ్మతో పై విధముగ తన ప్రార్థనను తెలిపినాడు. **భగవంతు డనుగ్రహించుటకు శ్రీమాత అవసరమెంతయో ఉన్నది. మన ప్రార్థనలను ఆలకించున దామెయే. ఆమె మధ్యవర్తి. జీవులను పరమాత్మతో చేర్చునదామెయే.ఆమె అనుగ్రహము లేక జీవుడు పరమాత్మను చేరలేడు.** లక్ష్మణుడు అతియశుడు. అనగ గొప్ప కీర్తి కలవాడు. అతని కీర్తికి కారణము అతడు మాతను ఆరాధించుట. ఆమె "శ్రీ" అగుట వలన జయము, కీర్తి, శుభము, శక్తి, సంపద-

ఇట్టి వన్నియు ఆమె ద్వారా పొందుట జరుగును. అతని ప్రార్థన సీతారాముల నుద్దేశించియే. 'శ్రీ'ని విడచి 'రాము' నారాధించుట వివేకము కాదు. **'శ్రీరామ' అనునది పూర్ణమగు మంత్రము. రామ అనుటకన్న 'శ్రీరామ' అనుట సర్వసిద్ధి నిచ్చును.**

'శ్రీ' అనగా

1. ఎల్లపుడును దైవమును వీడక యుండునది.
2. జీవులచే ఆశ్రయింపబడునది.
3. జీవుల ప్రార్థనను వినునది.
4. దైవమునకు వినుపించునది.
5. శంకను తొలగించి, విశ్వాసము కలిగించునది.

అట్టి 'శ్రీ'తో కూడిన దైవము నారాధించుట ఉపాయమని లక్ష్మణుని ప్రార్థనా విధానము ప్రకటించుచున్నది.

# 58. రాముని అప్రమత్తత

వనవాసమున కేగు రాముడు తనను ప్రార్థించిన సీతమ్మను, లక్ష్మణుని తనతో వనవాసమునకు అనుమతించెను. వ్యక్తిగతముగ తనకున్న సంపదనంతను అయోధ్యా ప్రజలకు దానము చేసెను. త్రిజటుడు అను పేద బ్రాహ్మణుని విచిత్రరీతిని అనుగ్రహించెను. దశరథుని భవనమున ప్రవేశించెను. సుమంతునితో తామేతెంచి నట్లుగ తండ్రిగారికి నివేదింపమని తెలిపెను. తండ్రి అనుమతించగ లోనికేగెను.

రాముని చూసిన దశరథుడు దుఃఖమాపుకొనలేక శోకముతో తల్లడిల్లుచు మూర్ఛ పోయెను. రాముడు ఆ సంఘటనతో చెదరలేదు. లక్ష్మణునితో సహా తండ్రిని కౌగలించుకొని, లేవనెత్తి పాన్పుపై పరుండబెట్టెను. దశరథుడు తన నిస్సహాయతను ప్రకటింపగ రాముడు ఓదార్చి ధర్మమును తెలిపెను. తాను వనమున కేగుటయే యుక్తమని దృఢముగ తెలిపెను. దశరథుడు మోహపాశుడై ఒక్క రాత్రి ఉండి, కోరిన పదార్థము లన్నిటిని అనుభవించి, మరునాడు వనమున కేగమని కోరెను. ఆ ఒక రాత్రికి తాను రాముని చూసి సుఖముగ నుందునని, తల్లి కూడ సుఖించునని తెలిపెను. తండ్రి దీనావస్థను చూచి రాముడు చెదరలేదు. అతడు దశరథునితో ఇట్లని పలికెను. “తండ్రీ! మీరు పలికిన వచనములు వింటిని. ఈనాడు నాకు లభించిన గుణము రేపెవ్వరు ఒసంగ గలరు. ఈనాడు అదృష్టవశమున ఇట్టి

గుణములు లభించినవి. రేపెట్లుండునో? అందుచే అన్ని పదార్థము లను అనుభవించుటకంటే, అరణ్యమున కేగుటయే నాకు అభిమతము. వదలిన రాజ్యములోని పదార్థము లిక ముట్టను" అని పలికెను.

**శ్లో॥ ప్రాప్స్యామి యా నద్య గుణాన్ కోమేశ్వస్తాన్ ప్రదాస్యతి ।**
**అపక్రమణ మేవాత స్సర్వ కామై రహం వృణే ॥**

వదలిన దానిని మరల గ్రహించుట ఉచ్ఛిష్టమును భుజించుట వంటిది. అభిమానము గలవా రెవరును అది చేయరు. కైకేయిదేవి దశరథుడు ఒసగిన రెండు వరములను తానెట్లు వినియోగించినదో తెలిపిన పిదప, ఆ క్షణముననే రాముడు, దశరథ మహారాజు రాజ్యమును మానసికముగ విసర్జించెను. ఆనాడే పయనమయ్యెను. ఆ క్షణమునుండి అతనికి రాజ్య సుఖము లన్నియు పరధన భోజ్యముగ గోచరించినవి. కనుక ప్రకృతి గుణముల ధర్మము తెలిసిన రాముడు రేపెట్లుండునో అను భావము వలన నేడే వనవాసమునకు పయన మగుటకు సిద్ధపడెను. **మహనీయమగు భావ మొకటి కలిగినపుడు వెను వెంటనే దాని ననుసరించుట, అనుసరించుటకు త్వరపడుట,** రాముని అప్రమత్తత.

# 59. త్రిజటుడు - పురుష ప్రయత్నము

త్రిజటుడను బ్రాహ్మణుడు గర్గముని వంశములో జన్మించిన వాడు. అతడు ఎర్రని కేశములు కలవాడని వాల్మీకి వర్ణించెను. ఎర్రటి కేశములు కలవారికి పురుష ప్రయత్నము చేతనే తమ క్లేశములను తాము తొలగించుకొనగలమను భావన యుండును. అట్టి వారు స్వప్రయత్నముననే యత్నించుదురుగాని దైవము నర్థింపరు, ఆరాధింపరు. త్రిజటుని భార్య త్రిజటుని దినచర్యను నిత్యము గమనించుచుండెను. అతడు ప్రతి ఉదయము తవ్వుకోల, గునపము, గంప పట్టుకొని అడవికిపోయి దుంపలు త్రవ్వుకొని, ధాన్యపు గింజలు ఏరుకొని తెచ్చుకొని కుటుంబమును పోషించుచుండెను. రాముడు వనవాసమున కేగు సందర్భమున వ్యక్తిగతముగ తన కున్నది దానము చేయుచున్నాడని త్రిజటుని భార్య విన్నది. భర్తకా విషయము తెలిపి రాముని వద్దకు వెళ్లవలసినదిగ తెలిపెను. అతడు సూటిగ రాముని వద్దకు చేరి తాను నిర్ధనుడనని, బహుకుటుంబినని, గింజలు ఏరుకొని జీవించుచున్నానని, తనపై దయ చూపమని కోరెను.

త్రిజటుని అభిమానము గమనించిన రాముడు అతని పురుష ప్రయత్నమును పరీక్షించుటకు త్రిజుటునికి ఒక కర్రచూపి, ఆవుల మందలు చూపి, కర్ర విసరమని, కర్ర పడినంత వరకున్న ఆవు లన్నియు అతనికే ఒసగెదనని చెప్పెను.

త్రిజటుడు ఊపిరిపీల్చి తనకున్న సమస్త బలముతో కర్రను విసరెను. కర్రపడిన మేరకు గల గోవులన్నింటిని త్రిజటున కిచ్చుటయే గాక, ఇంకను ధనమును త్రిజటున కిచ్చి రాముడు గౌరవించెను.

**పురుష ప్రయత్నము పరిపూర్ణముగ నున్నచోట దైవానుగ్రహము కూడ తోడై వైభవమును కూర్చగలదని** ఈ కథ తెలుపుచున్నది.

త్రిజటుడు తానుగ అంతదూరము కర్ర విసరుట సాధ్యము కాదు. దైవానుగ్రహము తోడగుటచే కర్ర అంత దూరము పోయి పడినది. త్రికరణశుద్ధిగ మానవ ప్రయత్నము చేయుచుండగ దైవానుగ్రహము తోడైనచో విశేష ఫలముండునని తెలియవలెను.

# 60. రాముడు - స్థితప్రజ్ఞ - ఆదర్శము

వనవాసమునకు సంసిద్ధుడై తనకుగల సంపదనంతను దానము చేసి సీతాలక్ష్మణులతో దశరథునికి తుదిమారు కనిపించుటకై రాముడు దశరథ రాజమందిరమున కేగినాడు. తృటిలో వనవాసదీక్షను అంగీకరించిన రాముడు స్థిరచిత్తుడై దశరథుని ఎదుట నిలబడినాడు. రాముని రూపములోగాని, కనులలోగాని వనవాస గమనము ఎట్టి మార్పును కలిగించలేదు. కన్ను లెప్పటి వలెనే ప్రకాశించుచుండెను. మనసులను ఆకర్షించెడి అతని రూపము అట్లే యున్నది. ఏ వికారము చెందనివాడై నిలచియున్నాడు. అతనిని చూచిన సుమంతుడు దశరథుని వద్ద ఈ విధముగ కీర్తించినాడు.

“రాజా! నీ కుమారుడు పురుషశ్రేష్ఠుడు. తన సంపదను దానము చేసివేసినాడు. అడవికేగుటకు అందరి అనుమతి కొనినాడు. నిన్ను చూచుటకు నిరీక్షించుచున్నాడు. అతడి ప్రకాశము ఎప్పటివలెనే విరాజిల్లుచున్నది. అతడు సత్యపరాక్రముడు. ధర్మమునకు బద్ధుడు. ఆకాశమువలె ధూళి అంటనివాడు. అతడిలో ఏ దోషము ఉండదు.”

**రాముని స్థితప్రజ్ఞత్వము అనుపమానము. ధర్మ నిర్వహణమున అతని మనోస్థితి అచంచలము.** రామ చరిత్రయందు ఈ ఘట్టము రాముని గాంభీర్యమును మొట్టమొదటి సారిగ ఆవిష్కరించినది. తాటకవధ, మారీచ సుబాహులను జయించుట, పరశురాముని నిర్జించుట కన్న వనవాస దీక్ష గైకొను సమయముననే రాముడొక్క

మారుగ ఎంతటి ధర్మమూర్తియో ప్రకటింపబడును. తొణకక, బెణకక ధర్మమున నిలబడుట రామునికే సాధ్యము. ఎవరెన్ని విధముల అనుకూలమగు ఉపాయములు తెలిపినను ధర్మము వీడని తత్త్వము కలవాడు రాముడు. అతని ధర్మ నిర్ణయమును కాదనువారు త్రిలోకములలో ఎవ్వరునూ లేరు.

రాముని చూచిన దశరథుడు బేలయై శోకించుచు నేలపడినాడు. "రామా! రామా!" అని ఏడ్వసాగినాడు. రాజ భవనములోని స్త్రీలు, రాణులు అందరును ఒక్కమారేడ్చిరి. రాముడు మాత్రము నిశ్చలుడై ఇట్లు పలికెను. "రాజా! మీరు శోకము పొందకుడు. మమ్ములను అనుమతించుడు" అని మాత్రమే పలికినాడు. మరల ప్రసంగించుచు తనను గూర్చి ఇట్లు తెలిపినాడు.

"మనసునకూడ నాకు సుఖము కావలెనను కోరిక లేదు. సుఖము ఉండుట నాకు ప్రియము కాదు. మీ ఆజ్ఞను పరిపాలించుటయే నాకు ప్రియము. నాకు రాజ్యముగాని, శరీర సుఖముగాని, సీతగాని అవసరము లేదు. భోగములు కాని, స్వర్గముకాని నేను కోరుటలేదు. నా జీవితము కూడ నాకు ప్రధానము కాదు. నేనిక ఒక క్షణమైనను ఈ పట్టణమున ఉండలేను. నే నరణ్యమున కూడ ఆనందముగనే యుందును. సత్యమును నిలబెట్టుటకు రాజ్యమును, సర్వకామములను, మైథిలిని, సుఖమును, జీవితమును కూడ వీడుటకు నా మనసు జంకదు."

ఇట్లు పలుక గలవాడు రాముడొక్కడే. అనితర సాధ్యమగు భావమిది. కనుక రాముడే మానవులకు ఆదర్శమూర్తి.

# 61. దైవము – గురువు – జీవుడు

సహజముగ అందరు దైవమే రక్షించువాడని విశ్వసించి యుందురు. కాని దైవము కర్మానుగుణముగ ఫలము నిచ్చును. సద్గురువట్టివాడు కాదు. అతడు జీవులపై కృప కలవాడై, భగవానుని జీవుని కొరకు తాను ప్రార్థించును. జీవుల అహంకార మమకారములు తొలగుటకు తనదైన కృషి చేయును. జీవుల అహంకార మమ కారములు పుణ్య నదులలో స్నానము చేసినను, తీర్థయాత్రలు చేసినను తొలగవు. కనుక వారు సత్పురుషుల నాశ్రయించుట శ్రేయస్కరము. సత్పురుషుల సమాశ్రయమున మాత్రమే అహంకార మమకారములు త్వరితగతిని తొలగ గలవు. శ్రీరాముడు లక్ష్మణుని ఉద్దేశించి పై విధమగు భావమును ఆవిష్కరించు వాక్యమును పలికినాడు.

"లక్ష్మణా! నన్నాశ్రయించిన వారిని నేను స్వయముగ రక్షింప లేను. నీవు రక్షింప చేయవలెను" అని శ్రీరాముడు పలికినాడు. ఇది తెలియచేయుటకే చిలుక – గోరువంకల ఉదంతము నొకటి లక్ష్మణునితో రాముడు పలికినాడు. కౌసల్యాదేవి గృహమున ఒక చిలుక – గోరింకల జంట ఉండెడిదట. ఒకనాడు కౌసల్యాదేవి దైవమునకు క్షీరము నైవేద్యముగ నుంచినపుడు, పిల్లి ఒకటి అచటి కేతెంచి క్షీరమును గ్రోలబోయినదట. అపుడు చిలుక గోరువంక నుద్దేశించి పిల్లి కాళ్ళను కొరకమని సంకేతించినదట. గోరువంక పిల్లి కాళ్ళను కొరుకగా, పిల్లి పారిపోయినదట. ఈ ఉదంతము

తెలిపి రాముడు పై మాటను లక్ష్మణునితో పలికినాడు. పై ఉదంతములో రాముడు చిలుకగను, లక్ష్మణుడు గోరువంకగను, పిల్లి జీవుల అహంకార మమకారములుగను గుర్తించవలెను.

**దైవకార్యము చేయుటకు దైవము తానుగ పూనుకొనక, తనకు సమర్పణము చెందిన ఆచార్యునికి ప్రేరణ యిచ్చును. ఆచార్యుడు జీవుల అహంకార మమకారములను తొలగింపజేసి, దైవ సాన్నిధ్యమున జీవుల నిలుపును.**

రామాయణమున రామకార్యము నిర్వర్తించుటకు ఎందరో మహా భక్తులు పూనుకొనిరి. హనుమంతుడు రామ కార్యములనెల్ల చక్కదిద్దినాడు. రాముడు స్వయముగ చేసినకన్నా హనుమంతాదులు చేసినదే ఎక్కువగ గోచరించును. దైవము తన పనులను తాను స్వయముగ చేయక, తనవారితో నిర్వర్తింప జేసి వారి కీర్తి నినుమడింప జేయును. చిలుక, గోరువంకచే కార్యము నిర్వర్తించి నట్లు, దైవము గురువుచే జీవులను సంస్కరించును. ఈ సున్నితమగు రహస్యము మానవ జాతియందు భారతీయులే విశ్వసించినారు. కనుకనే త్వరితగతిని అహంకార మమకారములను దాటగలుగు చున్నారు. జాతియందహంకార మమకారములు మిక్కుటమైనపుడు సద్గురువులను నిరాదరణ చేయుట యుండును. అపుడు జాతి పతన మగును. వ్యక్తి విషయమున గాని, జాతి విషయమున గాని ఇదియే సత్యము.

# 62. సుమిత్ర రామదర్శనము

**సీ**తారామ లక్ష్మణులు వనవాసమునకై సాగిపోగ సుమిత్రాదేవి రామ స్వభావమును కౌసల్యాదేవికి వివరించి ఓదార్చెను. తల్లిగ కౌసల్యకు రామునిపైగల మమకారము కారణముగ ఆమె రాముని తత్త్వ దర్శనము తెలియలేక మోహపడి దుఃఖించెను. దశరథుడు కూడ అట్లే మోహముచే దుఃఖించినాడు. సుమిత్రాదేవి స్థితప్రజ్ఞ. నిష్కారణముగ తన కుమారుడైన లక్ష్మణుడు సీతారాములతో వనవాసమునకు ఉద్యమింపగ, సుమిత్ర సహకరించినది. తల్లిగ మోహ పడలేదు. రామునికి తోడుగ తన కుమారుడగు లక్ష్మణుడు వనవాసమున కేగుటయే ధర్మమని భావించెను. తల్లిగ అట్లెవరును సహకరింపరు. లక్ష్మణుడు వనవాస మేగుటకు కారణము లేదు. అతడి పయనము, వనవాస దీక్ష నిష్కారణము. కేవలము రాముని యందు తనకు గల అనురక్తి కారణమై లక్ష్మణుని వనవాసమున కంపినది. సుమిత్రాదేవి తన కుమారుని వారించలేదు. ఇట్టి కల్యాణ గుణము దశరథుని ముగ్గురు భార్యలలో సుమిత్రాదేవికే దక్కినది. ఆమె రాముని గూర్చి కౌసల్య కిట్లు వివరించెను.

“అక్కా! నీ కుమారుడు సమస్త సద్గుణవంతుడు. పురుషోత్తముడు. మహాబలవంతుడు. సుఖము నాశించువాడు కాదు. కర్తవ్యము నాశ్రయించిన వాడు. పెద్దలు నడచిన ధర్మముల నడచువాడు. తండ్రిని సత్యసంధునిగ నిలబెట్టుటకే రాజ్యమును త్యజించినాడు.

అడవుల కేగినాడు. అతడికి సత్యము, ధర్మము నిజమగు ధనము. అతడి కీర్తి అన్ని లోకములకును వ్యాపించగలదు. రాముడు పరిశుద్ధుడు, మహాత్ముడు. సూర్యచంద్రులు, పంచభూతములు అతడి కనుకూలురై యుందురు. రాముని గూర్చి భయపడుట అర్థరహితము. అతడెచ్చట నైనను సుఖముగ నుండగలడు. శత్రుభయము లేనివా డతడు."

**"రాముడు కీర్తికి కీర్తి. సంపదకు సంపద. ప్రభువులకు ప్రభువు. అగ్ని దేవునకు అగ్నిదేవుడు. క్షమకు క్షమ. భూతములకు పెనుభూతము. రాముని వంటివాడు మరియొకడు లేడు."**

"ఓ కౌసల్యా! రాము డెవరిపైనను ఆధారపడి జీవించడు. ఈ సృష్టి యందతడి కేదియును ఆధారము కాదు. ధర్మమొక్కటే అత డాశ్రయించునది. సీతవలెనే ఈ భూదేవి కూడ అతని నాశ్రయించి ఉన్నది. రాజ్యలక్ష్మి కూడ అతనినే ఆశ్రయించి ఉన్నది. కనుక వనమున కేగినను అతను నిజముగ రాజువలెనే జీవించును. అతడు సమస్తలోక పాలకుడు. రాము డస్త్ర సంపన్నుడు. దేవతలు సైతము అతని నాశ్రయించి ఉన్నారు. అతడు వనవాసమును నిర్ణీత సమయములో పూర్తి కావించి మరల అయోధ్య చేరగలడు. అతని శౌర్యము అనివార్యము. బలము అమోఘము. రాముని గూర్చి మనో వ్యధ, దుఃఖము అవివేకము. మన వ్యధలను, దుఃఖములను, భయమును, బలహీనతలను అత డగ్నివలె దహించి మనలను రక్షించువాడు. రాముని గూర్చి దుఃఖించుట అవివేకము. రామ చింతనమే వివేకము. రామ చింతనమున స్థిరమతియై నిలువుము.

# 63. వశిష్ఠుని హెచ్చరిక

దశరథుని మరణ సమయమున అరాజక ప్రభావ మెట్లుండునో వశిష్ఠుడు వివరించిన అంశములు నేడు భరత భూమియందు గోచరమగు చున్నవి. రామాయణమందు అరాజకస్థితి క్లుప్తముగ వర్ణింపబడినది.

**అరాజకమైన దేశములో సకాలవర్షము లుండవు. కొడుకులు తండ్రుల మాట వినరు. భార్యలు భర్తలను గౌరవించరు. ధనమే ప్రధానముగ బంధా లుంటాయి. స్త్రీల శీలము అపహరింపబడుతుంది. నీతి నిజాయితి ఉండదు. మనసున స్వస్థత యుండదు. పుణ్య క్షేత్రములు, తీర్థములు జార చోరత్వమునకు ఆటపట్టవుతాయి. ఉద్యానవనములు పాడుపడిపోతాయి. పుణ్య కథా పఠన ముండదు. సైన్యము అప్రమత్తముగ నుండక, శత్రుదాడులను ఎదుర్కొనలేరు. నదులు ఎండిపోవును. పచ్చికబయళ్ళు మాడిపోవును. ప్రజలు ఒకరి నొకరు చేపలవలె మ్రింగివేస్తారు.**

# 64. భరద్వాజుని సృష్టి

మహర్షులు ఘటనాఘటన సమర్థులు. భరతుడు సైన్యసమేతుడై వశిష్ఠునితో కూడి రాముని కొరకై వనమున ప్రవేశించి, భరద్వాజుని ఆశ్రమము చేరిరి. భరద్వాజుడు వశిష్ఠ మహర్షికి, భరతునకు అర్ఘ్య పాద్యాదులు సమర్పించి వారికిని, వారి సైన్యమునకును ఒక రాత్రి నివశించుటకై దేవతల నాహ్వానించి, అయోధ్యకు ప్రతిగా మరియొక అయోధ్య నేర్పరచెను. అందరకును విందు భోజన మేర్పాటు గావించెను. ఆ సమయమున భరద్వాజుడీ విధముగ ధ్యాన నమస్కారాదులు గావించినాడు.

"ఓ విశ్వకర్మా! ఓ మయుడా! (త్వష్ట) నేను భరతుడికి అతిథి సత్కారము చేయవలెను అనుకొన్నాను. అందువల్ల మీరు వెంటనే వచ్చి, ఇక్కడ వారి వారికి అవసరము అయిన గృహాదులను నిర్మించవలెను. ఓ ముగ్గురు లోకపాలకులారా! (యమ వరుణ కుబేరులారా) ఓ దేవేంద్రుడా! మీరు, మీ దేవతలు నాకు సాయపడవలెను. నేను భరతుడికి అతిథి సత్కారము చేయబోతున్నాను. ఓ అగ్నిహోత్రుడా! నీవు వచ్చి సర్వమూ నిర్వహించవలెను.

"ఈ భూమి మీదనూ, అంతరిక్షములోనూ తూర్పు పడమరల వైపులకు పారే నదులు అన్నీ, ఇప్పుడే ఇక్కడికి రావలెను. కొన్ని నదులలో మైరేయము (అనే మద్యము) ప్రవహించ వలెను. కొన్నిటిలో

సుర (అనే మద్యము) ప్రవహించవలెను. కొన్నిటిలో చెఱకు పానకము వంటి చల్లనినీరు ప్రవహించవలెను.

“ఓ హాహా! హూహూలారా! మీరు దేవజాతి అప్సరసలనూ, మీ గంధర్వజాతి అప్సరసలనూ వెంటపెట్టుకొని వెంటనే రావలెను.

“ఓ ఘృతాచీ! ఓ విశ్వాచీ! ఓ మిశ్రకేశీ! ఓ అలంబుసా! ఓ నాగదంతా! ఓ హేమా! పర్వతము మీద ఉంటూ ఉన్న ఓ హిమా! మీరు అందరూ, మీరు మాత్రమే కాదు, మీ వెంట ఉండే అప్సరసాంగ నలను అందరినీ వెంటపెట్టుకొని ఇక్కడికి రావలెను.

“ఓ బ్రహ్మదేవుడా! ఓ దేవేంద్రుడా! ఓ కుబేరుడా! మిమ్ములను సేవిస్తూ ఉన్న స్త్రీలను అందరినీ వారివారి నృత్యగీతాద్యుపకరణాల తోనూ, వారి వారి విద్యాగురువు అయిన తుంబురుడితోనూ వెంటనే ఇక్కడికి పంపించవలెను.

“ఓ చంద్రుడా! నేను భరతుడికి అతిథి సత్కారము చేయవలెను అనుకొనుచున్నాను. కాబట్టి నా కోసము నీవు భక్ష్య భోజ్య చోష్య లేహ్యాలను, నానావిధ ఉత్తమాన్నాలను, వివిధ మాంసాహారాలను, సురాది మద్య పానీయాలనూ వెంటనే సిద్ధము చేసి పెట్టవలెను.

“ఓ చంద్రుడా! నీవు సమస్త ఓషధులకూ అధిపతివి కాబట్టి, చిత్ర విచిత్రము లయిన పూలతో దండలు కట్టి పెట్టవలెను” అంటూ ఆ అప్రతిమాన తేజోవంతుడు, ఆ మహర్షి తన తపోబలముతోను, యోగబలముతోనూ శిక్షా స్వరాలతో ఆహ్వానిస్తూ, తూర్పు ముఖముగా కూర్చొని చేతులు ఎత్తి నమస్కారము చేస్తూ ధ్యానము చేయసాగినాడు.

# 65. ఋషి వాక్కు

భరద్వాజాశ్రమమున ఒక రాత్రి విశ్రాంతి గొనిన భరత శత్రుఘ్నులు, ముగ్గురు పట్ట మహిషులు, వశిష్ఠాది రాజపురోహితులు, మంత్రులు, సైన్యము, అయోధ్యాపురవాసులు భరద్వాజుని మహిమకు అమితాశ్చర్యపడిరి. వశిష్ఠాది ఋషులకు తప్ప ఇతరులెవ్వరికిని ఋషుల సామర్థ్యము తెలియదు. వారరణ్యమున అయోధ్యలో వసించిన విధముననే వసించిరి. అయోధ్యకన్న మిన్నయైన ప్రకృతి సౌందర్యమును, సుఖమును అనుభవించిరి. సంకల్ప మాత్రమున ఒక లోకమును సైతము సృష్టించగలవారు ఋషులు. అమితమైన జన సమూహమునకు ఏకరాత్రి వసతి, భోజనాది సదుపాయములు ముహూర్తకాలమున భరద్వాజు డమర్చుట అనుపమానము.

భరత ఋషులు భౌతిక సంపద, సౌఖ్యమందు ఆసక్తి కలవారు కాదు. అట్లని నిరాదరించిన వారును కారు. మనసేంద్రియ శరీర సౌఖ్యములను అవసరమగుచో సృష్టించుట, అవసరము లేనపుడు అంతర్థానము చేయుట తెలిసినవారు. పశ్చిమ భూభాగమందు అవతరింపజేయుటయే తెలిసి, అంతర్థానము చేయుట తెలియక పోవుటవలన మహత్తరమగు నగరములను, సామ్రాజ్యములను నిర్మించి వాటిపై ఆధిక్యము కొరకై తికమకపడు జ్ఞాను లెందరో గలరు. సృష్టించుటయేగాని లయము చేయుట తెలియకపోవుటవలన సృష్టింపబడిన విషయములకు లోబడి పతనము చెందుట జరిగినది.

ప్రస్తుత కాలమున కూడ సత్యము, ధర్మము, ప్రేమ, జ్ఞానము ఇత్యాదివి బోధించు సద్గురువులు కూడ విస్తృతమగు ఆశ్రమముల నేర్పరచి వాటి నిర్వహణమున బందీకృతు లగుచున్నారు. ఇట్టి వారందరికిని భరద్వాజుని చమత్కారము ఒక చక్కని సందేశమై యున్నది. అతడు సర్వసౌఖ్యములను సృష్టించుటయేగాక, వినియోగానంతరము సర్వమును అదృశ్యము గావించినాడు. తన సృష్టియందు తా నిమడక ముక్తసంగుడై నిలచినాడు.

అట్టి భరద్వాజ మహర్షి భరతుని పరీక్షించి, పరిశీలించి, అతనియందలి సత్య ధర్మ జ్ఞానములకు ఆనందించి రాముని చేరు మార్గమును తెలిపినాడు. రాముని చేరవలెనన్నచో, ఋషి యనుగ్రహ మవసరమని తెలియవలెను. **ఋషులందరును సద్గురువులే. వారు దైవమునకు మార్గము తెలిసిన వారు.**

రామాయణమున కైకేయి దేవిని సమర్థించిన ప్రప్రథమ పాత్ర కూడ భరద్వాజుడే. అయోధ్యానగరము చేరినది మొదలు భరతుడు నిష్కర్షగను, కర్కశముగను తల్లియగు కైకేయిని దూషించుచునే యుండెను. అంతఃపురమునందు, రాజ సభయందు, పురవాసుల సముఖమున, గుహుని సమీపమున, భరద్వాజుని సన్నిధియందు అతడు మాతృ దూషణమును సలుపుచునే యుండెను. దానికి కారణము లేకపోలేదు. ధర్మమును, దైవమును తన తల్లి హింసించి నది. అది సహింపలేక, తల్లిని దండించలేక నిందించుచు నుండెను.

భరద్వాజ మహర్షి సమభావము, సమదర్శనము కలవాడు. అతడు భరతునితో ఇట్లనెను. **“భరతా! నీవు నీ మాతృమూర్తిని తప్పు**

పట్ట పని లేదు. ఆమె ప్రవర్తన దైవప్రేరితము. రాముని అరణ్యావాసము వల్ల జగత్తు అంతా సుఖము చెందుతుంది. దేవదానవులు అందరికీ మేలు కలుగుతుంది. జగత్కల్యాణమే ప్రయోజనముగ జరుగవలసిన మహత్తర కార్యమునకు నీ తల్లి నిమిత్తమైనది. ఆమె నికపై దూషింప వలదు.”

# 66. రాముని అవగాహనము

భరతుని గూర్చి శ్రీరాముడు లక్ష్మణునితో ప్రసంగించిన తీరు, **ఒక సత్పురుషుని అవగాహన అపోహలను దాటి యుంటుందని** తెలియజేస్తుంది. భరతుని రాకను జూచి లక్ష్మణుడు అపోహ పడినపుడు శ్రీరాముడా అపోహను సరిదిద్దినాడు. ఒక సన్నిహితుడు అపోహ పడినపుడు వినినవాడు అట్టి అపోహను సమర్థించును. కాని రాముడు హితుడు పలికినను, సన్నిహితుడు పలికినను, శత్రువు పలికినను, అపరిచితుడు పలికినను సంపూర్ణముగ విని అంతశ్చే తనమున పరిశీలించుకొని సమాధానము నిచ్చును.

**"వినినంతనే వేగపడక వివరింపదగున్"** అను నీతివాక్యము రాముని జీవితమందు సంపూర్ణముగ దర్శింప వచ్చును. రాముడు భరతుని గూర్చి లక్ష్మణున కిట్లు వివరించెను. "లక్ష్మణా! భరతుని ససైన్యముగ సంహరించి వేస్తానంటున్నావు. అది సాధ్యమేనా? భరతుడు మహా ధనుర్ధరుడు. అతనిని గెలుతుననుట డంభము లాడుటయే. అది యట్లుండనిమ్ము. భరతుడు మహాజ్ఞాని. అది నీవు మరచినావు. భరతుడు మనవద్దకు వచ్చునపుడు ధనుస్సు ఖడ్గముల వంటి ఆయుధములతో పని లేదు. భరతుడు నాకు ప్రాణము కన్న ప్రియుడు. అతడు సోదరుల యందు అమిత వాత్సల్యము కలవాడు. మన మరణ్యావాసము చేయుట తనకు భరింపరాని దుఃఖము కలిగించి యుంటుంది. అతని హృదయము వికలమై పోయి యుంటుంది.

అతడు తల్లిని నిర్దాక్షిణ్యముగ దూషించి యుంటాడు. నాన్నగారిని సమాధాన పరచి, నాకు రాజ్యపాలనము అప్పగించాలని సైన్యముతో సహా అతడు వస్తూ ఉండి ఉండవచ్చు. అతడు మన కెన్నడును అపకారము చేయువాడు కాదు. చిన్ననాటి నుండియు అతడెప్పుడును భయజనకముగ మాట్లాడినవాడు కాదు. ఎవ్వరికిని అపకారము చేసినవాడు కాదు. అతడికి నేను సర్వప్రియుడను. నా కతడు ప్రియుడు. రాజ్యమును నీ కప్పగింపుమని నే నతడికి తెలిపినచో వెంటనే ఆ రాజ్యము అతడు నీ కిచ్చివేయగలడు. జ్ఞానికి మోహ ముండదు. కనుక నీవు భరతుని విషయమున భయపడకుము, ఊహపడకుము, అపార్థము చేసుకొనకుము.”

# 67. రాముని హితబోధ

"భరతుడా! మీ అమ్మ కైకేయిదేవి నీ కొరకు రాజ్యమును కోరినది కనుక దశరథ మహారాజు ఆమె కోరికపై నన్ను అరణ్యవాసానికి పంపినారని భావించుట తగదు. అందువలననే అతడు మరణించినాడని అనుకొనుట తగదు. నా వనవాసమునకు నీవు కాని, అమ్మ కైకేయి కాని కారణము కాదు. ఇదియంతా దైవ ఘటన!

"తమ్ముడా! ఈ లోకములో ఏ మానవుడు స్వతంత్రుడు కాదు. ఎవ్వరికిని అయిచ్ఛికమగు వ్యాపారము లేదు. ప్రతి వానిని అతని కర్మఫల పరిపాకము అక్కడికిని, ఇక్కడికిని ఈడ్చుకొని పోతూ ఉంటుంది. అందువలననే ఎవడు ఎంత ధనము కూడబెట్టినను అది అతడి స్వాధీనమున లేక అతడికి త్రిప్పట కలిగిస్తూ ఉంటుంది. దగ్గర చేరిన వారందరు అతని ఇచ్ఛకు వ్యతిరేకంగా దూరమై పోవచ్చును. ఎంత గొప్ప జీవితమైనా మరణానంతరము అంతమై పోతుంది. కైకేయిగాని, దశరథుడుగాని, నేనుగాని దైవ వశముననే వివిధముగ వర్తించుచున్నాము. మనకు మన తండ్రిగారు కేవలము తండ్రిగారే కాదు. రాజుగూడ. తండ్రిగను, రాజుగను అతడే మనకు పరమ ప్రమాణము. నీకు రాజ్యాభిషేకము, నాకు వనవాసము వారే నిర్ణయము చేసినారు. అవశులై చేసినను, నిర్ణయము నిర్ణయమే. తండ్రిని అవశుని చేసినది కైకేయిదేవి కాదు, దైవము. రాజిచ్చిన వరములను దైవము కాలరూపమున కైకేయిదేవిచే అర్థింపజేసినది.

కైకేయియు అవశయే. తండ్రి మాటకు మన మిరువురము బద్ధులమే. కనుక తండ్రి కోరినట్లు నీవు రాజ్యమును పరిపాలింపుము. నేను వనవాసము చేయుదును. ఇదియే దైవ నిర్ణయము.

**"కాలము గడిచిపోవుచునే యుండును. ఒక రాత్రి గడచి పోయినచో ఆ రాత్రి మరలి రాదు. కాల మనునది ఒక ప్రవాహము వంటిది. నదీజలములు సముద్రములో కలసిపోయినట్లు కాల ప్రవాహము జీవితమును అనంత కాలమున కలిపివేయును. సముద్ర మున చేరిన నదీజలములు మరల నదిలోనికి మరలించుట శక్యము కాదు. అట్లే గడచిన కాలము మరలించుటకు సాధ్యము కాదు.**

భరతా! శోకింపవలసినది ఇతరుల గూర్చి కాదు. మనల గూర్చియే మనము శోకింపవలెను. ప్రతిరోజును ఆయుర్దాయము తరిగిపోవుచున్నది. శరీరముండగనే పొందవలసినది ఏదో ఎరిగి, దానిని పొందుటకు తగిన సాధనము చేయవలెను. అట్లు చేయక శరీర మంత మొందు చున్నదని శోకించుట తగని పని. మనము నిలచినను, నడచినను, కూర్చుండినను, నిద్రపోయినను ఆయువు తరగిపోవుచునే యుండును. నరుడు మృత్యువుతో కలిసి నడచు చున్నాడు. మనము నడచుచున్నపుడు మృత్యువు మనలోనే యున్నది. కూర్చుండునపుడు మనతోనే కూర్చుండును. ప్రయాణము చేసిననూ మనతోనే వచ్చుచుండును. మనవెంట సతతము పయనించు మృత్యువును మనము గుర్తింపము. దానిని తప్పించుకొనుట ఎవ్వరికిని సాధ్యము కాదు. దానిని విచారించుట అవివేకము.

శరీరమందు ముడతలు ఏర్పడుచుండును. వెంట్రుకలు పండుచుండును. రాలు చుండును కూడ. ముసలితనముచే అవయవ

ములు శిథిలమగుచు చురుకుదనమును కోల్పోవును. ఈ మార్పును ఎంత సమర్థుడైనను అరికట్టలేడు. ఇది కాలము ప్రభావము. కాలమునకు అందరూ వశులే. దానిని మీరుటకు గాని, తప్పించుకొనుటకు గాని సాధ్యము కాని పని. తప్పనిసరిగ వచ్చే ఘటనలను అనుభవించుచు, చేయవలసినది చేయుటయే తప్ప, శోకించుట తగదు."

"భరతా గమనించితివా! సూర్యుడు ఉదయించినాడని సంతోషించు చుందురు. అస్తమించినపుడు కూడ చూచి సంతోషించు చుందురు. కాని నడుమ కాలమున తాను సాధించ వలసిన దానిని గూర్చి నరుడు చింతింపడు. సాధింపవలసినది సాధించినను, సాధించకున్నను జీవితము తరగిపోవు చుండును. ఈ తరుగుదలను కూడ నరుడు అనునిత్యము గుర్తించడు.

"తన్ను తానెరుగలేని జీవనము, ఆర్జనము, వృత్తి వ్యాపారాదులు వ్యర్థము. ఆత్మ జ్ఞానమునకై కృషి సలపని జీవుని ఆయుర్దాయము శరీరభోగమునకై పరిమితమై, అటుపై నశించును. తన్ను తానెరిగి తన కొరకై తన శరీరమును, ఇంద్రియములను, మనసును, బుద్ధిని ఉపయోగించుకొనెడి జీవితము సార్థకము. తన్ను తాను మరచి తన శరీర భోగముకొరకు జీవించెడి జీవితము వ్యర్థము. వర్షము పడినదని, పంటలు పండినవని, పంటలింటికి చేరినవని, ఎండలు ఉద్రేకముగ నున్నవని, శీతాకాలము చలి హెచ్చైనదని ఇట్లు కాలచక్రమందలి ఋతువులలో తిరుగాడు నరుడు, కాలము తనను హరించు చున్నదని తెలియడు. ఈ కాలమను ప్రవాహమున మనుష్యులు కలియు చుందురు, విడిపోవు చుందురు, దగ్గరగు

చుందురు, దూరమగు చుందురు. వాటి కన్నిటికిని వారు కర్తలు కారు. కాలమే కర్త, కారణము.

"ఎంత గొప్పవాడైనను తాను కోరినట్లు జరుగుట యుండదు. బ్రహ్మాదు లైనను అడ్డులేని సంకల్పము కలవారు కారు. వారి ఆయుర్దాయముకూడ పరిమితమే. మనముందు వచ్చినవారు మనకన్న ముందుగ సాగిపోయిరి. మనమును అట్లే సాగిపోదుము. ఎవరి గతిని బట్టి వారు సాగుదురు. నే నరణ్యదారి పట్టితిని. మనతండ్రి పరలోక దారిపట్టెను. నీకై నియమింపబడిన రాజ్యమును పాలించుటకు నీవు పట్టణమున కేగవలెను. ఎవరిని ఏ పని చేయుటకు కాలము నియోగించునో, అతడా కార్యమును నెరవేర్చవలెను. కాలగతి నెరిగి అనుసరించుట మన కర్తవ్యము. మరియొక మార్గము లేదు.

**"జీవితము కాలప్రభావమున నడచుచుండగ అందు శుభము నొందుటకు సాధనము ధర్మమని ఎరుగుము. అట్టి ధర్మము ననుసరించుచు అనుభవించుట, ఆనందించుట మన కర్తవ్యమై యున్నది. అర్థకామములు ధర్మమునకు లోబడి పొందుటలో నియతి యున్నది. ప్రజలను పరిపాలించుట నీ ధర్మము. మన తండ్రి, మన ప్రజలకు రాజు నిన్నట్లు శాసించినాడు. నీవట్లు వర్తించుటయే శ్రేయమగును. ఇంతకు మించిన ధర్మాధర్మములు ఆవశ్యకము కావు."**

# 68. భరతుని వాదము

“రామచంద్రా! నీ వంటి వారు మరియొకరీ లోకమున లేరు. నిన్ను దుఃఖము బాధింపజాలదు. సుఖము ఆనందింప చేయజాలదు. నీ వెన్నియో విషయముల నెరిగిన వాడవు. నీకు తెలియని విషయము లేదు. నీకు దేనియందును ద్వేషము లేదు. రాగము కూడ లేదు. నా శోకమంతయు నిన్ను గూర్చియే. నీ కాపద కలిగినదని శోకించు చున్నాను. తండ్రి పోయినారన్న శోకముకన్న, నీ కాపద కలిగినదన్న శోకము నన్ను బాధించు చున్నది. పుట్టినవారు మరణించుట సహజము. కనుక తండ్రి విషయమున ప్రకృతి సహజమగు ధర్మమును గుర్తించి సమాధాన పడినాను. నీకు కలిగిన ఆపద అసహజము. అది అకృత్యము. ధర్మ విరుద్ధము. నీకేర్పడిన ఆపద తగనిది.

“లోకములో మరణమునకు ముందు మతి చెడునని ఒక సామెత యున్నది. మన తండ్రిగారు ఆ సామెతకు తగినట్లే మరణించు ముందు పాపపు పని చేసినారు. వారి నుండి జరిగిన ఈ అకృత్యమును దిద్దుబాటు గావించి, వారు పతనము కాకుండ చూడవలసిన బాధ్యత మనకున్నది. అపథ్యమును సుపథ్యము చేయవలయును కదా! అపుడే తండ్రిగారికి పతనము తప్పును. తండ్రిని అధర్మము నుండి కాపాడ వలసిన బాధ్యత ప్రథమముగ నీయందున్నది. తండ్రి చేసిన దుష్కార్యమును నీ వంగీకరించుట తగదు. నిందింపతగిన కర్మను తండ్రి చేసిన నాడు కుమారుడు దానిని స్వీకరించుట తగదు.

"క్షత్రియుడు రాజ్యపాలనము చేయవలెను కాని అరణ్యమున జీవింపరాదు. పరిపాలన చేయవలసిన వాడు జపము చేసికొనుట తగని పని. పాలన మెక్కడ, జప మెక్కడ? ఒక దానికొకటి పొసగదు. సర్వాభరణ భూషితుడగు రాజు జడలు దాల్చి జపము చేసుకొనుట క్షాత్రము కానేరదు. ప్రజలను సుఖపెట్టవలసినవాడు తాపసి కారాదు. రాజ్య పరిపాలనము నీకు ప్రత్యక్ష ధర్మము. దానిలో కూడ త్యాగ మున్నది.

"నేను నీ తరువాత పుట్టిన వాడను. నీ కంటే విద్యలో కూడ చిన్నవాడను. నీకున్న బుద్ధిబలము గాని, గుణబలము గాని నాకు లేదు. నేను రాజ్యము పాలించుట అధర్మము మాత్రమే కాదు, అసభ్యము కూడ. ఈ రాజ్యము నీకే సంక్రమింప తగినది. నీవు జ్యేష్ఠుడవు. నీవు పాలించుటయే ధర్మ సమ్మతము."

# 69. రాముని హితబోధ

"తమ్ముడా! నీవు మాటాడదగిన మాటలు మాటాడితివి. అవి సమంజసము, ధర్మసమ్మతము కూడ. సందేహము లేదు. కాని నీకొక విషయమును తెలిపెదను. ఇంతకుముందీ విషయము నీకు తెలియదు. చెప్పెదను వినుము. మన తండ్రి కైకేయిదేవిని వివాహ మాడుటకు కేకయ రాజును అర్థించినాడు. అందుకు కేకయరాజు తన కుమార్తెయగు కైకేయి పుత్రునకు రాజ్యమిత్తునని మాట ఇచ్చినచో తన కుమార్తె నిచ్చి వివాహము చేతునని పలికినాడు. మన తండ్రిగారా సమయమున కేకయరాజునకు అట్లే చేతునని మాట ఇచ్చినారు. ఇచ్చిన మాట ప్రకారము రాజ్యమును నీకే సంక్రమింప చేయవలెను. నాపై మోహముతో తండ్రి దశరథుడు నీవు లేని సమయమున నన్ను రాజ్యాభిషిక్తుని చేయవలెనని త్వరపడెను. పొరపడెను కూడ. త్వరపడుట పొరపడుటయే. మన తల్లి కైకేయి కోరినది ధర్మసమ్మతమే. కొంత సంకోచించినను తండ్రి చేసినది ధర్మమే. ఇచ్చిన మాటను తప్పక రాజ్యమును నీకు సంక్రమింప జేసెను.

"తండ్రి కేకయరాజుతో పలికిన మాటను చెల్లింపవలసిన అగత్య మున్నది. అంతేకాక ఆమెకు సంతోషముగ వరము లిచ్చినాడు. ఆ వరములు కూడ చెల్లింపవలయును గదా!

"ఎపుడో చిన్నతనములో వివాహమగుటచే కైకేయి మాత ఆ విషయము మరచి యుండును. కాని కాలము మంథర రూపమున

బయల్పరచినది. మహర్షి వశిష్ఠునకు, సుమంతునకు, దశరథునకు ఈ విషయము తెలియును. నాపై గల మోహము వలన వారు మిన్నకుండిరి. కేకయ రాజు కూడ నా గుణగణములను భావించి ఈ విషయమును రచ్చ చేయలేదు. నా యందు గల ప్రేమ, మోహములు అందరిని భ్రమగొల్పి జరుగవలసిన కార్యము మరుగున చేర్చినది. కాని దైవము కాలము రూపమున అంతయు సుస్పష్టము గావించెను.

"తండ్రి యొనర్చినది అకృత్యము కాదు. అధర్మమును కాదు. అతడు మతి చెడి ప్రవర్తింపలేదు. అతడు సర్వజ్ఞుడు. అకస్మాత్తు సంఘటనకు దుఃఖించినాడు, మరణించినాడు. అతడిచ్చినమాట అసత్యము కాకుండ నీవు, నేను కాపాడుట కర్తవ్యమై యున్నది. నీవు పట్టాభిషేకము చేసుకొననిచో తండ్రిమాట వమ్మగును. తండ్రిని కాపాడుట యందు నీవు నీ కర్తవ్యమును నిర్వర్తించుము. నేను నా కర్తవ్యమును నిర్వర్తింతును."

విలపించుచున్న భరతునకు రాముడు చేసిన బోధ శాశ్వత సత్యము. ఆస్తిక జనులకు వికాసము కలిగించును.

"మానవుడు స్వతంత్రుడు కాడు. సర్వేశ్వరుడే స్వతంత్రుడు. ఏపనినైనను తాను తలచునట్లు చేయు శక్తి పురుషునకు లేదు. దైవమే స్వతంత్రమైనది. దైవమే పురుషుని అటునిటు నడిపించు చుండును. దైవనిర్ణయము ఎవరివలనను మార్చ శక్యము కానిది. ఎవరు కలిసినను విడిపోవుట తప్పదు. ఎదిగినది తరుగుట తప్పదు. ఏ జీవితమైనను మరణముతో అంతము కాక తప్పదు. ఇది లోక

స్వభావము. ఎంత ఉన్నతమైన పదవిలో నున్నను ఆ అధికార మొకనాడు పూర్తియగును. ఇంద్రాదులు కూడ వారి వారి పదవుల యందు శాశ్వతులు కారు. మిత్రులు, పుత్రులు, సంతానము, భార్య భర్త కొంతకాలమే యుందురు. ఎవడును ఎవరితోను, దేనితోను శాశ్వతముగ నుండలేడు. మన శరీరము కూడ కర్మవశమున పంచభూతముల కలయికచే ఏర్పడినది. కర్మానుగుణముగ శరీరము ఉండుట, లేకుండుట జరుగును.

“గడచిన కాలము మరలిరాదు. అది ప్రవాహమై సాగుచు నుండును. వెనుకకు మరలుట శక్యము కాదు. మరణించిన తండ్రి గాని, వనములకేతెంచిన నేను గాని కాలగతిని బట్టి భవిష్యత్తులోనికి ప్రవేశించుటయే యుండును గాని తండ్రి జీవించుట, నే నభిషిక్తుడ నగుట సాధ్యము కాని విషయములు. గడిచిన విషయములను గూర్చి శోకించుట గాని, వాదించుట గాని తెలియనితనము.

“మానవుడు అనునిత్యము మృత్యువుతో కలసి నడచుచున్నాడు. మృత్యువు మనతోనే యుండును. మనతోనే చరించును. మనకు తెలియకుండగనే కాలానుసారము మనలను శరీరముతో విడదీయును. కాలమునకు వశులై జీవులు దేహములు ధరించుట, విసర్జించుట జరుగుచు నున్నవి. తప్పనిసరిగ వచ్చెడి అంశముల ననుభవించుచు చేయవలసిన కృత్యములు చేయుచు నుండుటయే కాని శోకించుట నిష్ప్రయోజనము. మేలుకొనినది మొదలు నిద్రించు వరకు తనను తానెరిగి, తన కర్తవ్యమెరిగి జీవించుటయేగాని మరియొక ఉపాయము మానవునకు లేదు.

"కాలమనెడి ప్రభావము చేత జీవునికి తల్లిదండ్రులు చేరుదురు. అటుపై సోదరులు, మిత్రులు చేరుదురు. ఆపైన జీవిత భాగస్వామి, సంతానము చేరును. పుట్టుకచేతనే కులము జాతి లింగభేదము చేరును. పెరుగుచుండగ ధనము, ఆస్తిపాస్తి, సంఘమందవస్థితి, కీర్తి ఇత్యాదివి చేరును. ఇవియన్నియు కాలమును, కర్మమును అనుసరించి ఎట్లు చేరునో అట్లే నిష్క్రమించునని కూడ తెలియవలెను. కాల, కర్మములు అన్నియును చేర్చుట విడదీయుట చేయుచు నుండును. శరీరములు కూడ చేర్చి విడదీయును. ఇట్లు అనేకానేక ములు కాలక్రమమున చేరుట యందుగాని, వీడుట యందుగాని జీవుని కెట్టి స్వామిత్వము లేదు. అతడు వానియొక్క ఆగమనము, నిర్గమము శాసించలేడు. సమస్తము దైవాధీనమై సాగుచు నుండగ జీవుడు సాక్షిగ చూచుచు నుండవలెను. ఇట్లు సాక్షియగు జీవునకు తనలోనుండి తాను నిర్వర్తించు కర్మకు స్ఫూర్తికూడ దైవమే నిచ్చును. దైవసంకల్పము ననుసరించి జీవుడు నడుచుటకు జీవునకు తటస్థ స్థితియే శరణ్యము. తటస్థుడు కాని వాడు ప్రపంచమందలి రాగ ద్వేషములలోనికి జొరబడి జీవితపు ఆటుపోట్లకు లోనగును".

# 70. భరతుని దీక్ష

శ్రీరాముని బంగారు పాదుకలపై నిలువుమని అర్థించి, రామానుగ్రహము పాదుకల రూపమున గైకొని, ఆ పాదుకలే సర్వలోకములకు యోగక్షేమములు కల్పింపగలవని భరతుడు భావించెను. పాదుకలు స్వీకరించిన భరతుడు ఇట్లని పలికినాడు.

"రామా! పదునాలుగు సంవత్సరములు నీవు అరణ్యములో నుందువు. కనుక నేను కూడ నగరము వెలుపలనే యుందును. నీవలెనే పదునాలుగు సంవత్సరములు జటలను, నార వస్త్రములను ధరింతును. కందమూలములను, ఫలములను మాత్రమే భుజింతును. నీ పాదుకలే రాజ్యతంత్రమును నిర్వహించును. నేను నీదాసునివలె మెలగుదును.

"పదునాలుగు సంవత్సరములు నిండగనే నీవు వచ్చి దర్శన మీయనిచో అగ్నిహోత్రమున ప్రవేశింతును" పై విధముగ పలికి భరతుడు పాదుకలను గొని పుష్పములతో అలంకరించి, పూజించి, రామునకు ప్రదక్షిణము చేసి శ్రేష్ఠమగు రాచ ఏనుగుపై వాని నేర్పరచి వెనుకకు మరలెను. అటుపైన పాదుకలను రెంటిని తన శిరస్సుపై ధరించి, పరవశుడై శత్రుఘ్నునితో కూడి రథము నధిరోహించెను. రామ పాదుకలకు పట్టాభిషేకము గావించెను.

తానెన్ని ధర్మములు తెలిపినను ధర్మమూర్తి యగు రాముడు వెనుకకు మరలిరాడని, భరతునకు తెలియును. పరాక్రమము

విషయమునగాని, ధర్మము విషయమున గాని, సత్యము విషయమున గాని భరతుడు రామునివలెనే ప్రవర్తించును. కనుక రాముడు రాడని తెలిసినను తనవంతు ప్రయత్నము త్రికరణశుద్ధిగ నిర్వర్తించుటకే అనితర సాధ్యమగు ప్రయత్నము గావించెను. రాముడు తిరిగి రాడని తెలిసియుండుటచే బంగారు పాదుకలను ముందుగనే అయోధ్యనుండి బయలుదేరునపుడు రథము నెక్కించెను. తన ప్రయత్నము లన్నియు విఫలమైనపుడు బంగారు పాదుకలకు రాముని స్పర్శ కల్పించి వానికి పట్టాభిషిక్తము గావించి వానినే సింహాసనముపై నుంచి తాను రాజ ప్రతినిధిగ నిలచెను. "నేను రామదాసుడనే. నేను రాజును కాను" అను తృప్తితో జీవించిన వాడు భరతుడు.

భరతుడు తననెప్పుడును, క్షణకాలమైనను ప్రభువుగ భావింప లేదు. తాను రాజు ననుకొన లేదు. రాముని సింహాసనమునకై ఆశింప లేదు. సింహాసనముపై పాదుకలనిడి తాను రాజప్రతినిధిగ నుండెను. రామ ప్రతినిధిగ నుండెను. రాముడు రాజ్యమునెట్లు పాలించెనో జ్ఞప్తియందుంచుకొని, అట్లే ప్రతినిధివలె నిర్వర్తించెను. రామసేవకుడ నని భావించి సంతసించెను. రామభావముననే పదునాలుగు సంవత్సరములు రాజ్యమును రక్షించెను.

భరతుని యొక్క పవిత్రమగు ఈ భావము సత్సాధకులు తప్పక గమనింపవలెను. **సద్గురు సాన్నిధ్యమున ఉపదేశమును పొంది, విద్య నభ్యసించుచు సద్గురు శాసనములను పాటించు సాధకుడు, గురు స్థానము నాశించక గురువునకు ప్రతినిధియై నిలువవలెను. గురు వొక్కడే! అతడు జగద్గురువు. పరమేశ్వరుడు. ఉపదేశము వలన, విద్యాభ్యాసము వలన జ్ఞానము పొంది సిద్ధుడైనను తాను పరమేశ్వరుని**

**ప్రతినిధియే అగునుగాని పరమేశ్వరుడు కాదని తెలియవలెను.** బ్రహ్మర్షులగు వశిష్ఠ అగస్త్యాది ఋషులు కూడ సతతము పరమేశ్వరుని సాన్నిధ్యము ననుభవించుచున్నను, తాము పరమేశ్వరులమని తెలుపు కొనలేదు. జగద్గురు వొక్కడే! సమస్త గురుపరంపరలు, ఆ జగద్గురువు నకు ప్రతినిధులే గాని స్వయముగ తామే జగద్గురువు లనుకొనుట ఒక భ్రాంతి.

సత్సాధకులేకాదు, సాధారణ మానవులుకూడ తమ జీవితము నకు తామే అధికారుల మనుకొనుట అజ్ఞానము. మానవులు కర్మ చేయక నుండుట కుదరదు. కర్మచేసిన ఫలము వచ్చును. ఫలాసక్తి వలన రాగ ద్వేషము లేర్పడును. కర్మ చేయునపుడు తానే చేయు చున్నానను అహంభావము కలుగును. నిర్వహణము వలన మమకార మేర్పడు చుండును. నాది, నావారు ఏర్పడును. భరతుడు సర్వకర్మలను రామునికి సమర్పణముగ నిర్వర్తించి కృతకృత్యుడయ్యెను. రాముని యందు ప్రేమ కలవాడై, రామాగమనమునకై నిరీక్షించుచు సింహాసనముపై పాదుకల నుంచి, ఆ పాదుకలనే పాలకులుగ భావించెను. ఏ కార్యము నిర్వహింపవలసి వచ్చినను పాదుకలకు విన్నవించి చేయుచుండెను. కానుకలనుకూడ పాదుకల కర్పించి జనశ్రేయస్సుకై వినియోగించు చుండెను. మానవుడు కూడ దైవమే కర్తయని భావించి దైవపరముగ కార్యములు నిర్వర్తించుచు ఫలము లను దైవమునకే సమర్పించుచు, దైవమును ప్రార్థించుచు అతని దర్శన స్పర్శనాదులకై ఎదురు చూచుచు నుండవలెను.

మోక్ష మనగా అన్నియును వదిలించుకొనుట కాదు. శరీరము వీడుటయు కాదు. మనస్సున సంగము వీడుట మోక్షము. ఇది నాది,

వీరు నావారు అను భావములు వీడినచో మిగిలినది మోక్ష స్థితి. శరీరమందు వశించుచు శరీరము తనదనుకొనక దైవదత్తమని భావించి నర్తించుటవలన శరీరపు సంగము కూడ వీడును. అట్లే భావముల యందు దైవమును పూరించి దైవభావన యందున్నచో భావ సంగమము వీడును. రుచులయందు, వాసనలయందు కూడ దైవమును చూచునపుడు వానియందలి సంగము వీడును. శరరముతో సహా తనవద్దకు చేరినవన్నీ దైవముచే కూర్చబడినవని తెలిసి, తాను కూడ దైవమునకు చెందినవాడని భావించువాడు నిజముగ మోక్షస్థితి యందుండును.

తనది యనుకొనక సమస్తము రామునకు చెందినదే. తాను కూడ రామునికి చెందినవాడే అని భావించిన భరతుడు మోక్ష స్థితియందు నిలచెను. రామ ప్రతినిధిగయుండి, రాముని పాదుకలను సింహాసనముపై నుంచి పాదుకలకు రాజఛత్రము నేర్పరచినాడు. పాదుకలే పాలించునని, రక్షించునని విశ్వసించెను. రాచకార్యము లన్నియు పాదుకలే నిర్వర్తించుచున్నట్లు భావించినాడు. తనయందు కలుగు భావములు, తాను చేయు పనులు కూడ రాముడే నిర్వర్తించు చున్నాడను ప్రగాఢ విశ్వాసముతో భరతుడు నిలచినాడు. ఎవరైనను తనకు కానుక లిచ్చినచో అవి రామునకు వచ్చిన కానుకలని భావించెడివాడు. భరతుడు నేర్పిన జీవన విధానమిది.

భరతుని కన్న రామభక్తుడు మరియొకడు గోచరింపడు. భక్తులకతడే మార్గదర్శి. రామభక్తి యందు నిలచి తనతో సహా సర్వస్వమును రామునకే అంకితము చేసి, రాముని హృదయమందు నిలచెను. రాముడు అతని హృదయమందు నిలచెను. ఇట్లు

పరస్పరము ఒకరి హృదయమందు మరియొకరు జీవించుటవలన ఒకరే నిద్దరుగ నుండుట జరుగును. కనుకనే భరతుని చూచిన హనుమంతునకు, భరతుడు గాక రాముడే గోచరించెను. భరతుడు ముమ్మాటికిని రాముడే. అపుడు హనుమంతునికి రాముని వాక్య రహస్యము గోచరించినది. “హనుమా! నీవు నాకు భరతునితో సమానమగు ప్రియ సోదరుడవు” అని రాముడు పలుకుటలో గల లోతు తెలియవచ్చినది. భరతుడు నిజమగు సన్యాసి. హనుమ కూడ అట్టివాడే.

# 71. అనసూయ హితబోధ

అత్రిమహర్షి ఆశ్రమమునకు చేరిన సీతారామలక్ష్మణులను సాదరముగ అనసూయ అత్రులు ఆహ్వానించి, కుశలమడిగి ఆశ్రమమున ఆతిథ్యము కల్పించిరి. అత్రిమహర్షి సీతమ్మను అనసూయ వద్దకు పంపెను. అనసూయాదేవి అత్యంతాదరముతో వాత్సల్య పూరితముగ పతివ్రతా ధర్మములనిట్లు తెలిపినది.

1. భర్త ననుసరించుటకు సర్వదా సంసిద్ధత కలిగియుండవలెను.
2. భర్తకొరకు బంధువులను, స్నేహితులను, ఐశ్వర్యమును వదలుకొను సంసిద్ధత యుండవలెను.
3. భర్త నివాసము చిన్నదియైనను, పెద్దదియైనను, నగర మందున్నను, గ్రామ మందున్నను, వన మందున్నను వుండసమ్మతమై ఆ నివాసమున తానును వుండవలెను.
4. భర్త ధనవంతుడైనను, ధనహీనుడైనను, సంస్కారవంతుడైనను, సంస్కార హీనుడైనను, ధర్మము ననుసరించినను, అనుసరించకున్నను భార్య అతనిని వీడరాదు.
5. భర్తయే దైవమని, భర్తకంటె గొప్ప బంధువు లేడని తెలియవలెను.
6. భర్తను ప్రేమించి ఆరాధించుటకన్న మరియొక తపస్సు లేదని తెలియవలెను.

7. తమ కోర్కెలను తీర్చుకొనుట కొరకు భర్తని వినియో గించుట, నియమించుట జరుగరాదు.

8. భర్త పరస్త్రీని కాంక్షించినను అతనియందలి దైవమును ఆరాధించుచు, అతడు సన్మార్గమును బట్టుటకు బలమీయ వలెను.

9. తన భర్త తప్ప పరపురుష లందరును భాతృ, పితృ సమానులని భావింపవలెను.

10. భర్త కోరినచో సలహాల నీయవచ్చును.

# 72. అరణ్యము - వనము

రామాయణమునందు అరణ్యకాండ, మహాభారతమునందు అరణ్యపర్వము ఉన్నవి. రాముడు సీతాలక్ష్మణులతో అరణ్యములకు జనుట సంభవించినది. అలాగే యుధిష్ఠిరుడు తన భార్యతో, నలుగురు తమ్ములతో అరణ్య ప్రవేశం చేయుట సంభవించినది. ఇరువురును విధివశులై రాజాధికారములు, లాంఛనములు కోల్పోయినారు. ఇరువురికి అరణ్య ప్రవేశం తప్పలేదు.

నిజమున కరణ్యము వనము కూడ. అందు పూలు, పండ్లతో అనేకానేక వృక్షము లుండును. రమ్యమగు దృశ్యములుండును. పర్వతములు, నదులును ఉండును. పక్షుల కిలకిలారావము లుండును. వన్యమృగముల హడావిడికూడ యుండును. ఇవియన్నియు మనోహరములు. అంతేగాక ఋషుల, మునుల ఆశ్రమములు కూడ యుండును. దీర్ఘకాలము తపశ్చర్యయందు నిమగ్నమైయున్న ఋషి కుటుంబము లున్నవి. వారు నగరములయందు, గ్రామములయందు ఉండక అరణ్యము నందుండుటకే ఇచ్ఛగింతురు. తప, వ్రత దీక్షలకు అంతరాయములు కలుగకుండా అరణ్యమందలి రహస్య ప్రదేశము లందు ఆశ్రమముల నేర్పరచుకొని దీక్షతో వ్రతములు, తపములు చేయుచుందురు.

పై తెలిపిన మనోహర దృశ్యములు, ఋషి ఆశ్రమములు అరణ్యమందే లభించును. అరణ్య మనగనే సామాన్యులకు క్రూర

జంతువులు, అసురులు, భూతప్రేతములు, విష కీటకములు, పాములు, తేళ్ళు గుర్తుకు వచ్చును. కాని దివ్యమగు విషయములు కూడనున్నవని తెలియలేరు. సీతారాములు దివ్య స్వభావములు కలవారు కనుక వారికి నగరములకన్న వనములే నచ్చినవి. వారి మనసెపుడును వనవాసానంతరము కూడ, వనముల వైపే మళ్ళినది. వారు చేసిన ఋషిదర్శనములు, వారు చూచిన ఋషి ఆశ్రమములు రాజ భవనములను కూడ మరిపింపజేసినవి.

అరణ్యమును వనమని కూడ యందురు. అరణ్యమందలి ఉత్తమ విషయములన్నిటిని వనములుగ భావించవలెను. అసుర తత్త్వము నంతటిని అరణ్యముగ భావించవలెను. అసురములు, దివ్యములు అగు తత్త్వములు నగరమునందు గాని, అరణ్యమునందు గాని సమానముగనే యుండును. నగరమందలి అసురశక్తులు మానవ రూపములే ధరించి యుండును. అట్లే దివ్యశక్తులు కూడ. సృష్టియం దిరువురకును స్థానము కలదు. కనుక నిజమున కెచ్చట యున్నను ఒకటే. అభ్యాసము వలన నగరమెట్లు సుఖమిచ్చునో అట్లే అభ్యాసము వలన అరణ్యము కూడ సుఖము నిచ్చును. అరణ్య వాసమందు రాముడు పొందిన ప్రశాంతత, ఆహ్లాదము అతడు నగరమున పొందలేదు. అత్యధికముగ అనేకానేక ఋష్యాశ్రమములను దర్శించి, ఋషులతో సంభాషించి, అందలి జ్ఞానసారమును ఆస్వాదించుచు జీవించినవాడు రాముడు. కోరి రాక్షసులను చంపిన వాడు కాదు రాముడు. వెంటాడి చంపినవా డసలే కాదు. వెంటపడి అక్రమములకు పాల్పడినవారిని సంహరించి అసురశక్తులు మీరి ప్రవర్తించకుండునట్లు ప్రవర్తించినాడు. అసురశక్తు లుండకూడదన్న

భావన దుష్టమగు భావన. సృష్టియందు వసించుటకు అన్ని జీవులకును తగు సౌకర్యము సృష్టికర్త ఏర్పరచినాడు. అందరికిని హద్దు లేర్పరచి నాడు. **హద్దు మీరినపుడు శిక్షించుటయే కాని అసురశక్తులను నిర్మూలించుట ధర్మము కాదు. ఎవరి ధర్మము లందు వారున్నపుడు అట్టివారిని శిక్షించుట అధర్మము.** రాముడట్లు చేయలేదు.

# 73. రామాయణమునందు చార్వాక సిద్ధాంతము

దశరథుని పురోహితులలో జాబాలి ఒకడు. అతడు బ్రాహ్మణుడై యుండికూడ చార్వాకమతము నవలంబించెను. అతడు రామునితో తన మత సిద్ధాంతము నీవిధముగా వివరించినాడు. అది ఈ క్రింది విధముగ నున్నది.

1. ప్రయోజన రహితమగు ఆలోచన ఉండుట మంచిది కాదు.
2. ఈ లోకములో ఎవడికెవడు బంధువు కాదు.
3. ఎవ్వరును ఒకరి కొకరు ఉపకరించుట లేదు. తమ కుపయోగ పడు అంశములో భాగముగ ఇతరుల కుపయోగపడుట జరుగుచున్నది. తన కే ప్రయోజనము లేక ఎవ్వరును దీనిని అంగీకరింపరు.
4. పుట్టినవాడొక్కడే పుడుతున్నాడు. ఒంటరిగనే పోవుచున్నాడు. ఈ రెంటి మధ్య కాలమున తల్లిదండ్రులని, సోదరులని, కళత్రమని, బిడ్డలని, బంధువులని, మిత్రులని, శత్రులని తాత్కాలిక పరిచయస్తులతో శాశ్వత బంధమును పెనవేసు కొనుచు, భ్రమపడి జీవించుచున్నారు.
5. ఇతరులకొరకై ప్రాకులాడుట వ్యర్థము. అట్లు ప్రాకులాడుట పిచ్చితనము.

6. ఒకడికొకడు తండ్రి కాదు, కొడుకు కాదు. దీర్ఘప్రయాణమున వచ్చిపోవు ప్రయాణీకులతో మమకారమున పెనుగులాడుట వ్యర్థము. ప్రయాణమున సమకూర్చు వస్తువులు, ఇళ్ళు, చేరవచ్చు మనుషులు మహా ప్రస్థానమున తోడురావు. వచ్చు ఆసక్తి కూడ చూపరు. కనుక ఇతరములపై ఆసక్తి అజ్ఞానము.

7. రామా! నీవు రాజ్యమును వదలి అరణ్యమున కేగుట తగిన పని కాదు. అది తప్పుదారి. జన్మతః రాజువు. రాజ్యపాలనమే నీ రక్షణము. తండ్రికై అడవులకేగుట ప్రయోజన రహితము.

8. దశరథుడను పేరుగల జీవునకును, నీకును తండ్రి–తనయుల సంబంధము కేవలమొక తాత్కాలికమగు పాత్ర. అతడు నీకు తండ్రికాడు, నీవతడికి కుమారుడవు కాదు. అతడు వేరు, నీవు వేరు.

9. పురుషుని శుక్రము, స్త్రీ శోణితము కలసి మనుష లగు చున్నారు. శుక్రము తండ్రి, శోణితము తల్లి. అంతేగాని కౌసల్యాదశరథులు తలిదండ్రులు కారు. నీవు దశరథునికై వ్యర్థముగ బాధపడుచున్నావు. అతనితో నీ సంబంధితము సంకల్పితము.

10. చనిపోయినవారి కొరకు శ్రాద్ధములు కుమారులు చేయవలెనని కొందరు కల్పించిరి. చనిపోయిన తరువాత కూడ ఉన్నవారు, చనిపోయినవారి కొరకై చేయు శ్రమవలన వారి కేప్రయోజ నము జరుగదు.

11. శ్రాద్ధములన్నియు వ్యర్థమగు ఖర్చులే. ఇక్కడ మనము అన్నము

పెట్టిన అక్కడ చనిపోయినవాడు తినునా? అదే నిజమైనచో గ్రామాంతరము పోయిన తండ్రికొరకు కుమారుడు భుజించినచో తండ్రి ఆకలి తీరదు గదా!

12. దానము లివ్వవలెనని, దానితో పై లోకములు వశపరచుకొన వలెనని భావించుట దురాశ.

13. ఈ లోకములో అనుభవించినది తప్ప అటుపైన ఏమియు లేదని ఎరుగుము.

14. కనపడుచున్నది సత్యము. కనపడనిది సత్యము కాదు. భరతుని ప్రార్థన సత్యము. అతను రాజ్యపాలనమునకై నిన్నర్థించు చున్నాడు. కనపడని దశరథుని మాటకన్న, కనిపించిన భరతుని మాట పాలించుటలో సత్యాచరణ మున్నది.

# 74. రాముని హిత వాక్యములు

జాబాలి పలికిన నాస్తికమగు వాదమునకు రాముడీవిధముగ బదులిచ్చినాడు. ఇందు శాశ్వత ధర్మములు గోచరించును.

1. ప్రియము కలిగించునని అకార్యము చేయరాదు. చేయమని ప్రోత్సహించరాదు.
2. మానవుని యోగ్యాయోగ్యములు అతడి నడవడిని బట్టి తెలియును గాని, భాషణము బట్టి కాదు.
3. పవిత్రము, ప్రియము అగు భాషణము, సత్యముగా భావింపరాదు. సత్యమని భ్రమపడి అనుసరించరాదు.
4. పవిత్రము, మధురము అగు భాషణము కలిగి, ప్రవర్తనమునందు అట్టి పవిత్రత గోచరింపనిచో అట్టివాడు చెడును.
5. నడవడియే మానవుని ఎరుంగజేయును.
6. వేషభాషలు, బాహ్యశుచి వేరు, అంతఃశుచి వేరు. మదము, మాత్సర్యము, లోభము మోహము, మోసము ఇత్యాదివి లేని పురుషుడే పవిత్రుడు.
7. ఎవడు ధార్మికుడో, ఎవరు కాదో క్రియలయందు మాత్రమే తెలియగలదు.

8. ఒక మాటనిచ్చి దానికి కట్టు పడకుండుట అధర్మమగును. అట్టివాడు అసత్యమాడిన వాడితో సమానము.

9. సత్యమే పరమేశ్వరుడు, సత్యమును వీడిన వారిని శ్రీ(లక్ష్మి) కూడ వీడును.

10. లోకములను పాలించుటకుగాని, వంశమును ఉద్ధరించుటకు గాని, స్వర్గమును పొందుటకు గాని సత్యమే ప్రధానము. నేను వనవాసదీక్షను అంగీకరించి నిర్వర్తింతునని మాట ఇచ్చినాను. దానిని పాలించుట నా ధర్మము. అట్టి పాలనము రాజ్యము, కీర్తి, లక్ష్మి, యశస్సు కన్న ముఖ్యము.

11. ఇహమున చేసిన కర్మమందలి ధర్మమే పరమున ప్రకాశ మిచ్చునని ఆర్యులు తెలిపినారు. నేను దానిని విశ్వసించు వాడను. అట్లే జీవులకు పునర్జన్మలు గలవని కూడ ఆర్యులు తెలిపినారు. దానిని నేను విశ్వసించువాడను. ధర్మాధర్మములే సృష్టియందు జీవులకు ఆరోహణ అవరోహణలు కలిగించును. పదునాలుగు సంవత్సరములు వనవాసదీక్ష నాకందిన కర్తవ్యము. దానిని నిర్వర్తించుటయే నా ధర్మము, మరియొకటి కాదు.

# 75. రాజారాముడు

కైకేయి వరము, దశరథుని మాట మినహాయించినచో శ్రీరాముడు అయోధ్యకు రాజగుటలో ఎట్టి విఘ్నము లేదు. ప్రజలు రాముని రాజుగ కోరినారు. అంతఃపుర వాసులందరు అదియే వాంఛించినారు. దశరథుని మనసుయందు కూడ రాముడే తన వారసుడని భావించినాడు. మంత్రులందరును కూడ అట్లే భావించి నారు. వరమడిగిన కైకేయి కూడ రాముడు తిరిగి రావలెనని అడవిలో రాముని ప్రాధేయపడినది. భరతుడు ఏనాడు రాజ్యము నాశించలేదు.

ఒక రెండు రోజుల సంఘటన మినహాయించినచో రాముడే రాజు అన్నభావన అంతకుమునుపు, ఆ తరువాత కూడ విలసిల్లినది.

దశరథుడాడిన మాట ఒకటే కారణమై రామపట్టాభిషేకమునకు విఘ్నము కలిగినది. ఆ దశరథుని మాట అందరిని కట్టివేసినది. లోకక్షేమము కొరకై దశరథునిమాట విస్మరించ వచ్చునని అయోధ్యా పుర వాసులు, అంతఃపుర వాసులు, మంత్రులు, పురోహితులు, తల్లులు, సోదరులు రామునికి తెలిపిరి. వశిష్ఠుడు కూడ ఆ భావమును బలపరచెను. నిజమునకు రాముడు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషిక్తు డగుటకు ఎట్టి విఘ్నము లేదు. అందరును ప్రాధేయపడుట వలన తానట్లు చేసినచో తప్పుకాదని అందరి భావము.

కాని రాముని భావపరంపర మరియొక విధముగ నున్నది. అతని హృదయమందు తండ్రి ఇచ్చిన మాటయే ప్రధానముగ మెలిగినది. తండ్రిమాట ఒట్టిపోయినచో తండ్రికిగాని, అతని సంతతికి

గాని ఎట్టి శుభము కలుగదు. లోకక్షేమమునకు ఎట్టి ఆపద లేదని రాముని భావన. భరతుడు రాజ్యమునందుండగ రాజ్యక్షేమమున కేభంగము కలుగదు. శత్రువులెవ్వరును సాహసించి రాజ్యమున ప్రవేశింపలేరు. కనుక ఒక కొడుకు రాజ్యక్షేమమును చూచుచుండగ, మరియొక కొడుకు తండ్రి మాటను చెల్లించినచో పరలోకమునకేగిన తండ్రి సుఖించును. కనుక రాముడు వనవాసమునకే ఉద్యుక్తుడయ్యెను.

విచిత్రమేమనగ రాముని బదులు రామపాదుకలు రాజైనవి. పాదుకలే సింహాసనము నలంకరించినవి. పాదుకులకే రాజ ఛత్రము, రాజలాంఛనములు అలంకరింపబడినవి. పాదుకలే రాజ్యమేలినవి. దశరథుని తరువాత భరతుడు రాజ్యభిషిక్తుడు కాలేదు. శ్రీరాముడు తిరిగి వచ్చువరకు పాదుకలు పట్టాభిషిక్తమై రాజ్యము నేలుట మరి ఎప్పుడును ఎక్కడను జరుగలేదు. రామపాదుకలు రాజ్యమేలు చున్నపుడు వనవాసము చేయుచున్న రాముని రాజు అనవచ్చునా, లేదా? ఈ ప్రశ్నకు సమాధనము కూడ ఋషుల మాటలయందు దీటుగ వ్యక్తమైనది.

**“రామా! వనవాసానికి వచ్చినా నీవే మా రాజువు. ఈ వనము కూడ నీరాజ్యమందలి భాగమే. మేమందరము నీదేశ వాసులము. నీవయోధ్యలో నున్నను, వనములో నున్నను నీవే మమ్ములను కాపాడ వలసి యున్నది.”**

రామమహిమ ఎట్టిదో ఈ సందర్భమున తెలియుచున్నది. సర్వము పరిత్యజించిన రాముని వెంట రాజ్యము, ప్రజలు, ఋషులు పడియున్నారు. రామునే రాజుగ భావించి యున్నారు. అందువలన శ్రీరాముడు శాశ్వతముగ “రాజారాము”డైనాడు.

# 76. శ్రీరాముని వన ప్రవేశము

సుఖశాంతులతో జీవించుటకు ప్రతి ఒక్కరికిని అతని నడవడియే కారణమై యుండును. నడవడికి మానవుని బుద్ధి, స్వభావము, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, శరీరము ఆధారములై యున్నవి. బుద్ధియందు విచక్షణ యుండును. విచక్షణ ధర్మముపై ఆధారపడి యుండును. ధర్మము ఆచార్యుల నడవడియందు, ఉపదేశములందు యుండును. ఆచార్యులకు ప్రమాణము వేదము. జీవులకు ప్రమాణము ఆచార్యులు, వారి బోధనలు. ఆచార్యులనగా ధర్మము నెరిగి ఆచరించుచు, ఇతరులకు మార్గదర్శకముగ నుండువారు. అట్టివారి సాంగత్యమునందు, వారి సేవయందు మానవుని బుద్ధికి ధర్మముతో కూడిన విచక్షణ యుండును. అట్టి విచక్షణగల మానవుని బుద్ధిమంతుడందురు. బుద్ధిమంతుల జీవితము ధర్మము ననుసరించి సాగుచుండును.

ధర్మస్వరూపమును బుద్ధియందు దాల్చి ప్రవర్తింపనివారు అజ్ఞాన మావరించుటచే విచక్షణా రహితముగ మనసుకు తోచినట్లు ప్రవర్తింతురు. ఇంద్రియములు బాహ్యమందలి ఇంద్రియార్థములను ఆశించుచుండగ, మనస్సు ఆకర్షింపబడి విచక్షణా రహితముగ ప్రవర్తించుటచే అధర్మ మేర్పడును. శరీరావశ్యకతల కొరకు, ఇంద్రియ పరితృప్తి కొరకు జీవించుట వలన ధర్మము మరుగై అధర్మము పెరుగుచుండును. **ఇతరుల శ్రేయస్సుకన్న మన శ్రేయస్సు ముఖ్యమని**

**భావించుట అధర్మము. తన శ్రేయస్సుకన్న ఇతరుల శ్రేయస్సు ముఖ్యమని భావించుట ధర్మము.** తన శ్రేయస్సుకొరకు పనిచేయువాడు కూడ, శ్రేయస్సను పదమునకు అర్థము తెలియనివాడై యుండును. మనో ఇంద్రియముల శ్రేయస్సు తన శ్రేయస్సు కాజాలదు. ఆత్మ శ్రేయస్సే నిజమగు శ్రేయస్సు. మనోవ్యాపారము ఆత్మశ్రేయస్సునకు విరోధమై యున్నపుడు, ఆత్మకు శ్రేయస్సు లేదు. అజ్ఞానము వలన శరీర ఇంద్రియ మనోశ్రేయస్సే శ్రేయస్సుగా భావించి ఇతరులను పీడించుట, హింసించుట అసురత్వమగును. అట్టి అసురత్వముతో కూడిన వారు జీవించు జీవనము అరణ్యజీవనము. అనగా అగమ్య గోచర జీవనము. అట్టి అరణ్యమునందే గమ్యము గోచరమై, గమ్యము చేరుటకు తపస్సుచేయు తపస్విజనులు కూడ యుండుట సృష్టి చిత్రము. తపస్విజనులు తమ కొరకుగాక లోకశ్రేయస్సు నుద్దేశించి అనంతకాలము తపస్సునందు నిలచియుందురు. వారి శ్రేయస్సు కొరకు వారికి చింతలేదు. లోక శ్రేయస్సే వారి చింత.

లోకశ్రేయస్సుకోరు తపస్విజనులు, స్వీయ శ్రేయస్సుకోరు అసురజనులు గల దండక అరణ్యమున సీతాలక్ష్మణ సమేతుడై శ్రీరాముడు ప్రవేశించుట రామాయణమునందొక అద్భుత ఘట్టము. తమ శ్రేయస్సు కోరని ఋషుల ననుగ్రహించుటకు, వారి శ్రేయస్సును భంగము చేయు అసురులను నియంత్రించుటకు, అవసరమగుచో శిక్షించుటకు శ్రీరాముని అరణ్య ప్రవేశము నిర్దేశింపబడినది. **లోక శ్రేయస్సునుగోరు జీవులను రక్షించుకొనుట, స్వీయ శ్రేయస్సుకై ఇతరులను హింసించువారిని శిక్షించుట, నియంత్రించుట శ్రీమహా విష్ణువు కార్యము.** ఇందు మొదటివారు శరీరము ఆత్మకొరకే అని

తెలిసియుందురు. రెండవ తెగవారగు అసురులు శరీరము కొరకే ఆత్మయని భ్రమ పడుదురు. మొదటివారిది నిస్వార్థ జీవనము. రెండవ తెగవారిది స్వార్థజీవనము. వీరి నడుమ ఏర్పడు సంఘర్షణమునకు పరిష్కార మిచ్చుటకే దివ్యావతరణము. అదియే రాముని దండక వన ప్రవేశము.

# 77. జీవ స్వాతంత్ర్యము

తాను స్వతంత్రుడను భావము స్వార్థమునకు అటుపై అసురత్వమునకు దారితీయును. చైతన్యవంతుడగు తనకు తన మనో ఇంద్రియ శరీరములకు కూడ ఆధారమగు భగవంతుడున్నాడని అతని మూలముగనే తాను, తన శరీరము నిలచి యున్నదని జ్ఞప్తి కలిగి ధర్మము ననుసరించి జీవించుట వలన జీవనము రక్తి కట్టును. అట్టివాడు తాను స్వతంత్రుడను భావమును వదలి, చేతనుడగు తాను అచేతనమగు శరీరముతో భగవంతుని కొరకే జీవించుట శిష్టాచారము. భగవంతుని అధీనమున తనజీవితము నడచుచున్నదని భావించుచు, భగవత్సంకల్పమే తన సంకల్పముగ నిర్వర్తించుకొనుచు జీవనయాత్ర సాగించును.

"నేను సర్వ స్వతంత్రుడను" అను భావము పెల్లుబికినచో తన స్వరూపము తాను మరచును. తనలో తనను నియమించు వాడున్నాడని మరచును. చేయునది యంతా తానేయని భ్రమపడును. జీవితము తన ప్రీతి కొరకే అనెడి అజ్ఞాన మేర్పడును. అదియే అహంకారము. తన ప్రీతి కొరకు మాత్రమే జీవించువాడు తనకును, తన పరిసరములకును కూడ వినాశకారకు డగును. ఇట్టి వాని నుండి క్రమముగ అసుర భావములు విజృంభించును. అప్పుడు రజస్త మస్సులు పెల్లుబికి సత్వము మరుగై యుండును. ఇట్టి అసురత్వము నుండి వెనుకకు మరలుటకు జీవునకు వలసినది సత్వగుణము.

**సత్వగుణము తనయందు పుట్టి పెరుగుటకు పెద్దల సహవాసము ప్రధానమగు ఉపకరణము.** పెద్దల సహవాసమున సత్వము ఏర్పడి పెరుగుచున్నపుడు జీవుని వర్తనమున ఈ దిగువ లక్షణము లేర్పడు చుండును.

1) శుచి, శౌచము (నిర్మలత్వము)

2) వెలుగునందు, జ్ఞానమునందు ఆసక్తి

3) వాక్శుద్ధి

4) అహింస

5) ఇంద్రియములందు అప్రమత్తత

6) పరిసరములందు పారిశుధ్యము

7) పనులయందు ప్రశాంతత

8) అధ్యయనము, ఆచరణము

9) ద్వేషబుద్ధి నశించుట

10) ఈశ్వరుని యందు అనురక్తి, భక్తి.

# 78. విరాధుడు

విరాధుడొక గంధర్వుడు. అతని నిజనామము తుంబురుడు. పతనావస్థ చెందిన గంధర్వుడు బ్రహ్మరాక్షస రూపమున విరాధుడై నాడు. గంధర్వలోకములో ఉండే తుంబురుడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి ఏ ఆయుధము చేతను వధింపబడకుండునట్లుగ వరము పొందినవాడు. అతనికి విధివశాత్తు దేవలోకమందలి రంభయందాసక్తి కలిగినది. తపస్సు చేసి బ్రహ్మదేవుని మెప్పించినను అతడు కామమును జయించలేక కామవశుడైనాడు. కాముకులకు గంధర్వలోకమున నుండు అర్హత లేకపోవుటచే కుబేరుడతనికి శాపమిచ్చినాడు. అది కారణముగ ఘోరాకారముతో దండక వనమున బ్రహ్మరాక్షసుడై వసించినాడు. అతడి ఘోరమగు ఆకారమునకు ఆహార నిమిత్తమై దండక వనమందలి ప్రాణికోటిని వధించి భక్షించుచు నుండెడివాడు. అతడికి శాప విమోచనము కూడ కుబేరుడే తెలిపినాడు. "రామునితో యుద్ధము నందు వధింపబడుట వలన నీ రాక్షస రూపము నుండి విమోచనము చెంది మరల సువర్గము చేరుదువు" అని తెలిపినాడు.

విరాధుని వధ అతని శాపవిమోచనమునకే, విరాధ వధ అహల్యను స్పృశించుట వంటిదే. రామపాదముచే స్పృశింపబడి అహల్య శాపవిమోచనము నొందినది. రామహస్తముచే వధింపబడి గంధర్వుడు అగు తుంబురుడు మరల స్వస్థానమును పొందినాడు. బ్రహ్మవర ప్రసాదియైన తుంబురుడు కామము వలన పతనము చెంది,

రామునివలన స్వస్థుడైనాడు. అహల్యకూడ కామము కారణముగనే శాపము నొంది రామ స్పర్శవలన సచేతనమైనది. రావణాసురుడు కూడ కామముచే పీడింపబడి రామునిచే రక్షింపబడినాడు.

కాముని జయించుటకు రాముని భక్తి నిజమగు ఉపాయము. కామదహనుడగు శివుడు కూడ రామస్మరణము చేయుచు నుండును. సృష్టియంతయు కామేశ్వరీ – కామేశ్వరుల క్రీడారంగమే. క్రీడా రంగమున తగులుకొనక, క్రీడింపగలుగుట నిజమగు నైపుణ్యము. అట్టి నైపుణ్యము రామశబ్దమున నున్నది. రాముడున్నచోట కాముడతిక్ర మించడు. **అతిక్రమించని కామము అనుభవమును, అనుభూతిని ఇచ్చును. సృష్టియందు క్రీడించుటకు, క్రీడయందు రమించుటకు, క్రీడలో తరించుటకు రామనామమే ఉపాయము. రామనామమే తరణోపాయము.**

# 79. తారకము

రామాయణము నందు ధర్మముతో కూడని కామము ఎన్ని విపత్తులను కలిగించునో తెలుపుటకు అనేక ఉదంతము లీయబడినవి. కామము విషయమున ధర్మబుద్ధి అత్యావశ్యకమని, అనునిత్యము రాముని నడవడిక యందు గోచరించును. శ్రీరాముడు ధర్మ స్వరూపుడు. "ధర్మార్థ కామములు " అను పదము భారతీయులకు తెలియనిది కాదు. ఆచరించుటలోనే బలహీనత జీవుల కేర్పడుచున్నది. ధర్మముతో కూడని అర్ధము (సంపాదన) పతనహేతువు. ధర్మముతో కూడని కామము కూడ పతన హేతువే. ధర్మము తెలియక అర్ధ కామములందు నిమగ్నుడగువాడు ఇక్కట్లపాలగుట సామాన్యముగ జరుగుచుండును. కనుక ధర్మము తెలియక జీవితమున ప్రవేశించుట అవివేకము. ధర్మమునందాసక్తి చిన్నతనముననే కలిగినచో దాని నాచరించు బుద్ధి ఏర్పడుట కవకాశ మున్నది.

ధర్మమెరిగిన వారు కూడ ప్రవర్తన యందు అవకతవకలు చూపినవారు అన్ని లోకములయందు ఉండుట ఒక విచిత్రము. ఇంద్రలోక పాలకుడగు దేవేంద్రుడే అనేకమార్లు ఆకర్షణలకు లొంగి అధర్మ మాచరించెను. దిక్పాలకులు కూడ అధర్మ ప్రవర్తనమున భంగపడిన సందర్భము లున్నవి. సృష్టియందు ఉన్నత, నిమ్న లోకము లలో ధర్మాధర్మములు గోచరించు చుండునని విరాధుని కథ తెలుపు చున్నది. గంధర్వలోక వాసియగు తుంబురుడు రంభ నాశించెననగ, ఇతరులు సృష్టియాకర్షణలకు లోనుకారని చెప్పుటకు వీలు లేదు.

రాక్షసులు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు, దేవతలు, మానవులు ఇట్లన్ని జాతులయందును ధర్మము తప్పిన కథలున్నవి. ధర్మము తప్పక వర్తించుట మరి ఎట్లు సాధ్యము? ఋషులుసైతము ధర్మము తప్పిన సందర్భము లుండగ మరి యుపాయ మేమి గలదు.

రాముడు నిరంతర ధర్మ పరిపాలనలో ఎట్లు కృతకృత్యుడు కాగలిగెను. అర్ధకామములకు అతీతమైన తత్త్వము అనుస్మరణ చేయుటవలననే సాధ్యపడును. శ్రీరాము డనునిత్యము శివతత్త్వము ననుస్మరణము చేయుచు ధర్మమున నిలచినాడు. పరదైవతమగు శివుడు కూడ రామస్మరణము చేయుచు తరించు మార్గమును జీవుల కుపదేశించు చున్నాడు.

**దైవస్మరణము ధర్మాచరణమగు దారి చూపును. ధర్మాచరణము దైవమునకు దారి చూపును. ధర్మాచరణము లేని దైవారాధన, దైవారాధన లేని ధర్మాచరణము అసంపూర్ణములే.** దైవము, ధర్మము నాణెమునకు బొమ్మ, బొరుసువంటివి. ధర్మమాచరించుచు దైవము నారాధన చేయనివాడు అహంకార వశుడగుటకు అవకావము మెండు. దైవారాధనముననే అహంకారము పరిష్కరింపబడును. కనుక దైవారాధనతో కూడిన ధర్మాచరణము రామాయణము బోధించు చున్నది.

శ్రీరాముడు నిత్యదేవతార్చన గావించినట్లుగ అయోధ్యకాండ యందే తెలుపబడినది. దైవము నారాధించుచు, ధర్మము నాచరించుట రాముడు చూపిన దారి. అతడే జీవుల కాదర్శమూర్తి. పరమ శివునికి కూడ రాముడు ఆరాధ్యుడైనాడు. **రామస్మరణము ధర్మాచరణమునకు ఊపిరి నిచ్చును. అతి సూక్ష్మమగు ధర్మము, బుద్ధియందు ప్రచోదన మగుటకు రామమంత్రము చాలును.**

# 80. శాపము - అనుగ్రహము

మానవుడు కర్తవ్య విముఖుడైనపుడు, ధర్మాచరణము విడిచినపుడు అతడు తన భవిష్యత్తును అత్యంత క్లిష్ట పరిస్థితులలోనికి నెట్టుకొనును. అధర్మాచరణము శిక్షింపబడనిచో భవిష్యత్తు దుర్భరమగును. తనకు తానుగ ధర్మమును విడచి వర్తించువారిని ప్రభువు లేక పాలకులు శిక్షించుట అట్టి వాని అదృష్టము. శిక్షింపబడకుండినచో చేసిన అధర్మమునకు ఫలము తీవ్రమై బాధించును. తనకు తానుగ వర్తనమును మార్చుకొని ధర్మాసక్తుడై, ధర్మమును నిర్వర్తించుచున్నను, వెనుక చేసిన అధర్మములగు కార్యముల ఫలము భవిష్యత్తున పీడించక మానవు.

**దివ్యపురుషులు, ఋషులు తమ చెంతనున్న వారి ప్రవర్తనమున అధర్మము గోచరించినపుడు వెనువెంటనే శిక్షను విధింతురు. అట్లు శిక్షించుట ముమ్మాటికి ఒక అనుగ్రహము. రక్షించుటకే ఋషులు శిక్షింతురు. శాపము నిత్తురు. అట్లు చేయనిచో భవిష్యత్తున కలుగు ఆపదలు మెండై యుండును.**

అహల్యాదేవిని గౌతమ మహర్షి శపించుట వలన ఆమె రామానుగ్రహమును పొంది పవిత్రమూర్తిగ నేటికిని కీర్తించబడుచున్నది. గౌతముని శాపము రామ స్పర్శకు త్రోవ చూపినది. అహల్య పునీతయైనది. అట్లు శాపగ్రస్త కానిచో, తదనుగుణమైన శిక్షణము ననుభవింపనిచో అహల్య శాశ్వత కీర్తి పదమును పొంది యుండెడిది కాదు.

అట్లే విరాధుని కథ కూడ ఈ శాశ్వత ధర్మ సూత్రమును ఆవిష్కరించుచున్నది. విరాధుడు అత్యుత్తమమగు గంధర్వలోకవాసి. తుంబురుడను నామముతో లోకముల కతీతమైన గంధర్వ లోకమును తన పూర్వ పుణ్యముచే, తపస్సుచే పొందినాడు. పరస్త్రీ వాంఛ కారణముగ కుబేరుని కొలువున ప్రమత్తుడై వర్తించు చుండగ దానిని గమనించిన కుబేరుడు శపించి, తన అనుచరుని రక్షించుకొనినాడు. అట్లు శపించకుండినచో రంభాసక్తుడైన తుంబురుడు పతనము చెంది అనేకానేక జన్మములు పొందవలసి యుండెడిది. అట్లుకాక శాప వశమున బ్రహ్మరాక్షసుడై సీతమ్మను కాంక్షించి రామలక్ష్మణులచే కరములను కోల్పోయి, రామ పాదస్పర్శచే పునీతుడైనాడు. హుటా హుటిని మరల గంధర్వలోకము చేరి కుబేరుని కొలువున నియమితుడైనాడు.

**మహాత్ముల శాపములు వరములే. వారు శపించుట ఉద్ధరించుట కొరకే.** సనకసనందనాదులు జయవిజయులను శపించుట కారణముగ జయవిజయులు శ్రీమహా విష్ణువు హృదయ మును చేరిరి. ఋషులకు మునులకు ఆగ్రహము కలుగుట దైవికము. నిగ్రహానుగ్రహ సమర్థులైన ఋషులు కోపించుట, శపించుట సామాన్య మగు మనస్సునకు అవివేకముగ తోచును. ఋషుల వింత ప్రవర్తనలో దైవానుగ్రహమును చూచుట బుద్ధిమంతులకు మాత్రమే సాధ్యపడును.

**ప్రవర్తనమున అధర్మము దొరలినపుడు శిక్షను ప్రభువు దగ్గర గాని, గురువు దగ్గర గాని కోరుట అత్యుత్తమమని** మహా భారతమున వేదవ్యాస మహర్షి తెలిపినాడు. అట్టి ఉత్తమమైన ధర్మము నాచరించు వారు అరుదుగ నుందురు.

# 81. మృత దేహ సంస్కరణ

శ్రీరాముని జీవితము అడుగడుగున ఆదర్శనీయమై గోచరించును. మరణించిన వారి యెడల శ్రీరాముడు చూపు శ్రద్ధ, బాధ్యత అమితాశ్చర్యము కలిగించును. తండ్రి మరణించిన వార్త వినిన రాముడు పితృ కర్మలు నిర్వర్తించినాడు. బ్రహ్మరాక్షసుడైన విరాధుని అతడి కోరిక మేరకు ఒక గుంటను త్రవ్వి అందు పాతిపెట్టి విరాధునికి పుణ్యలోక ప్రాప్తి కలిగించినాడు. రాక్షస శరీరములను పాతిపెట్టుటయే ధర్మమని అట్లు గావించినాడు. అట్లే జటాయువు మరణింపగ అతడికి దహనక్రియల నొనర్చినాడు. వాలిని సంహరించి నపుడు సుగ్రీవ, అంగదులచే శాస్త్రోక్తముగ వాలి దేహమునకు కర్మకాండను అమర్చినాడు. లోకకంటకుడైన రావణుని ఎడల కూడ అట్టి శ్రద్ధయే కనపరచినాడు.

ప్రేత సంస్కారము ఒక మహత్తరమగు పుణ్యకార్యము. అనాథ ప్రేతలను సంస్కరించుట ఉత్తమోత్తమమగు ధర్మముగ రాముడు నిర్వర్తించి చూపించినాడు. విరాధునికి మరణానంతర సంస్కారము చేయుటకు ఎవ్వరును లేరు. జటాయువునకు కూడ అంతే. వారిరువురికిని తానే స్వయముగ సంస్కార కాండను నిర్వర్తించినాడు. వాలి విషయమున సుగ్రీవ అంగదులచే సశాస్త్రీయముగ, ప్రత్యక్షముగ తాను నిలచి నిర్వర్తింప చేసినాడు. రావణుని విషయమున విభీషణునిచే కర్మ కార్యము నిర్వర్తింపజేసినాడు. జీవుడు విసర్జించిన

దేహమునకు విలువ ఎట్టిదో తెలిసి దానిని సముచితముగ పరిష్కరించుట శ్రీరాముడు చూపిన మార్గము. జీవికి ఆశ్రయముగ నిలబడినటువంటి దేహము దివ్యమని గుర్తించుటకు విశిష్టమగు జ్ఞానము వలయును. మృత దేహమును గౌరవించి తగు విధముగ పరిష్కరించుట మానవుల బాధ్యతయై యున్నది. అట్టి సందర్భములో చూపవలసిన శ్రద్ధా భక్తులకు శ్రీరాముడే ఆదర్శము. కలియుగమున తల్లిదండ్రుల ఎడల కూడ ఇట్టి శ్రద్ధ కరువగుచుండగ సమస్త జీవకోటి యందు ఇట్టి బాధ్యత మానవున కున్నదని తెలియచెప్పు శ్రీరాముని ప్రవర్తనకు సాటియగు ధర్మ ప్రవర్తనము ఎచ్చటను గోచరించదు. **శ్రీరామునితో సరిపోల్చగల దైవము గాని, మానవుడు గాని, మరి ఏ జీవుడు గాని లేడనుట అతిశయోక్తి కాదు. శ్రీరామునికి సాటి శ్రీరాముడే!**

# 82. రాముని దివ్యదృష్టి

బ్రహ్మరాక్షసుడగు విరాధుడు శ్రీరాముని శరభంగుని ఆశ్రమమునకు చేరవలసినదిగ సందేశమిచ్చినాడు. శ్రీరాముడు సీతా లక్ష్మణులతో కలసి శరభంగుని ఆశ్రమము దిశగ నడక సాగించినాడు. శరభంగుడు తపస్వియని, సూర్య సమాన తేజస్వియని, శ్రీరామునకు మేలు చేయగలవాడని తెలిపినాడు. రాముడు విరాధుని సందేశమును దివ్య సందేశముగ గ్రహించినాడు. తన భార్యను ఎత్తుకొని పోవుచున్న బ్రహ్మరాక్షసి విరాధుని భుజములను ఖండించి సీతమ్మను రక్షించుకొన్న రాముడు, తనయందపరాధము చేసిన విరాధుని సలహాను వినుట, అంగీకరించుట, ఆచరించుట ఇతర మానవులు చేయగలిగిన పని కాదు. తనను కష్టపెట్టి, తనచే భంగపడినవాడు తెలిపిన విషయము ఎట్టిదైనను మానవు లంగీకరింప లేరు. అందున శాపగ్రస్తుడై, రాక్షసుడై వికృత కృత్యములను నిర్వర్తించువాడు తెలిపిన విషయములు కూడ శ్రద్ధతో ఆలకించుట, యుక్తాయుక్తములను విచారించుట, అనుసరించుట అనితర సాధ్యము. హితుల బోధలే పెడచెవిన పెట్టువారు మానవులు. అహితము గావించి, యుద్ధము చేసి ఓడిన వెనుక ఒక పరాజితుడు తెలిపిన మాటలను లక్ష్య పెట్టుటలో రాముని వినయము, వివేకము, నమ్రత దివ్యవాణిని విను దృక్పథము గోచరించును. **ఎవరు ఏమి చెప్పినను పరిపూర్ణముగ వినుట సంస్కారవంతుని లక్షణము. విని వివరించుకొనుట, విచక్షణతో**

**నిర్ణయము చేయుట విద్యావంతుని లక్షణము. వినపడు విషయము నందలి దివ్యమగు సందేశము లందుకొనుట సూక్ష్మగ్రాహి లక్షణము. మానవులు తప్పక నేర్వవలసిన లక్షణమిది.** రాముని గుణ ప్రశంస కన్న, రాముని నడత గ్రహించి అనుసరించుట ఉత్తమము. రాముడు నడచినట్లు నడచిన తీరున తానును నడచినపుడు, తాను రామభక్తుడని భావించుట సమంజసము. కేవలము రామభజన వలన ఉద్ధారణము కలుగదు. రామభజన అనువర్తనమునకు వలసిన స్ఫూర్తి నీయవలెను. అట్టి స్ఫూర్తితో రాము ననుసరించవలెను. వినుట, అనుసరించుట నేర్వవలెను.

శ్రీరాముడు విరాధుని సలహా ననుసరించి శరభంగ ముని ఆశ్రమము వైపునకు నడచు టారంభించినాడు. అతని మనసున విరాధుని పలుకులు పునః పునః వినిపించుచు నున్నవి. శరభంగుడు ధర్మాత్ముడు. గొప్ప తపస్వి. సూర్యునితో సమానమగు తేజస్సు కలవాడు. తాను సూర్యవంశజుడు. తాను చూడబోవు మునీంద్రుడు సూర్య సమాన తేజస్సు కలవాడు. అట్టి మునిని దర్శించుట మహద్భాగ్యము అని శ్రీరాముడు భావించినాడు. శరభంగుని గూర్చి భావన చేయుచు నుండగ అతడు దేవతలవంటి ప్రభావము కలవాడని, బ్రహ్మ సాక్షాత్కారము కూడ పొందినవాడని శ్రీరాముని కవగతమైనది.

మునుల వద్దకు, మహాత్ముల వద్దకు పయనమై పోవుచున్నపుడు వారిని గూర్చిన విశేష గుణములను మననము చేయుట రాముడు చూపిన ధర్మమని తెలియవలెను. **పుణ్యక్షేత్ర దర్శనమునకు గాని, సద్గురు దర్శనమునకు గాని చనుచు, ఇతరమగు భాషణములు చేయక, గమ్య స్థానమున దర్శింపబడు చైతన్య విలాసమును కీర్తించుట,**

**ప్రశంసించుట, ధ్యానించుట యిత్యాదివి బుద్ధిమంతులు చేయవలసిన పని.** ప్రయాణ ప్రారంభముననే దర్శనము చేయబోవు తత్త్వమును చింతించుట, ప్రార్థించుట, మననము చేయుట ఉపాసించుట యిత్యాదివి ముఖ్య లక్షణములు. శ్రీరాముడట్లే గావించినాడు.

అట్టి దృష్టితో శ్రీరాముడు దండక అరణ్యమున నడచుచుండగ, శరభంగముని ఆశ్రమ ప్రాంతమున రాముని కొక అద్భుతమగు దృశ్యము గోచరించినది. అది సూక్ష్మ దర్శనము. యాత్రికులు కూడ యాత్ర యందు పరిపూర్ణముగ నిమగ్నమైన మనస్సు గలవారైనచో, ఆడబోవు తీర్థ మెదురవునట్లు మున్ముందుగనే శుభ సంకేతములు, శుభ దర్శనములు, దివ్యానుభూతులు కలుగును. రాముని కట్లే జరిగినవి. అతనికి ముని ఆశ్రమ ప్రాంతములో ఆకాశము నుండి ఒక దివ్యతేజుడు రథము దిగి ముని ఆశ్రమము నందు ప్రవేశించు చున్నట్లుగ దర్శనమైనది. శ్రద్ధా భక్తులతో యాత్ర చేయువారికి పుణ్య క్షేత్రము, తీర్థము చేరక మునుపే దివ్య దర్శనము, స్పర్శనము, భాషణము జరుగుట అతిశయోక్తి కాదు.

శ్రీరాముడు వినుట యందు, చూచుట యందు ప్రత్యేకమగు శ్రద్ధ కలవాడు. అట్టి శ్రద్ధ వలన సూక్ష్మ శ్రవణము, సూక్ష్మ దృష్టి ఏర్పడును. రాముని నడతనుండి ఈ గుణములను అంది పుచ్చు కొనుట రామాయణము పఠించు వారికి ఆవశ్యకమై యున్నది. ఇట్టి దృక్పథముతో పవిత్ర గ్రంథములను చదువుట, వినుట గావించినచో గ్రంథస్తమైన దివ్యత్వము వైవిధ్యముతో కూడిన దర్శనములను అందించుచు ప్రోత్సహించును. ఇట్టి చిన్న చిన్న రహస్యములు పెద్దవికాసము కలిగింప గలవు.

# 83. శరభంగుని అపరిగ్రహము

భగవద్భక్తి కోరువారు, యోగసాధన చేయువారు, సత్య జ్ఞానమును పొందదలచిన వారు, వైరాగ్య మవలంబించు వారు అపరిగ్రహమను కల్యాణగుణము నుపాసింపవలెను.

**అపరిగ్రహ మనగ ఇతరులు తమకు ఇచ్చు విలువైన వస్తువులను గ్రహింపకుండుట.** ఇతరుల నుండి మనమేమి గ్రహించినను వారికి మనము ఋణపడి యుందుము. ఋణము పెరుగుకొలది భక్తి జ్ఞాన వైరాగ్య యోగములు తరుగుట తథ్యము. పుచ్చుకొనుటలో తెలివి లేదు. ఇచ్చుకొనుటయే నిజమగు తెలివి. శారీరకముగ గాని, ఇంద్రియపరముగ గాని, మనసుతోగాని, బుద్ధితోగాని, జ్ఞానముతో గాని, తపస్సుతో గాని, పదార్థముతోగాని ఇతరులకు సహాయ సహకారము లందించుట సంస్కారవంతుల లక్షణములు. ఇతరులకు సహాయ సహకారము లొనర్చినపుడు వారు కృతజ్ఞతా పూర్వకముగ ఏమైనను భక్తి శ్రద్ధలతో అందించినపుడు అందుకొనవచ్చునుగాని, ఏ సహాయ సహకారములు అందింపక ఇతరుల నుండి సహకారము పొందుట ఋణమునకు దారితీయును. ఊరకే పొందినవి బంధ కారణము లగును. పతన కారణములు కూడ కాగలవు.

శ్రీరాముడు శరభంగ మహర్షి ఆశ్రమమునకు చని సీతా లక్ష్మణులతో సహా ఆ మహర్షికి పాదాభివందనము గావించినాడు.

అంతకు పూర్వమే శరభంగుని కలియుటకు, స్వర్గ లోకమున కాహ్వానించుటకు దేవేంద్రుడు వచ్చినట్లు కూడ రాముడు గమనించినాడు. దేవతా సమూహముతో కూడి దేవేంద్రుడు శరభంగుని ఆశ్రమమునకు చేరి, తాను పాదచారియై శరభంగముని ఆశ్రమము ప్రవేశించి, శరభంగుని ఊర్ధ్వ లోకముల కాహ్వానించినాడు. శ్రీరాముని రాకను గమనించిన దేవేంద్రుడు శరభంగుని హెచ్చరించి త్వరితముగ నిష్క్రమించినాడు. ఇదియంతయు దివ్యదృష్టితో తిలకించిన శ్రీరాముడు సీతా లక్ష్మణులకు కూడ దేవేంద్ర దర్శనమునకు తోడ్పడినాడు. శరభంగ మునిని "వచ్చినవాడు దేవేంద్రుడే కదా" అని ప్రశ్నించినాడు.

మహర్షి "ఔను. అతడు దేవేంద్రుడే. నన్ను బ్రహ్మ లోకమునకు కొనిపోవుటకు వచ్చినాడు. ఇంతలో నీవు వచ్చుచున్నట్లు నాకు తెలిసినది. దిగివచ్చిన బ్రహ్మమును చూడక, బ్రహ్మలోకమునకేగుట అవివేకమే కదా! బ్రహ్మము రాముడై, రామబ్రహ్మమై నా ఆశ్రమమున కేతెంచుచుండ దేవేంద్రుడు వచ్చినాడని, రథము తెచ్చినాడని, దేవతలు కూడ వచ్చినారని నేను బ్రహ్మలోకమున కెట్లేగ గలను? నీవు పరమ ధార్మికుడవు. మహాత్ముడవు. నిన్ను కలుసుకొన్న తరువాతనే బ్రహ్మ లోకమునకు పోవచ్చును" అని చెప్పినాడు.

శ్రీరాముడు శరభంగుని నిబ్బరతకు నిశ్చలతకు లోలోపల చాల హర్షించినాడు. నిజమునకు బ్రహ్మ మెక్కడ లేదు? బ్రహ్మము నందే అంతయు ఉన్నది. అట్టి బ్రహ్మమునందు స్థిర నివాస మేర్పరచు కొనుటయే బ్రహ్మజ్ఞులు చేయు పని. సర్వవ్యాపియైన బ్రహ్మమునందు సర్వకాల సర్వావస్థల యందుండుటయే బ్రహ్మత్వము. ఎచటనో

బ్రహ్మలోక మున్నదని భావించుట అవివేకము. ఆశచూపుట ఇంద్రుని పని. ఆశపడకుండుట ముని చూపిన జ్ఞానము. ఆశపడు వారికి బ్రహ్మముండదు. ఉన్నచోటనే బ్రహ్మ మున్నాడు. అది శరభంగుని స్థితి. అత డింద్రు డందించిన అవకాశమును పరిగ్రహింపలేదు. ఇది అపరిగ్రహమునకు పరాకాష్ఠ.

# 84. రాముని అపరిగ్రహము

శ్రీరాముని చూచిన శరభంగ మహర్షి హృదయానందభరితుడై పొంగిపోయినాడు. బ్రహ్మమే రూపము దాల్చి వచ్చినట్లు భావించినాడు. మహోగ్ర తపస్సు చేసి అతడు పొందిన అక్షయమగు స్వర్గలోక బ్రహ్మలోక భోగ భూములను శ్రీరాముని కిచ్చుటకు నిశ్చయించుకొనినాడు. స్వీకరించమని రామునికి తెలిపినాడు.

అక్షయమగు భోగములు తపస్సుచే పొందవచ్చును. కాని అట్టి తపస్సు నిర్వహించుట సులభసాధ్యము కాదు. వేల సంవత్సరముల తపో కృషిచే లభించినవి స్వర్గలోక భోగములు. అంతకు వందరెట్లు తపస్సు చేసిననే గాని బ్రహ్మలోక భోగములు లభింపవు. తపస్సు ద్వారా బ్రహ్మముచే పొందబడిన వాడగుటచే శరభంగ మహర్షికి భోగములపై ఆసక్తి లేదు. బ్రహ్మలోక భోగములపై కూడ ఆసక్తి లేదు. బ్రహ్మమే తానైన వానికి ఇతర చింతన లుండవు. ఇట్టివా రరుదుగ నుందురు. స్వర్గలోకములో దేవేంద్రునితో కూర్చుండ వలెనని, బ్రహ్మలోకములో చతుర్ముఖ బ్రహ్మ సరసన కూర్చుండవలెనని కోరు రాజర్షులు, బ్రహ్మర్షులు ఎందరో కలరు. కాని శరభంగుడు బ్రహ్మమే తానగుట నిశ్చయించుకొనినాడు. అనగ అపునరావృత్త మార్గము నెంచుకొనినవాడు. శ్రీరాముని యందు మునికి కలిగిన వాత్సల్యమే ఆయా భోగములను రాముని కిచ్చుటకు ప్రోత్సహించినవి. శ్రీరామునికి అయోధ్యా భూభాగము నిరాకరింపబడినది గదా!

నిమ్నమగు భూమి భాగము కన్న సర్వలోక బ్రహ్మలోక భూభాగములు సర్వోత్కృష్టమైనవి కదా! శ్రీరామునకు, సీతాలక్ష్మణులకు ఎట్టి లోటును ఉండరాదని మహర్షి ఆ దానమునకు ఉపక్రమించెను.

లోకములో ఎవరైనను పై తెలిపిన దానములను సంతోషముగ స్వీకరింతురు. కాని శ్రీరాముడు అట్లు చేయలేదు. శ్రీరాముని యందు కణకణమున అపరిగ్రహ తత్త్వమున్నది. అయోధ్యా రాజ్యమునే అతడు గ్రహింపలేదు. అతడు స్వయముగ బ్రహ్మమే. ధర్మము నిర్వర్తించుటకు రూపుకట్టుకొని వచ్చినవాడు. అందువలన మందస్మితముతో సున్నిత ముగ శరభంగు నుద్దేశించి ఇట్లు ప్రసంగించినాడు. "మహర్షీ! నీ వాత్సల్యమునకు నేను కృతజ్ఞుడను. వలసినచో స్వయముగ తపస్సు చేసి స్వర్గలోక బ్రహ్మలోకములను పొందుదునే గాని పరులనుండి అట్టి లోకములను గాని, భోగములను గాని స్వీకరింపజాలను."

**అపరిగ్రహము ఒక పవిత్ర వ్రతము. జీవుడు తన్నుతాను సంస్కరించుకొనుటలో ఉపకరించు పది వ్రతములలో అపరిగ్రహ మొకటి. అపరిగ్రహము నేర్వనివాడు జనన మరణ చక్రభ్రమణమున అనంత కాలము పరిభ్రమించుచునే యుండవలెను. ఇది సత్యము.**

# 85. శరభంగ మహర్షి

శరభంగ మహర్షిని గూర్చి విరాధుడు చేసిన ప్రశంస స్మరింప దగినది. విరాధుని వచనములలో శరభంగుని దివ్యగుణములు తెలుప బడినవి. ఇట్టి గుణములు ప్రతి మానవుడును పొందుటకు ప్రయత్నింప వలెను. సద్గుణ సముపార్జనమే మానవ జీవిత ప్రయోజనమై యుండ వలెను. భరద్వాజుని తరువాత శ్రీరాముడు దర్శించిన ఋషి శరభంగుడు. అతని గుణము లిట్లు పేర్కొనబడినవి.

1) ధర్మాత్ముడు 2) తపస్వి 3) సూర్యసమాన తేజస్వి 4) అగ్నిహోత్ర ఉపాసకుడు 5) ఆత్మ సాక్షాత్కారము పొందినవాడు 6) బ్రహ్మలోక ప్రాప్తిని సిద్ధించుకొనినవాడు 7) దేవేంద్రాది సర్వదేవతల స్నేహము అనుకూల్యము గలవాడు. 8) పరతత్త్వ మెరిగినవాడు. (పరతత్త్వమే రామునిగ భూమిపై నడయాడుచున్నాడని తెలిసి, రాముని దర్శించి, భాషించి అటుపై వనముల కేగుటకు నిశ్చయించుకొనిన వాడు శరభంగ మహర్షి).

పై ఎనిమిది దివ్య గుణములు గల శరభంగ మహర్షి పార్థివ దేహమొక నివాసముగ వసించుచున్న తేజోమయ రూపుడు. ఋషు లందరును ఇట్టివారే. ధర్మాచరణము, ఉపాసనము, తపస్సు ఆధారముగ దేవలోక బ్రహ్మలోకములను సిద్ధించుకొని, ఇహలోకమున పరము ననుభవించుచు, కాలమును దేశమును బట్టి తమవంతు కర్తవ్యములను నిర్వర్తించువారే ఋషులు. దేని యందును ఎట్టి

వ్యామోహము లేక అహంకార వర్జితులై దివ్య సంకల్పము ననుసరించి సృష్టి యందు వర్తించు చుందురు.

శరభంగ మహర్షి పృథివి నుండి నిష్క్రమణము ఒక అద్భుత ఘట్టము. ఆ మహర్షి ఇహముననే పరమును అనుభవించుచు నుండగ అతనిని పరమునకు కొనిపోవుటకు దేవేంద్రుడే పరివారముతోను, రథముతోను కూడి వచ్చినాడు. కాని రాముని చూచి అటుపై స్వయముగ వత్తునని శరభంగుడు తెలుపుటలో ఋషుల ధీరగుణము ప్రదర్శించినాడు. **ఋషులు ధీరులు, నిరపేక్షులు, ఆత్మారాములు. వారే ఇతరులకు ఆధారము కాని వారెవరి పైనను ఆధారపడరు.** రాముని దర్శించిన శరభంగ మహర్షి అటుపై సీతారామ లక్ష్మణుల సాక్షిగ అగ్నిహోత్రమును జ్వలింపజేసి, ఆజ్యముతో ప్రజ్వలింపజేసి అందు ప్రవేశించి తన నివాసమైన దేహమును దగ్ధము గావించి తేజోమయ రూపముతో, అమితమగు కాంతితో చితి నుండి ఊర్ధ్వముగ పయనించినాడు. బ్రహ్మలోకమున బ్రహ్మదేవుడు, బ్రహ్మ లోక వాసులు అతనిని సాదరముగ ఆహ్వానించినారు. దేహమును పరిత్యజించుటకు ఇది ఉత్తమోత్తమ మగు ఉదాహరణము.

**దేహమునందు వసించుట, ధర్మము నాచరించుట, అట్టి ధర్మాచరణము ఇతరులకు మార్గదర్శకమై యుండుట, బ్రహ్మోపాస నము చేయుట, అది తపస్సుగ పరిణతి చెందుట, తపస్సు వలన తేజోమయ దేహమును పొందుట, అందు వసించుట, భూమిపై ప్రయోజనములు పరిపూర్తి కాగానే పార్థివ దేహమును త్యజించి ఊర్ధ్వముగ పోవుట ఋషి మార్గము లేక వెలుగు మార్గము. అదియే గురుమార్గము. అట్టివారే ఋషులు.**

విశేష మేమన, శరభంగ మహర్షి దేహ పరిత్యాగము చేసిన వెనుక ముప్పై సంవత్సరముల యువకునివలె గోచరించెనట. ఆది శంకరులు, వివేకానందుడు ఇత్యాది వారందరు కూడ అట్లే చరించిరి. శనిచక్రమగు కాలము ముప్పది సంవత్సరములు. జీవన ప్రయోజనము ఒక శని చక్రముననే పరిపూర్తి గావించుట అత్యద్భుతము.

# 86. పాలనా ధర్మ సూత్రములు

వనవాస మందున్న శ్రీరామునకు మహర్షులు ఈ క్రింది శాశ్వత ధర్మ సూత్రములను తెలిపినారు. ఇవి ముఖ్యముగ పాలనా ధర్మములు.

1. ప్రజలు పాలకులను గౌరవించవలెను. ప్రజల ధార్మిక చింతనను, ధర్మాచరణమును బట్టియే పాలకు లేర్పడుదురు. ప్రజల సగటు సంస్కృతియే వారి పాలకులను నిర్ణయించును.

2. పాలనకు వలసిన సదుపాయములను, సౌకర్యములను ఏర్పరచుటకు వలసిన ఖర్చు నిమిత్తమై ప్రజలు తమ ఆదాయములో ఆరవ వంతు పన్నుగ పాలకులకు సమర్పింపవలెను. పన్ను లెగ వేయుట, తప్పుడు లెక్కలు చూపుట వలన ప్రజలకు పాపమంటును.

3. పాలకులు ప్రజలను కన్నబిడ్డలవలె చూచుకొనవలెను. అట్లు కానిచో పాలకులకు అధోగతులు కలుగును. రక్షణ నీయ లేనివాడు పాలకుడుగ కొనసాగినచో అతడు హీనజన్మలు పొందును. తాను రక్షింపలేనని, పాలింపలేనని అవగతమైన వెంటనే పాలకులు పదవీ సన్యాసము చేయవలెను.

4. పాలకులు పన్నులు పేరిట ప్రజలను పీడింపరాదు. ఆరవ వంతు ఆదాయము కన్న పన్ను వసూలు చేయుట అధర్మము.

5. రాజ్యమందలి వనవాసీజనులు, తపస్విజనులు వన

మాధారముగనే జీవింతురు గనుక వారిపై పన్ను విధించరాదు. వారు చేయు తపస్సు, ఆరాధన, ఇతర ధర్మ కార్యముల వలన కలుగు పుణ్యములో నాల్గవ భాగము పాలకులకు లభించి వారిని బలవంతులను చేయును. కనుక తపస్విజనుల యందు, వనవాసీ జనులయందు పాలకులు విధేయత చూపవలెను. అట్టి సాధు జనులను హింసించు వారిని పాలకులు నిర్దాక్షిణ్యముగ దండింప వలెను. సాధుజనులను, గోవులను రక్షింపలేని రాజు హీనకులజుడై జన్మించును.

6. దుష్ట శిక్షణము, శిష్టరక్షణము ప్రధానమగు పాలకధర్మము.

7. సాధుజన ప్రీతి సకల శుభములను కలిగించును.

# 87. శ్రీరాముని దీక్ష - మహిమ

దైత్యుల నుండి జీవులను రక్షించుటకే పరతత్త్వము రామునిగ అవతరించినది. అసురత్వమును దగ్ధము చేసి, అమృతత్వము నావిష్కరించునది రామ శబ్దము. రామ మంత్రము వలన మానవుల యందలి అసుర శక్తులు నశించును. జీవ చైతన్యము అమృత తుల్యమై భాసించును. పరిసరముల లోపల, వెలుపల పవిత్రత ఏర్పడగ పరతత్త్వము భాసించును. కోదండమును హస్తమున ధరించి అప్రమత్తుడై అఖిల దైత్యులను సంహరించుటకే రాముడున్నాడు. సత్సాధకులకు విరోధులు తమ లోపలనే స్వభావముగ నుండుటచే అనేకానేకములైన బాధల నొందుచున్నారు. కోదండపాణి యగు రాముని అంతరంగమున స్మరణ చేసిన వారికి అసురభయము, శత్రుభయము ఉండదు. "రాక్షసుల నందరిని సంహరించి, సాధు జనులగు మిమ్ములను తప్పక నేను కాపాడుదును" అని ప్రతిజ్ఞ చేసినాడు. శిష్టులను రక్షించుట, దుష్టులను శిక్షించుట తన ధర్మమని ఎలుగెత్తి చాటినాడు. వ్యక్తిగతముగ అసురులతో తనకు శత్రుత్వము లేకున్నను సాధుజనుల హింసించు వారందరిని తాను సంహరింతునని ప్రతిజ్ఞ పూనినవాడు రాముడు.

సామాన్య జనుల పురోగతికి అవరోధములు తమ లోపల నుండి, వెలుపలినుండి కూడ వ్యక్తమగు చుండును. అట్టివారికి 'రామ' స్మరణమే ఉపాయము. ఆపదలను హరించువాడు రాముడు.

కోదండముతో అసుర సంహారము చేయువాడు రాముడు. అట్టి రాముని కీర్తనము ప్రతి హృదయమున జరుగుచు నుండవలెను. ప్రతి గృహమున కూడ జరుగుచు నుండవలెను. రామస్మరణమున ఆత్మ రమించు చుండగ ఆత్మారాముడు అపరిమిత ఆనందము నిచ్చుచుండును. ఇది పెద్దలు మనకిచ్చిన సంపద. దీనిని గూర్చి విచికిత్స కన్న దీని ననుసరించి రుచి తెలియుట వివేకము.

**1.** **ఆపదామపహర్తారం**
**దాతారం సర్వసంపదామ్ ।**
**లోకాభిరామం శ్రీరామం**
**భూయో భూయో నమామ్యహమ్ ॥**

**2.** **నమః కోదండహస్తాయ**
**సంధీకృత శరాయచ ।**
**ఖండితాఖిల దైత్యాయ**
**రామా ఆపన్నివారిణే ॥**

# 88. సుతీక్ష్ణుడు

భరద్వాజుడు, శరభంగుడు వంటి తపోధనులను కలసిన శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై సుతీక్ష్ణముని ఆశ్రమమునకు చేరెను. సుతీక్ష్ణుడు తీక్షణమైన తపస్సు గావించి, సర్వలోకాలను జయించినాడు. తపోబలముతో సర్వలోకములను జయించ వచ్చును. అట్టి తపస్సు ప్రధానముగ ఋషులు వనములందు, అరణ్య ప్రదేశములందు నేటికిని చేయుచు వసించుచున్నారు. భారతీయ సంప్రదాయమున తపస్సే సర్వోత్కృష్టమైన మానవధర్మము. తపస్సువలన సర్వలోకములు జయించుటయే గాక ఆయా లోకముల మిత్రత్వమును పొందవచ్చును. ఇహలోకమునకు ఎనలేని సహాయ సహకారము లందింప వచ్చును. తపస్వి జను లున్నచోట పంచభూతములు, ఖనిజములు, వృక్షములు, జంతువులు, మానవులు సామరస్యముతో వర్తింతురు. తపస్సు చేయు ఆశ్రమ ప్రాంతమంతయు ధర్మతరంగములతో నిండియుండును. అప్రయత్నముగనే ధర్మ మాచరింపబడును. అందరు జీవులు తుష్టి, పుష్టి కలిగి యుందురు. త్యాగబుద్ధి కూడ కలిగి యుందురు. ఒకరి కొకరు సహకరించుచు అవసరమైనచో త్యాగముతో వర్తింతురు. తమ కొరకు తాము జీవించుటగ గాక అందరి కొరకు తాను అను భావమున వర్తించు చుందురు.

సుతీక్ష్ణముని తీవ్ర తపస్వియగుటచే అతని దేహము అంతా బురద కొట్టుకొని జడలన్నియు దుమ్ము కొట్టుకొని యున్నవి. కాని

అతని ముఖము కాంతిప్రభలతో నున్నది. చూపులు తీక్ష్ణమైన సూర్య కిరణములవలె యున్నవి. అతనిని చూచి చూడగనే శ్రీరాముడు సీతా లక్ష్మణులతో సహా నమస్కరించి ఆశీర్వచన మపేక్షించినాడు.

**పెద్దలను దర్శించినపుడు హృదయ పూర్వకముగ నమస్కరించుట, ఆశీర్వచనము కోరుట శ్రీరామచంద్రుడు నిర్వర్తించి నేర్పిన ధర్మములు.** ధర్మము నెరిగిన రాముడు సకల గుణాభిరాముడు. అయినను వినయముతో ఎల్లవేళల పెద్దల ఆశీర్వచనము అపేక్షించినాడే కాని, వారితో సమతుల్యముగ భావింపలేదు. బ్రహ్మము నెరిగిన రామబ్రహ్మము బ్రహ్మవేత్తయైన సుతీక్ష్ణుని ఆశీర్వదించ ప్రార్థించుటలో అత్యున్నతమైన ధర్మమున్నది. తానెంత వాడైనను బ్రహ్మవేత్తలకు నమస్కరింపవలెనని, ఆశీర్వచనము కోరవలెనని శ్రీరాముడు తెలియజేసినాడు. వినయము, విధేయత లేని నరుడు భ్రష్టుడగును. అవిగల నరుడు దుస్థితుల బారిన పడినను క్రమముగ ఉత్తీర్ణుడగును. ధూర్తునకు అపజయములు పరంపరగ కలిగినట్లు వినయశీలునికి జయ పరంపర యుండును.

రాముని రాకను గమనించిన సుతీక్ష్ణుడు అతడు పరమ ధార్మికుడని ఎరిగి రెండు చేతులా కౌగలించుకొనెను. ధర్మ మెరిగిన వారే ధర్మాత్ములను గుర్తింపగలరు. తపస్వియగుటచే మూర్తీభవించిన ధర్మ విగ్రహముగ రాముని గుర్తించి అతనిని కౌగలించుకొనెను. ధార్మికునకు ధర్మ దర్శనమే ఆనందదాయకము. పరమానంద దాయకము. ధర్మమును దర్శించినపుడెల్ల ధార్మికునకు హృదయము పొంగును. అతిశయించిన ఆనందము వలన కౌగలించుకొను

ప్రయత్నము జరుగును. ధర్మ సమాగమమున ఆనందము, ప్రేమ ఉప్పొంగును.

రాముని వృత్తాంతము మునుపే ఎరిగిన సుతీక్ష్ణుడు తాను తపస్సువలన జయించిన లోకములన్నియు రామున కిచ్చుటకు ఉత్సహించెను. కేవల మయోధ్యా సామ్రాజ్యము కోల్పోయిన రామునకు సకల లోక సామ్రాట్టుగ తపోబలముచే ప్రతిష్ఠింతునని సుతీక్ష్ణుడు పలికెను. రామునికి జరిగిన నష్టమును వేయింతల లాభముతో పూరించవలెనని ముని ఆత్మవేదన. దానికి కారణము శ్రీరాముని ధర్మ తత్పరత. సుతీక్ష్ణుని దృష్టిలో శ్రీరాముడు ధర్మవేత్తలలో కూడ శ్రేష్ఠుడు. అట్టి వాని కేమిచ్చినను బ్రహ్మానందము కలుగును. అంతియే కాక ధర్మమునకు వెలగట్టుట అసాధ్యము గనుక సర్వము నిచ్చెద ననెను.

సర్వమును తెలిసిన రాముడు ముని సమర్పణమును సున్నిత ముగ తిరస్కరించి తన ధర్మ స్వరూపము నావిష్కరించెను. రాముని చూచిన సుతీక్ష్ణుడు రాముని కొరకు పరలోక ఆహ్వానమును కూడ తిరస్కరించి, తిరుగు ప్రయాణమున రాముని మరల చూచుటకై భూతలముపై నుండుటకు నిశ్చయించుకొనెను. దేవేంద్రుడే వచ్చి ఆహ్వానించినను భూమిపై రాముడుండగ ఇదియే వైకుంఠమని భావించి, రాముడు మరల పట్టాభిషిక్తుడగు సమయము వచ్చువరకు భూమియందుండుటకు నిశ్చయించుకొనెను.

స్వస్తి.


## ధనిష్ఠ ప్రచురణలు

















ప్రతులకు : ధనిష్ఠ ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org



దైత్యులనుండి జీవులను రక్షించుటకే పరతత్త్వము రామునిగ అవతరించినది. అసురత్వమును దగ్ధముచేసి అమృతత్త్వము నావిష్కరించునది రామశబ్దము. రామమంత్రము వలన అసురశక్తులు నశించును. జీవచైతన్యము అమృతతుల్యమై భాసించును.

అట్టి రాముని కీర్తనము ప్రతి హృదయమున జరుగుచు నుండవలెను. ప్రతి గృహమున కూడ జరుగుచు నుండవలెను. రామ స్మరణమున ఆత్మారాముడు అపరిమిత ఆనందము నిచ్చుచుండును. ఇది పెద్దలు మనకిచ్చిన సంపద.

ISBN 978-81-89467-50-0
9 788189 467500

ధనిష్ఠ